# పుస్తకపరిచయాలు

## 2007, 2008, 2009



శ్రీ

కౌముది

మీ మునివేళ్ళలో సాహితీ వెన్నెల

www.koumudi.net

కౌముది ప్రచురణలు - 117

# కౌముది లో 2007, 2008, 2009 సంచికలలో

# ప్రచురితమైన పుస్తకపరిచయాలు


| పుస్తకం పేరు | రచయిత(త్రి) | పేజీ |
|---|---|---|
| Twentieth Century Telugu Poetry | Syamala Kallury | 5 |
| ప్రవాసాంధ్రుల ఆశాకిరణం | శ్రీమతి పూడిపెద్ది శేషు శర్మ | 6 |
| స్వప్న జనిత రాగం | డా ఏల్చూరి విజయరాఘవరావు | 7 |
| అతని తోటలో | వి ఎస్ ఎస్ హేమ | 8 |
| ఏటి ఒడ్డున | మూలా సుబ్రహ్మణ్యం | 9 |
| శృంగార భర్తృహరి | డా. పెమ్మరాజు వేణుగోపాల రావు | 10 |
| పల్లెలో మా పాత ఇల్లు | ఇస్మాయిల్ | 11 |
| మాస్ట్రో డా గజల్ శ్రీనివాస్ ఓ నిరంతర స్ఫూర్తి | వి వి ఆర్ కృష్ణంరాజు | 12 |
| A Spectrum Of My People | నిడదవోలు మాలతి | 13 |
| Life | శాయి పద్మ మూర్తి | 14 |
| కథా ప్రహేళికా కథలు | వి వి న మూర్తి | 15 |
| అమెరికామెడి కథలు | వంగురి ఫౌండేషన్ | 16 |
| ప్రజాసాహితి | నిర్మలానంద్ | 17 |
| ఎలిజీలు | గొల్లపూడి మారుతీరావు | 18 |
| బాలి కార్టూన్లు | వంగూరి ఫౌండేషన్ | 19 |
| సామాన్య శాస్త్రం | కందుకూరి రమేష్ బాబు | 20 |
| కాంతి కిరణం | నిశాపతి | 21 |

| | | |
|---|---|---|
| కవికోకిల శ్రీ దువ్వూరి రామిరెడ్డి | కె వి రమణారెడ్డి | 22 |
| గట్టు తెగిన చెరువు | ఆరి సీతారామయ్య | 23 |
| ఊరు | కె వి నరేందర్ | 24 |
| వినవేడుక | మల్లాది రామకృష్ణ శాస్త్రి | 25 |
| కొమ్మ కొమ్మ కో సన్నాయి | వేటూరి సుందర రామమూర్తి | 26 |
| త్యాగరాజ కీర్తనామృతం | కల్లూరి సత్య రామ ప్రసాద్ | 27 |
| తెలుగు సినిమా సాహిత్యం | డా పరుచూరి గోపాలకృష్ణ | 28 |
| ఆరామ గోపాలమ్ | భమిడిపాటి రామ గోపాలం | 29 |
| ఆధ్యాత్మిక చిన్న కథలు | మల్లాది వెంకట కృష్ణమూర్తి | 30 |
| సినీ సుమాలు | వారాల ఆనంద్ | 31 |
| ప్రజాసాహితి | 300 సంచిక | 32 |
| హృదయంలో అడుగులు | స్వాతి శ్రీపాద | 33 |
| కాంచనమాల జీవిత చిత్రాలు | | 34 |
| అంబాలీస్ | బి పి కరుణాకర్ | 35 |
| అమృతం | మాస పత్రిక | 36 |
| ఖండాంతర కవిత్వం | వి ఆర్ విద్యార్థి | 37 |
| అమూల్య కానుక | ఆనందరావు పట్నాయక్ | 38 |
| సాయంకాలమైంది | గొల్లపూడి మారుతీ రావు | 39 |
| శ్రీ పద చిత్ర రామాయణము సుందరకాండము | జొన్నలగడ్డ సత్యనారాయణ మూర్తి | 40 |
| ఎన్నారై కబుర్లు ఒకటి ఎన్నారై కబుర్లు మరోటి | సత్యం మందపాటి | 41 |
| విజయలక్ష్మి రామకృష్ణన్ చిన్న కథలు | విజయలక్ష్మి రామకృష్ణన్ | 43 |
| కాలాంచలాలు | రామారావు | 44 |
| 9 దేశాల కథలు | ముక్తవరం పార్థసారధి | 45 |
| తల్లీ నిన్ను దలంచి | నిశాపతి | 46 |
| అమెరికాలో మరోసారి | మల్లాది వెంకట కృష్ణమూర్తి | 47 |

| | | |
|---|---|---|
| గురుదక్షిణ | ఆనందరావు పట్నాయక్ | 48 |
| సాత్రాజితీయం | కోదూరు శ్రీ పాండురంగారావు | 49 |
| వాన చినుకులు | వారణాసి నాగలక్ష్మి | 50 |
| నువ్వు లేని నేను | కె బాలకృష్ణారెడ్డి | 51 |
| ఆలంబన | వారణాసి నాగలక్ష్మి | 52 |
| మహాప్రస్థానం సమాలోచనం | మాదిరాజు రంగారావు | 53 |
| అక్షర క్షణాలు | జి సత్యనారాయణ | 54 |
| Stray Birds(తెలుగు అనువాదం) | బొల్లోజు బాబా | 55 |
| భ్రమణ  కాంక్ష | యం ఆదినారాయణ | 56 |
| స్వాతి చినుకులు | వేమూరి బలరామ్ | 57 |
| శ్రీ లలితా సహస్ర నామావళి | అత్తలూరి నాగభూషణమ్ | 58 |
| తలిరాకులు | ఉమ | 59 |
| గాలి పల్లకి | ఉమ | 60 |
| మహా నటి సావిత్రి | పల్లవి | 61 |
| గోరంతదీపం | మల్లాప్రగడ రామారావు | 62 |
| నిద్రితనగరం | డా వైదేహి శశిధర్ | 63 |
| మనిషి జాడ | ఎ మీ్వ రామిరెడ్డి | 64 |
| పల్లకి | శ్రీనివాస ఫణికుమార్ డొక్కా | 65 |
| తెలుగు పలుకు | తానా | 66 |
| ఔన్నత్యం | మల్లాది వెంకట కృష్ణమూర్తి | 67 |
| కొమ్మా కొమ్మా కోకిలమ్మ | ఇంద్రగంటి జానకీబాల | 68 |
| తెలుగు సినిమా స్వర్ణయుగం | డా ఎం వి రమణారెడ్డి | 69 |
| జీవన పోరాటం | గంటి భానుమతి | 70 |
| తెలుగులో క్రైస్తవ సంకీర్తనలు పరిశీలన | డా జేమ్మి సుధారత్నాంజలి నిట్టల | 71 |
| శీత వేళ రానీయకు | కుప్పిలి పద్మ | 72 |

| | | |
|---|---|---|
| 20వ శతాబ్దంలో అమెరికా తెలుగు కథానిక | వంగూరి ఫౌండేషన్ | 73 |
| అమెరికా అనుభవాలు | వేమూరి వెంకటేశ్వరరావు | 74 |




## Twentieth Century Telugu Poetry
## Syamala Kallury




**Published by**
**SHIPRA PUBLICATIONS**
**DELHI-110092**
**info@shiprapublications.com**
**www.shiprapublications.com**
**ISBN : 81-7541-293-3**

తెలుగుసాహిత్యం ఇతర భాషలలోకి అనువదించే ప్రక్రియ చాలా కాలంగా ఉన్నా, ముఖ్యంగా ఇంగ్లీషులోకి అనువాదాలు ఇటీవల కాలంలో ఎక్కువయ్యాయని చెప్పొచ్చు. గ్లోబలైజేషన్ కూడ ఇందుక్కారణం కావొచ్చు. ఐతే అనువాదాలన్నవి కత్తిమీద సాము లాంటివి. మూలంలోని భావాలకు ఏ మాత్రం భంగం వాటిల్లకుండా, వేరే భాషలోని అనువైన పదాలను వాడుకుంటూ ఆ భాష వారిని ఒప్పించడమనేది చాలా ప్రజ్ఞతో కూడినపని. అందునా కవిత్వమంటే మరింత శ్రద్ధతో సాగాలి. కవిత్వాన్ని అనువదించడం వచనాన్ని అనువదించడమంత సులువుకాదు.

ఢిల్లీ ఐ.ఐ.టిలో అధ్యాపకవృత్తిలో ఉన్న శ్రీమతి కల్లూరి శ్యామలగారు 20వ శతాబ్దంలోని ఆణిముత్యాల్లాంటి 100 వచన కవితల్ని ఆంగ్లంలోకి అనువదించి చక్కని పుస్తకంగా ప్రచురించారు. ఈ శతాబ్దపు తొలి కవులైన వెంకట పార్వతీశ్వర కవుల 'ఏకాంత సేవ' తో ఆరంభించి..బసవరాజు అప్పారావు గారు, గురజాడ అప్పారావు గారు, రాయప్రోలు సుబ్బారావు గారు, నండూరి సుబ్బారావు గారు, గుర్రం జాషువా, శ్రీశ్రీ ...మొదలైన వారినీ స్పృశించి, ఆధునిక కాలానికి చెందిన అద్దేపల్లి, సి.నా.రె., గోదావరి శర్మ, విన్నకోట రవిశంకర్, వసీరా, జయప్రభ, కొండేపూడి నిర్మల, ఆశారాజు.. లాంటివారి కవితా రీతుల్ని ఆంగ్లంలోకి అనువదించిన శ్యామలగారి కృషి అభినందనీయం. రకరకాల కవితారీతుల్ని సమానమైన భావావేశంతో అనువదించడం సామాన్యమైన విషయమేమీ కాదు. స్వతహాగా రచయిత్రి ఐన శ్యామలగారు ఈ కృషిలో పూర్తిగా సఫలీకృతమయ్యారనేది, ఈ పుస్తకాన్ని ఆసాంతం చదివిన వారికి అవగతమౌతుంది. ఇతర భాషలవారికే గాక, తెలుగు భాష రాని,తెలుగు కవిత్వం గురించి తెలుసుకోవాలనుకునే, ఆధునిక తెలుగు యువతరానికి కూడా ఈ పుస్తకం ఎంతో ఉపయోగకరం.




## ప్రవాసాంధ్రుల ఆశాకిరణం

## శ్రీమతి పూడిపెద్ది శేషుశర్మ

అమెరికా తెలుగు రచయిత్రి శ్రీమతి పూడిపెద్ది శేషుశర్మగారి కథా సంకలనం ఇది. వైద్య వృత్తిలో ఉన్న రచయిత్రి ఎక్కువగా ఆ నేపథ్యంలో ఉన్న కథలనే ఎన్నుకున్నా ప్రతికథా సజీవంగా కళ్ళముందు నిలుస్తుంది. ముఖ్యంగా ప్రతి కథకీ ఒక ఆలోచనాత్మకమైన ముగింపూ లేదా పరిష్కారాన్ని సూచించే ఆచరణాత్మకమైన సంఘటనల సమాహారం చిత్రించడం ఈ రచయిత్రి ప్రత్యేకత. ఇదే విషయాన్ని ప్రస్తావిస్తూ ముందుమాటలో "సమస్యలని గుర్తించడం, వాటికి పరిష్కార మార్గాలు కనిపెట్టడం- ఇవి శేషుశర్మ సృష్టించిన పాత్రల ప్రత్యేక విశిష్టత" అన్నారు శ్రీ పెమ్మరాజు వేణుగోపాలరావు గారు. ఇంద్రగంటి శ్రీకాంతశర్మ గారన్నట్లు "ఇవి బట్టలు నలగని జీవితాలలో మనస్సులు నలిగే మనుషుల కథలు". వంగూరి ఫౌండేషన్ వారి 26వ ప్రచురణగా వెలివడిన ఈ పుస్తకం ప్రవాసాంధ్ర రచనల్లో గుర్తింపు పొందే కథాసంకలనంగా నిలిచిపోతుందనడంలో సందేహం లేదు.

**Published by**
**Vanguri Foundation America Inc.**
**PO Box 1948, Stafford**
**TX 77497 , USA**
**rvanguri@wt.net**
**ISBN : 1-892408-16-3**







**Published by:**
**Mrs.Renuka Kasarabada**
**L-42 Diamond Dst.**
**Bangalore – 560 008**

## స్వప్నజనితరాగం

### డా.ఏల్చూరివిజయరాఘవరావు

ప్రముఖవేణుగాన విద్వాంసులు, సంగీత దర్శకులు, కవి, కథా రచయిత ఐన శ్రీ ఏల్చూరి విజయరాఘవరావు గారి కథా, కవితా సంకలనం ఈ స్వప్నజనితరాగం. పేరు ఎంత భావుకతతో నిండి వుందో ఆయన కవితలూ , కథలూ కూడా అంత భావాత్మకంగా వున్నాయి. ఆంధ్రదేశంలోని బహుముఖ ప్రజ్ఞావంతులలో అంతర్జాతీయంగా కీర్తి గడించిన వారు శ్రీ విజయరాఘవరావు గారు. ఈ సంపుటిలో 8 కథలూ, పాతికకి పైగా కవితలూ ఉన్నాయి. వీరి కవితల్లో భావుకతతో పాటు, సామాజిక స్పృహకూడా నిండుగా కనిపిస్తుంది.

*సప్త సముద్రాలు దాటి, సాగరమథనం చేస్తూ*
*అందని మరీచికలు పంచిన అంధకారశూన్యంలో*
*తటిల్లతల దీప్తి చూపి, తనువు నిమిరి, సేదదీర్చు*
*నిశ్చల నిర్మల ప్రేమకు నిర్వచనం నాదేశం..*

అని ప్రారంభించి,

*తలుపులన్నీ తెరిచి*
*తనివితీర వెలుగుపంచు*
*తిమిరంతో సమరమే*
*తియ్యని జీవితానికి గురి*

అని నాందీప్రస్తావన కావించిన ఈ పుస్తకంలోని కథలు మనల్ని మరో లోకంలోకి తీసుకెళ్ళి మనుషుల మనస్తత్వాలకు నిలువుటద్దంగా నిలుస్తాయి..




Published by
Smt.VSS Hema
81 A / C, MLA Colony
Road# 12, Banjara Hills
Hyderabad – 500 034

## అతనితోటలో

### వి.ఎస్.ఎస్.హేమ

అతనితోటలో.. వి.ఎస్.ఎస్.హేమ గారి అందమైన కవితా సంపుటి. ముఖచిత్రం ఎంత ఆకర్షణీయంగా, వర్ణభరితంగా వుందో ఇందులోని కవితలుకూడా అంత అందంగానూ ఉన్నాయి. కవితాప్రియులకు ఈ సంపుటి ఒక తేట తేనియ విందు...

*'యవ్వన గ్రీష్మానికి వాసంతికనౌతాను*
*వెన్నెలను సేవించి, వింటినారిని సంధించి*
*పుట్టిన ప్రతిమొగ్గనూ మోహించి*
*యవ్వనామృతంతో నింపేస్తాను '*

అని ప్రకటించిన కవయిత్రి ప్రతి కవితలోనూ కొత్త భావాలను సృజించి, కొత్త అందాలను దర్శింపచేస్తారు. ప్రతి కవితకూ ఓ అందమైన చిత్రం జోడించబడడం ఒక ప్రత్యేకత. మధ్య మధ్యలో సందర్భోచితంగా ఠాగోర్, తిలక్, ప్రభృతుల కవితా చరణాల్ని పేర్కొని పుస్తకాన్ని మరింత ఆకర్షణీయంగా తీర్చి దిద్దిన హేమ గారి కవితా హృదయానికి పాఠకులు అభినందనలు తెలపకుండా ఉండలేరు.







**Published by:**

**Mula Subrahmanyam**

**Subrahmanyam.mula@gmail.com**

మూడేళ్ళ క్రిందట ప్రచురణకోసం ఒక కవిత పంపిస్తూ, మూలా సుబ్రహ్మణ్యం ‘ఇప్పుడే కొత్తగా కవితలు వ్రాయడం మొదలు పెట్టాను” అన్నప్పుడు నమ్మబుద్ధి కాలేదు. అంత మెచ్యూరిటీ కనిపించింది ఆ భావాల్లో.

గత మూడు , నాలుగు సంవత్సరాలుగానే కవిత్వం వ్రాస్తున్న యువ కవి మూలా సుబ్రహ్మణ్యం గారి కవితా సంకలనం ఈ ‘ఏటి ఒడ్డున‘. వీరి కవితలో ప్రత్యేకత కుప్తత, సాంద్రత, గాఢత.. అతి చిన్నపదాలతో అతి కొద్ది వాక్యాలలో అనంతమైన భావాన్ని ఆవిష్కరించడం ఈయనకి బాగా పట్టుబడిన శైలి.

*”పెదాల గులక రాళ్ళపై*
*గలగలా పారుతున్న*
*చిరునవ్వుల వాగులు*
*ఇంకాస్త మీదకెళితే*
*కళ్ళల్లోంచి జారుతున్న*
*కన్నీటి జలపాతాలు*
*దారి పొడవునా*
*ఎగుడు దిగుళ్ళే”*

ఆలోచించినకొద్దీ కొత్త అర్థాలు స్ఫురింపచేసి, ఇంకా ఇంకా ఆలోచింపచేసే వాక్యాలకివి ఒక చిన్న ఉదాహరణ మాత్రమే..

*” .........*
*అస్తమిస్తున్న సూర్యుడి నుంచి*
*ఆలయంలోని చిన్ని దీపం*
*అంపశయ్యపై ఆదర్శమూర్తినుంచి*
*ఉయ్యాలలోని ఆశారూపం*
*ఒకరి చేతిలోని వెలిగే జ్యోతి*
*మరొకరందుకొనక తప్పదు”*

అంపశయ్య, ఉయ్యాల పోలిక గమనించండి.. అస్తమిస్తున్న సూర్యుడినీ, ఆలయంలోని దీపాన్నీ గుర్తు తెచ్చుకోండి.. ఎంత చక్కటి పదచిత్రాలు.. వాటిలో ఒదిగిన ఎంత గాఢమైన భావ సంపద..!

కవితాప్రియులంతా తప్పక చదవాల్సిన పుస్తకం. విన్నకోట రవిశంకర్ గారు దీనికి ముందు మాట రాశారు.




భర్తృహరి అనగానే చిన్నప్పుడు స్కూలు పుస్తకంలో చదువుకున్న సుభాషితాలు గుర్తు రావడం అతి సహజం. ఐతే ఆయన కేవలం నీతిశతకమే కాకుండా మరో రెండు శతకాలు కూడా వ్రాసాడని, అందులో ఒకటి శృంగార శతకమనీ చాలా మందికి తెలియక పోవచ్చు. ఆయన ఈ శృంగార శతకం వ్రాయడం వెనుక ఒక ఆసక్తికరమైన కథ కూడా వుందని తెలియచేస్తూ , సంస్కృతంలో రచించబడిన ఆ శృంగార శతకాన్ని తెలుగులోకి అనువదించారు డాక్టర్ పెమ్మరాజు వేణుగోపాలరావు గారు. స్వతహాగా ఫిజిక్స్ ప్రొఫెసర్ ఐనా డాక్టర్ రావుగారికి గల సాహిత్యాభిలాష, సాహిత్య ప్రవేశం గురించి తెలుగువారందరికీ తెలుసు. ఈ శృంగార భర్తృహరి గ్రంథాన్ని సరళమైన , అందమైన తెలుగులో అటు పద్యాల చందస్సు చట్రంలోనూ బిగించకుండా, ఇటు పూర్తి వచనంలానూ కాకుండా మధ్యే మార్గంగా అందమైన పద చిత్రాలతో మూలభావానికి భంగం రాకుండా అతి చక్కగా మన ముందుకి తెచ్చారు డాక్టర్ రావు గారు.

*"వయ్యారముగ నడుగులేయుచు*
*కనుబొమల నీటుగ తిప్పుచు*
*వాలుకంట వీక్షించు చూపులు*
*నెయ్యమొలుకు తియ్యని మాటలు*
*సిగ్గులొలికించు చిరునవ్వులు*
*భామలకు శృంగార భూషణములు*
*పురుషుల చెరబట్టు ఆయుధములు"*

ఇలా జాలు వారిన ఈ అనువాద కవితా కదంబానికి బాపు చిత్రీకరించిన ముఖచిత్రం మరింత వన్నె తెచ్చింది.

**Published by**
**Vanguri Foundation**
**America Inc.**
**PO Box 1948, Stafford**
**TX 77497 , USA**
**rvanguri@wt.net**
**ISBN : 1-892408-17-1**







**Published by:**
**Desi Books**
**Thammineni YadukulaBhushan**
**14 Ashley CT, Somerset**
**Newjersey – 08873, USA**

న్యూజెర్సీ లోని దేశీ బుక్స్ ప్రచురించిన ఈ కవితా సంకలనంలో ఇస్మాయిల్ గారి స్వీయ కవితలు, హైకూల తో బాటుగా వారు అనువదించిన అన్యభాషా కవితలూ, హైకూలు కూడా ఉన్నాయి. అనువాద కవితల్లో కూడా ఏ మాత్రం కవితాత్మ లోపించకుండా ఇస్మాయిల్ గారు మనకందించిన విధానం అద్భుతంగా వుంది. యూసుఫ్ అల్ ఖాల్ ( అరబ్ కవి) అనువాద కవితలో .."

*మనల్ని మేలుకొలిపే స్వప్నాలు లేవు*
*స్వప్నాల మరణమే మనల్ని మేలుకొలుపుతుంది.."* అంటారు..

మహమూద్ దర్వీష్ అనే కవికి అనువాదాల్లో..

*"మట్టితో నా పద్యాలు*
*మలచిన రోజున*
*పచ్చని చేలకి స్నేహితుణ్ణి.*
*తేనెగా నా పద్యాలు*
*మారిన రోజున*
*మూతిపై ఈగలు వాలాయి"* అంటారు..

ఇస్మాయిల్ గారి స్వీయ కవితల గురించి వేరుగా చెప్పాల్సిన అవసరం లేదు. .. అతి చిన్న పదాల్లో అనంతమైన అర్థాన్నీ, ఆత్మనీ కూర్చడం వారి ప్రత్యేకత.

మచ్చుకి కొన్ని పంక్తులు..

*"అరణ్యంలో వేటకై పొంచుంది పులి*
*కాగితంపై కవితకై పొంచున్నాడు కవి:*
*కళ్ళల్లో సానబెట్టిన*
*కత్తుల మెరుపులు."*

*"దేని కోసం బతకటం?*
*పూల నడిగి*
*తెలుసుకో!"*

కవితా ప్రియులకో విందుభోజనం ఈ పుస్తకం..!




**Published by**
**Ghazal Charitable Trust.**
**Anand Nagar, Khairatabad**
**Hyderabad – 500 004**
**Phone: 040-66611530**
ghazalcharitabletrust@yahoo.co.in

గజల్ శ్రీనివాస్ గురించి చాలా మంది విని వుండవచ్చు కానీ ఆయన గురించి ఇంత సమగ్రమైన పుస్తకం వెలువడడం ఇదే మొదటి సారి. గజల్ శ్రీనివాస్ ఒక విలక్షణమైన కళాకారుడు. ఒక విధంగా చెప్పాలంటే అతనికి అతనే ఒక ప్రత్యేకత కలిగిన కళాకారుడు. పీడితులకోసం, తాడితులకోసం రచనలు చేసేవాళ్ళని , వాళ్ళ బాధల్ని గానం చేసేవాళ్ళని చూశాం..అలానే వాళ్ళకి వాస్తవంగా ఆర్థిక సహాయం చేసేవాళ్ళనీ చూశాం. కానీ ఈ రెండురకాల వ్యక్తులూ వేర్వేరు. కళాకారుడు నిరుపేదల కష్టాలమీద కవితలల్లకలడు, కానీ నిజంగా వాళ్ళకి సహాయం చేసే శక్తి వుండక పోవచ్చు. ఈ రెండు రకాల వ్యక్తులకీ వారధిలా గజల్ శ్రీనివాస్ పేదలగురించి పాడడం కాకుండా, పాడిన పాటలతో సంపాదించిన ధనాన్ని పేదల కోసం వినియోగిస్తాడు. ప్రజాకళ అన్న పదానికి నిజమైన నిర్వచనం చూపిస్తున్నాడు. అలాంటి శ్రీనివాస్ పాటల ప్రస్థానం ఎలా మొదలైంది, ఆదిలో ఎన్ని కష్టాలు అనుభవించాడు, ఒకప్పుడు తన పాట మొదలవగానే లేచిపోయిన జనాల స్థాయినుంచీ ఈ నాడు వేలాది మందిని కొన్ని గంటలపాటు కట్టి పడేసే సమ్మోహనశక్తిని ఎలా పెంపొందించుకున్నాడు, ఎలా కళార్జనని ప్రజోపయోగం వెచ్చిస్తున్నాడు..మొదలైన వివరాలన్నీ ఆసక్తికరమైన కథారూపంలో ఈ పుస్తకంలో పొందుపరచబడ్డాయి. సవివరంగా అనేక ఫోటోలు కూడా ఇందులో చోటు చేసుకున్నాయి. పుస్తకం పేరు సూచిస్తునట్లు గానే నిరంతర స్ఫూర్తితో ప్రయాణించే గజల్ శ్రీనివాస్ జీవితగమనానికి ఇదొక దర్పణం.







**Published by:**
**Jaico Publishing House**
**121 Mahatma Gandhi Road**
**Mumbai – 400 023, India**
**www.jaicobooks.com**

ఇటు తెలుగు లోనూ, అటు ఇంగ్లీషులోనూ కథలు వ్రాస్తూ ఉభయభాషా రచయిత్రిగా పేరుతెచ్చుకున్న నిడదవోలు మాలతి గారు ఈ అరుదైన ఆంగ్ల పుస్తకాన్ని వెలువరించారు. రచయిత్రి ముందు మాటలో చెప్పినట్లు - ఈ పుస్తకం యొక్క ముఖ్యోద్దేశం ఆంధ్రేతరులకి తెలుగు సంస్కృతి, జీవన విధానాలని ప్రతిబింబించే తెలుగు కథలని ఆంగ్లంలో అందించడం. ఈ అనువాద కథా సంపుటిలో మొత్తం 18 కథలున్నాయి. తెలుగు వారి జీవన శైలిలోని వివిధ అంశాలని పరిగణనలోకి తీసుకుని తెలుగువారి గ్రామీణ జీవన చిత్రణ, వారి ఆలోచనా విధానం. కుటుంబ వ్యవస్థలోని సమస్యలూ, పరిష్కారాలూ, మానసిక బలహీనతలూ, వాటిని అధిగమించేందుకు సమాజం వారికి చూపించే వివిధ మార్గాలూ..ఇలా వివిధకోణాలని ప్రతిబింబించే కథలని ఎన్నుకుని వాటిని ఆంగ్లంలోకి తర్జుమా చేసి ఈ సంకలానాన్ని వెలువరించారు. ఇందులో కాళీపట్నం రామారావు, ముళ్ళపూడి వెంకట రమణ, అబ్బూరి ఛాయాదేవి, డి.కామేశ్వరి, వసుంధర, బీనాదేవి, రావిశాస్త్రి, లత, సి. ఆనందారామం..లాంటి ప్రముఖ రచయిత(త్రు) ల కథలు చోటు చేసుకున్నాయి. ప్రతి కథకీ ముందర రచయిత / త్రి ల సంక్షిప్త పరిచయం కూడా బావుంది. కేవలం ఆంధ్రేతరులకే కాకుండా మనదేశానికి బయట నివసిస్తున్న ఈ తరం ఎన్నారై పిల్లలకి కూడా , ఒక నాటి మన సాహిత్యంలోని గొప్పకథల్ని చదివే అవకాశాన్ని కలిగిస్తుందీ పుస్తకం. ఎంతో విస్తృతమైన పరిధి గల తెలుగు కథా ప్రపంచంలో గత అర్ధశతాబ్దంలో వచ్చిన వేలాది కథలనుంచీ తెలుగు జీవన చిత్రణకి ప్రతీకలు అనదగిన కథల్ని ఎంపిక చేయడం,వాటి లోని మూలభావాలూ రచనా శైలి దెబ్బతినకుండా ఆంగ్లీకరించడం కత్తిమీద సాములాంటిదే.ఈ ప్రక్రియలో రచయిత్రి విజయం సాధించారు.




విజయనగరంలోని Lions Family Welfare Planning Trust అనే నాన్-ప్రోఫిట్ సంస్థకి ఛీఫ్ ఎక్జిక్యూటివ్ ట్రస్టీ గా పనిచేస్తున్న తెలుగు వనిత శాయిపద్మ మూర్తి గారు రచించిన ఆంగ్ల కవితా సంపుటి ఈ పుస్తకం. ఈ కవితా సంపుటికి లైఫ్ అన్న పేరు పెట్టడంలోనే కవయిత్రి తన భావుకతని చాటుకున్నారు. 38 కవితలున్న ఈ సంపుటిలో ప్రతి కవితా దేనకదే ప్రత్యేకంగా నిలబడుతుంది. ... Murmurs of Silence, Sensuous serenity, Clueless Q's, Blanket Emotinal వంటి కవితా శీర్షికలను బట్టే కవయిత్రి ఆలోచనా ధోరణి అవగతమౌతుంది. సరళమైన శైలిలో చక్కటి విశ్లేషణ, అద్భుతమైన పదచిత్రాలు, ఆలోచింపచేసే వాక్యాలూ ఈ సంపుటి ప్రత్యేకతలు. ఇందులోని చాలా కవితలు ఇంటెర్నెట్ లో అక్కడక్కడా ప్రచురించబడి రచయిత్రి గారికి అనేకమంది అభిమానుల్ని సంపాదించి పెట్టాయి.

..In my insomniac nights-I met life one day!! – So alone, when I am home alone..- Waiting patiently at my door step..- For missing people and – Great Days , which seldom happen..!! ,

Walking through shadows – Numb mind and thoughts frozen – Wry smile at the corner of lips – Remember the day when you left me forever.. లాంటివాక్యాలు రచయిత్రి గాఢమైన ఆలోచనలకీ, ఊహా శిల్పాలకీ కొన్ని ఉదాహరణలు..









ప్రముఖ మాస పత్రిక ‘రచన‘ ప్రారంభించిన కొత్తలో డిసెంబర్ 1991 నుంచీ అక్టోబర్ 1992 వరకూ ఒక వినూత్నమైన ప్రయోగం చేసింది. ‘కథ ప్రహేళిక‘ పేరుతో, రచయిత పేరు బయటపెట్టకుండా, నెల నెలా ఒక కథని ప్రచురించి, రచయితల విశ్లేషణలని ఆహ్వానించింది. ఆ నెల కథాప్రహేళిక లోని కథలో ఉన్న మంచి చెడుల్ని వివరంగా వ్రాయమని, మంచి వ్రాసిన వాళ్ళలో కొంతమందికీ, లోపాల్ని ఎత్తి చూపినవాళ్ళలో కొంతమందికీ నెలనెలా బహుమతుల్ని ప్రకటించింది. ఒకే రచయిత నెల కొకటి చొప్పున 9 కథలు వ్రాసి నెలనెలా పాఠకుల కోర్టులో తీర్పుకోసం నిలుచునే వాళ్ళు. ఈ ప్రయోగం అత్యద్భుతమైన ఫలితాలనిచ్చి, తెలుగు పాఠకుల నాడికి అద్దం పట్టింది. చివరి వరకూ అజ్ఞాతంగా వుండి ఈ కథలన్నింటినీ వ్రాసిన వారు ప్రముఖ రచయిత శ్రీ వి.వి.న.మూర్తి. పాఠకుల తీర్పుకోసం వెలువడుతున్న కథలు కాబట్టి నెలకో రకమైన అంశాన్ని, వివాదాస్పదంగా ఉండే ఇతివృత్తాలని ఎన్నుకుని, వరుసలో ఒక ఆరోహణ, అవరోహణ క్రమాన్ని పాటిస్తూ, పాఠకులని ఆకర్షించడమనేది అంత తేలికైన పని కాదు. ఈ కీలకమైన ప్రక్రియని అవలీలగా నిర్వహించిన వి.వి.న. మూర్తి గారి కథలన్నింటినీ పాఠకుల విశ్లేషణతో సహా ప్రచురించారు వాహినీ బుక్ ట్రస్ట్వారు. కథలన్నీ ముగిసాక వాటికొక గ్రేడింగ్ ని కూడా ఆహ్వానించారు. ప్రముఖ రచయిత కాళీపట్నం రామారావు గారు కూడా వాటికి ఒక గ్రేడింగ్ ఇచ్చారు. వీటన్నింటినీ, రచయిత మనసులోని మాటతో సహా కలిపి ప్రచురించిన ఈ పుస్తకం కథారచయితలు కాబోయేవారికి చక్కటి మార్గదర్శి. అభిరుచిగల పాఠకులకి ఒక విలువైన కానుక ఈ పుస్తకం.

**Published by:**
**Vahini Book Trust**
**1-9-286/3, Vidyanagar**
**Hyderabad – 500 044, India**




విదేశాంధ్ర పాఠకులకి, ముఖ్యంగా అమెరికాలోని తెలుగు పాఠకులకి వంగూరి చిట్టెన్‌రాజు గారి గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. ప్రతినెలా 'కౌముది' లో (అపుడప్పుడూ వారు బద్ధకించినప్పుడు తప్ప!) వస్తున్న అమెరికామెడీ కి వస్తున్న విశేషమైన ప్రతిస్పందనే ఇందుకు ఓ నిదర్శనం. ఆయన గత ఐదారు సంవత్సరాలుగా అక్కడక్కడా వ్రాసిన కథలన్నింటినీ (అన్నీ హాస్య కథలే అని వేరుగా చెప్పాల్సిన అవసరం లేదనుకుంటాను) కలిపి అమెరికామెడీ కథలు అనే పేరుతో ప్రచురించారు. సాధారణంగా హాస్య రచనలు అనగానే ఎదుటి వారి బలహీనతల్ని ఎగతాళి చేస్తూ నవ్వించాలనే ప్రయత్నాలు ఎక్కువ. ఐతే తననీ, తన కుటుంబసభ్యులనే ఎక్కువగా ఈ హేళనకి టార్గెట్‌లుగా చేసుకుని ఎవరినీ నొప్పించకుండా, అవసరమైన చోట తమమీదే జోక్‌లు వేసుకుని, కడుపుబ్బ నవ్వించే ఆరోగ్యకరమైన హాస్యం గుప్పించడం చిట్టెన్‌రాజు గారి ప్రత్యేకమైన శైలి. 24 కథలున్న ఈ సంపుటిని గత సంవత్సరం - ఆంధ్రదేశం లోని ప్రముఖ నగరాలన్నింటిలో ప్రముఖులు - ఆవిష్కరించారు. (విజయవాడ ఆవిష్కరణ సభలో పాల్గొనే అవకాశం 'కౌముది' కి లభించింది). వంగూరి ఫౌండేషన్ వారి 25వ ప్రచురణగా వెలువడిన ఈ పుస్తకం తెలుగు హాస్యప్రియులంతా తప్పక చదివి తీరాల్సిన నవ్వుల పువ్వుల కదంబం..!

**Published by**
**Vanguri Foundation of America Inc.**
**PO Box 1948, Stafford**
**TX 77497, USA**
**Ph. 281-277-0445**







ప్రజా కళల ప్రతినిధిగా, సాంస్కృతికోద్యమాలతో మమేకమై గత 30 సంవత్సరాలుగా వెలువడుతున్న ప్రజాసాహితి ప్రత్యేక సంచిక అందింది. ఈ సంచిక మాక్సిమ్ గోర్కీ సృష్టించిన 'అమ్మ' నవలకి వందేళ్ళు పూర్తైన సందర్భంగా వెలువడింది. ఒక నవల ప్రపంచ సాహిత్యంలో వందేళ్ళు నిలిచి, ఇంకా పాఠకుల్ని ప్రభావితం చేయడమనేది చాలా విశేషం. అలాంటి నవలని మరొకసారి తరచి చూడడమనే బృహత్కార్యాన్ని ఈ ప్రజాసాహితి సంచిక సమర్ధవంతంగా నిర్వహించింది. ఈ సంచికలో అమ్మ నవల గురించి అనేక వ్యాసాలు, విశ్లేషణలూ, ఉన్నాయి. 'అమ్మ' నవలలోని పాత్రల పరిచయం, అమ్మ నవలలోని విశేషాంశాలూ, గోర్కీ గురించిన సమాచారం, అమ్మ నవల తెలుగు అనువాదానికి క్రొవ్విడి లింగరాజు గారు రాసిన ముందు మాటా, అమ్మ నవల గురించీ, గోర్కీ గురించీ కవితలూ..ఇలా అన్ని ప్రక్రియలూ అమ్మ నవలని మరింత లోతుగా అర్థం చేసుకోవడానికి ఉపయోగపడతాయి. ఇలా ఒక అంతర్జాతీయ నవల గురించి ఇంత సమగ్రమైన సంచిక రావడం ఇదే మొదటి సారేమో.. సంపాదకీయంలో రాసినట్లుగా " ప్రపంచంలో ఉండే శ్రమజీవులంతా ఒక్కటే అన్న మానసిక సన్నిహితత్వం, అపరిమితమైన ఆనందాన్ని, ఆశనూ కలిగించే ఈ భావ సమైక్యతా జీవశక్తిని 'అమ్మ' నవల నేటికీ మనకు అందిస్తోంది. ఈ స్ఫూర్తిని నూతన తరాలకి అందిద్దాం.."

ఇంకా ఈ సంచికలో ఇటీవలే దివంగతులైన వల్లంపాటి వెంకట సుబ్బయ్య గారి గురించిన వ్యాసాలూ, ఒకటి రెండు కథలూ కూడా ఉన్నాయి. సాహితీ ప్రియులూ, అమ్మ నవల గురించి లోతుగా తెలుసుకోగోరిన వాళ్ళూ తప్పక చదివి దాచుకోవాల్సిన సంచిక ఈ ప్రత్యేక ప్రజాసాహితి.

గౌరవ సంపాదకుడు

నిర్మలానంద్

సంపాదకుడు

పి.ఎస్.నాగరాజు

సంచారవాణి: 94419 13829




గత అర్ధశతాబ్దం పైగా తెలుగు సాహిత్య రంగంలో ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న బహుముఖ ప్రజ్ఞాశాలి, శ్రీ గొల్లపూడి మారుతీ రావు గారు. నాటకాలు, నాటికలూ, నవలలూ,కథలూ, వ్యాసాలూ, సినిమా సంభాషణలూ, సినిమా స్క్రీన్ ప్లేలు, కవితలూ ..ఇలా అన్ని ప్రక్రియల్లోనూ తన ప్రత్యేకతని నిలుపుకున్నారు మారుతీరావుగారు. వీరు వివిధ పత్రికల్లో రాసిన/ రాస్తున్న కాలమ్స్‌కి విశేషమైన పాఠకాదరణ ఉంది. రెండు దశాబ్దాల పాటు ఆంధ్ర జ్యోతిలో జీవనకాలమ్ నిర్వహించారు. ఇన్నేళ్ళ సాహితీ, సినిమా ప్రస్థానంలో ఆయనకి పరిచయమైన వ్యక్తులూ, చేరువైన సన్నిహితులూ ఎంతో మంది ఉన్నారు. వారు ఈ లోకాన్ని విడిచి వెళ్ళినప్పుడు వారిని గుర్తుచేసుకుంటూ వివిధ పత్రికల్లో వివిధ సందర్భాల్లో రాసిన వ్యాస సంపుటే 'ఎలిజీలు'. ఇందులో మదర్ థెరిసా నుంచీ పొట్టి ప్రసాద్ వరకూ అన్ని రంగాల వాళ్ళగురించీ ఆత్మీయమైన జ్ఞాపకాలు ఉన్నాయి. ప్రతి వ్యాసంలోనూ మనసుని కదిలించే వాక్యాలూ, ఆలోచింపచేసే భావాలూ అనేకం ఉన్నాయి. ఆయన షష్టిపూర్తి సందర్భంగా 1998 లో మొదటిసారి ప్రచురించబడిన ఈ పుస్తకం రెండో ముద్రణ మొన్న మే నెలలో వెలువడింది. ఇవి కేవలం వారి అనుభవాలు, జ్ఞాపకాలు మాత్రమే కాదు ఆయా వ్యక్తుల గురించిన చారిత్రక సత్యాలు కూడా.

**Gollapudi Maruthi Rao**
**8, Saradambal Street**
**Gokulam Colony**
**T.Nagar**
**CHENNAI – 600 017**







ఆంధ్రదేశంలో చాలా మంది చిత్రకారులు చిత్రకారులుగానూ, కార్టూనిస్టులు కార్టూన్లకే పరిమితమైపోయి మిగిలి పోయారే తప్ప రెండు రంగాల్లోనూ సమానమైన ఖ్యాతిని తెచ్చుకున్నవాళ్ళు చాలా అరుదు. బాపు, చంద్ర, బాలి అందులో ప్రముఖులు. కార్టూన్ చిత్రీకరణ ఒకకళ. బొమ్మచూడగానే నవ్వు రావాలి, చిన్న స్ట్రిప్ లోనే సన్నివేశాన్ని చూపించాలి, పైగా వ్యాఖ్యానం సటిల్‌గా, కుప్తంగా, ఒక్కోసారి కొంచెం వక్రంగా కూడా వుంటూ పాఠకుల్ని ఇట్టే కట్టుకోవాలి. ఈ కళలో ఆరితేరిన ప్రముఖ చిత్రకారుడు బాలిగారి కార్టూన్ల సంకలనం ఈ పుస్తకం. దాదాపు రెండు దశాబ్దాల తరువాత వెలువడిన బాలి గారి రెండో కార్టూన్ల పుస్తకం ఇది. అన్ని ప్రముఖ తెలుగు పత్రికల్లోనూ వచ్చిన ఈ కార్టూన్లు ఆరోగ్యకరమైన హాస్యాని పంచిపెడతాయి. కేవలం రేఖాచిత్రాలే కాకుండా కార్టూన్లలో బాలి గారు చేసిన ప్రయోగాలు డ్రూడిల్స్, - ఒక్కో వ్యాఖ్యకి మరో కోణంలో వినిపించే వ్యంగ్యార్థాలు..లాంటివి కూడా ఉన్నాయి. మొత్తం పేజీల్లో నవ్వుల పువ్వుల్ని నింపుకున్న ఈ పుస్తకాన్ని వంగూరి ఫౌండేషన్ వారు ప్రచురించారు. బాలి గారి గురించి బాలి గారి పాత్రలు పరిచయం చేయడం చాలా వైవిధ్యంగా ఉంది.. కవర్ పేజీ, చివరి పేజీ, ముద్రణా.. చాలా ఆకర్షణీయంగా వున్నాయి.

**Published by**
**Vanguri Foundation America Inc.**
**PO Box 1948, Stafford**
**TX 77497 , USA**
**rvanguri@wt.net**
**ISBN : 1-892408-20-1**

*********

# జాన్, 2007

A tribute to John Abraham, an avant-garde film director



కందుకూరి రమేష్ బాబు

సామాన్యశాస్త్రం

ఎనిమిదో పుస్తకం

*కందుకూరి రమేష్ బాబు*

*ఇ.నె. 1-6-212/6/ ఎ*

*మొదటి అంతస్తు, వెస్లీ స్కూలు ఎదురుగా,*

*పార్శి గుట్ట, హైదరాబాదు - 20*

*ఫోన్: 99480 77893*

పాత్రికేయుడు కందుకూరి రమేష్ బాబు చిన్నపుస్తకాల ప్రచురణ ఒక ఉద్యమంలా సాగిస్తున్నారు. 'సామాన్య శాస్త్రం' అనే శీర్షికతో ప్రచురించిన తొమ్మిది పుస్తకాల్లో ఇది ఎనిమిదవ పుస్తకం. 'సామాన్య' అంటే సామాన్యులగురించి వ్రాస్తున్న పుస్తకాలు అనే అర్థంలో వాడారు. ఈ పుస్తకాలు సుమారుగా 50 పేజీలు దాటకుండా ఉంటాయి. సామాన్యుల్లో కూడా విలక్షణ వ్యక్తిత్వం కలిగిన వాళ్ళ గురించి వ్రాస్తారు రమేష్ బాబు గారు. ఈ పుస్తక ప్రచురణకి కూడా మిత్రులు తలా కొంతా సాయం చేస్తున్నారని వారి పేర్లని ముందుపేజీల్లో పేర్కొన్నారు. రమేష్ బాబు చేస్తున్న ఈ ప్రయోగం నిజంగా విలక్షణమైంది, అభినందనీయమైంది. రెండు దశాబ్దాలక్రిందట మరణించిన ప్రఖ్యాత మళయాళీ దర్శకుడు జాన్ అబ్రహామ్ గురించిన వివరాలతో నిండినదీ పుస్తకం. బ్రతికినంత కాలం విపరీతధోరణి కలవాడిగా పేరుతెచ్చుకుని, 15 సంవత్సరాల వ్యవధిలో కేవలం 4 సినిమాలను మాత్రమే రూపొందించి, తన 50 వ యేట, తాగిన మత్తులో భవనం మీదనుంచి పడిపోయి మరణించిన జాన్ అబ్రహామ్‌ని మళయాళీలే కాక భారతచలనచిత్ర విమర్శకులంతా అగ్రస్థాయి దర్శకుడిగానే ముద్రవేస్తారు. ఈ చిన్న పుస్తకంలో ఆయన తీసిన నాలుగు సినిమాల గురించిన సంక్షిప్త వివరణా, ఆయన జీవితం నుంచీ కొన్ని ఆసక్తికరమైన సంఘటనలూ చోటుచేసుకున్నాయి. అలానే ఆయన వర్ధంతి సందర్భంగా జరిగిన సంస్మరణ సభకి హాజరైన వారి వివరాలు కూడా ఉన్నాయి ఈ పుస్తకంలో..







For Copies
Nishapathi
48/101, Huda Complex
Saroor Nagar
Hyderabad – 500 035

వృత్తి రీత్యా సివిల్ ఇంజినీరు, ప్రవృత్తి రీత్యా కథా, నవలా రచయితా, కవీ ఐనా నిశాపతి (ఎం.హెచ్.వి.సుబ్బారావు) గారి మూడో కథా సంపుటి ఈ పుస్తకం. వృత్తీ, ప్రవృత్తులకు తగినట్లే బి.ఇ(సివిల్ ఇంజినీరింగ్), ఎం.ఏ(తెలుగు) డిగ్రీలనందుకున్న నిశాపతి గారు వ్రాసిన కథలు వాసిలో తక్కువే ఐనా ఒక్కో కథా దేనకదే వైవిధ్యతతో కూడి ఉంటుంది. 20 కథలున్న ఈ సంపుటికి మునిపల్లెరాజు గారు ఆత్మీయమైన, ఆసక్తికరమైన ముందుమాట రాశారు. రచయితగారు ముందుగా చెప్పారు " ఒక కథా సంపుటిలో ఉన్నకథలన్నిటినీ సూత్రబద్ధంచేస్తూ ఒకతాత్వికత ఉండాలేమో నాకు తెలీదు. అసలు మనిషి జీవితాంతం ఒకే తాత్వికతకు కట్టుబడి ఉండాలనీ, వుంటాడనీ, నేను నమ్మను" అని. అది నిజమే.. రచయిత రచనలో అప్పటి సామాజిక పరిస్థితుల ప్రభావమూ, రచనకు ప్రేరేపించిన సంఘటనలూ, రచయిత మానసిక స్థితీ ఎంతోకొంత ప్రతిబింబిస్తాయన్న విషయం ఎవరూకాదనలేని వాస్తవం. ఇందుకు తగినట్లే ఈ సంపుటిలో ఆలోచింపచేసే కథలూ, నవ్వించే కథలూ, గిలిగింతలు పెట్టే శృంగార కథలూ, పిల్లలకథలూ, సైన్సు ఫిక్షను కథలూ ..కలిసి ఉన్నాయి. ఏ తరహా కథ వ్రాసినా నిశాపతిగారి ముద్ర కనిపిస్తుందందులో.. సరళమైన శైలీ, చివరంటా చదివించే కథనం, కళ్ళకు కట్టినట్లుండే సంఘటనల సమాహారం..ఈ కథల్లోని ప్రత్యేకత. అన్ని కథలూ ప్రసిద్ధ పత్రికల్లో ప్రచురించబడినవే. తెలుగులో మంచి కథలు చదవాలనుకునే వారందరూ చదివితీరాల్సిన పుస్తకం.

*******




కవికోకిలగా తెలుగు సాహితీలోకంలో పదికాలాలు నిలిచిపోయే రచనలు చేసిన శ్రీదువ్వూరిరామిరెడ్డిగారి జీవిత చిత్రణ ఈ గ్రంథం. దీన్ని రాసింది మరో ప్రసిద్ధ రచయిత కె.వి.ఆర్‌గా అందరికీ తెలిసిన శ్రీకె.వి.రమణా రెడ్డిగారు. ఒక ప్రసిద్ధ రచయిత జీవిత చరిత్రని మరో ప్రసిద్ధ రచయిత వ్రాయడం వల్ల ఈ గ్రంధానికి ఒక ప్రత్యేకత చేకూరింది. కె.విఆర్ తరువాతి కాలంలో మరో రెండు జీవిత చిత్రణలు రాసినా ఆయన రాసిన మొదటి జీవిత కథ ఇదే. దువ్వూరి రామి రెడ్డి గారి సమకాలీనులని, దాయాదులనీ ఇంటర్వ్యూలు చేసి వారందించిన విశేషాల్ని విశ్లేషించి, విరుద్ధమైన సంఘటనలని విసర్జించి ఆనాటి సమాకాలీన సామాజిక పరిస్థితుల్ని కూడా జోడించి ఈ గ్రంధాన్ని విస్తరించినట్లు కె.వి.ఆర్‌గారు తన ఉపోద్ఘాతంలో చెప్పారు. 1964 లో ఆయన వ్రాసిన ఈ గ్రంథం చాలా ఆసక్తి కరంగా సాగింది. 1895 లో జన్మించి 1947 లో మరణించిన కవికోకిల జీవితం అంతా అనుకోని మలుపులే. ఇరవయ్యేళ్ళ వయసులోనే కావ్యరచన, 30 ఏళ్ళ వయసులో మొదటి భార్య మరణం, తరువాతి సంవత్సరమే పుత్రిక మరణం, అనారోగ్యం, మళ్ళీ 1929లో ద్వితీయ వివాహం, మళ్ళీ కావ్యరచన, 1936లో చలచిత్ర రంగప్రవేశం..అన్ని సంఘటనలనీ నాటకీయంగా అనితరసాధ్యమైన శైలిలో అందించారు కె.వి. ఆర్‌గారు. కవికోకిల గారి జీవితం గురించి తెలుకోవడానికీ, ఆయన కావ్య సౌరభం గురించిన విశ్లేషణలు తెలుసుకోడానికీ అన్నింటినీ మించి కె.వి.ఆర్‌గారి రచనా శైలిని ఆస్వాదించడానికీ ఈ పుస్తకం చదివాలి.

ప్రతులకు
దువ్వూరి రామిరెడ్డి విజ్ఞా న సమితి
కేరాఫ్ నెల్లూరు వర్ధమాన సమాజము
టౌన్ హాల్, నెల్లూరు - 524 001







**Published by**

**Detroit Telugu Literary Club**
**1659, Squirrel Valley Drive**
**Bloomfield Hills, MI 48304 USA**

ప్రవాసాంధ్ర రచయితల్లో ఒక ప్రత్యేకమైన గుర్తింపు ఉన్న రచయిత శ్రీ ఆరి సీతారామయ్య గారు. వ్రాసిన కథలు రాసిలో తక్కువే ఐనా వాసిలో ముందు వరుసలో ఉంటాయి. ఊసుపోక సంఘటనలో, ఊకదంపుడు సంభాషణలో కాకుండా, ప్రతి కథకీ ఒక ప్రయోజనాన్ని ఆశించే నిబద్ధత గల రచయిత సీతారామయ్యగారు. ఈ కథా సంపుటి గురించిన పరిచయంలోనే వ్రాసారు 'సమాన బాధ్యతలు నిర్వహిస్తున్న భార్యాభర్తల్లో కుటుంబ పెత్తనం ఎవరిది? ..... పరస్పర గౌరవం, వ్యక్తిగతంగా ఎదిగే అవకాశం కాంక్షించే యువతులకు ఈ కుటుంబాల్లో ఊపిరి సలపడం లేదు. ఈ సంకలనంలోని కథల్లో ఎక్కువభాగానికి నేపథ్యం ఇదే." మొత్తం 14 కథల్లో ఒకటో రెండో మినహాయించి మిగతావన్నీ అమెరికా తెలుగు కుటుంబాల కాన్వాస్ మీద చిత్రించినవే. ఎన్నో ఆశలతో అమెరికా అబ్బాయిని పెళ్ళి చేసుకుని వచ్చాక ఎదురైన ప్రతికూల పరిస్థితులకి తట్టుకున్న యువతి మనస్తత్వాన్ని విశ్లేషించినా, అమెరికాలో పెరిగిన అబ్బాయి వేరే దేశం అమ్మాయిని పెళ్ళి చేసుకుంటానన్నప్పుడు తల్లిదండ్రులు ఆ విషయాన్ని సవ్యమైన కోణంలో తీసుకున్న వైనాన్ని తెలియచెప్పినా.. ఏది చెప్పినాకానీ కథనం చివరంటా ఆసక్తికరంగా నడపడం రచయిత ప్రత్యేకత. ఎంత ఘాటైన సమస్యని చెప్పినా సూటిగా, పాఠం చెప్పినట్లు కాకుండా చక్కటి సంఘటనలతో కథని అల్లి పాఠకుడిని ఆలోచింపచేసేట్లు ముగించడం మరో గొప్ప టెక్నిక్. ప్రవాసాంధ్ర జీవితాల్లోంచి ఇంత సామాజిక స్పృహతో ఉన్న కథలు వ్రాసిన, వ్రాస్తున్న సీతారామయ్య గారు అభినందనీయులు. సాహిత్యాన్ని సామాజిక ప్రయోజనానికి ప్రతిభావంతంగా అన్వయించిన ఈ కథా సంకలనం తప్పక చదవాల్సిన పుస్తకం.




**Published by**

**K.V.NARENDAR**
**Mobile: 9440402871**
**Phone: 08724-226466**

కథైనా కవితైనా నవలైనా, నాటకమైనా కేవలం మానసికానందానికే గాక స్పష్టమైన సామాజిక ప్రయోజనం ఉండలనీ వాస్తవాలని ప్రతిబింబించే కథనాలకి ఎప్పటికీ అదరణ ఉంటుందనీ నమ్మి, 'అమ్మ', 'నాన్న', 'ఊరు'..లాంటి కాన్సెప్ట్ కథల్ని రాస్తున్న కె.వి.నరేందర్ వర్తమాన రచయితల్లో ఒక ప్రత్యేక గుర్తింపు ఉన్న రచయిత. ఒక కాన్సెప్ట్ అనుకుని దాని మీద డజన్ల కొద్దీ కథలు వ్రాయడం కాక, తను రాసిన కథల్లో ఒక కోవకు చెందిన వాటిని కాన్సెప్ట్ కథలు గా ప్రచురిస్తున్నారు నరేందర్. 'ఊరు' అనే ఈ సంపుటిలోని కథలన్నీ తెలంగాణ నేపథ్యంలోని పల్లెటూళ్ళ కన్నీళ్ళకి అద్దం పట్టేవే. ఆధునీకరణ తెస్తున్న ఇబ్బందులూ, దొరలకీ, కూలీలకీ జరిగే సంఘర్షణలూ, వలసపోయే కూలీల దీన గాథలూ, కబేళాలకి తరలిపోయే బర్రెల హృదయఘోష. తీసుకున్న వస్తువు ఏదైనా మనసుని కదిలిస్తుంది. మనసును పిండి వేసే కరుణరసం పదే పదే అలోచింపచేస్తుంది. కేవలం నాటకీయతకోసం కాక సహజంగా వచ్చిన ప్రతి ముగింపూ పాఠకుడి మనసుపై మాయని ముద్రవేస్తుంది. ముందుమాటలో భాస్కర్ గారు రాసినట్లు " పుట్టెడు దుఃఖంతో కథ నడుస్తూనే తెలంగాణాలోని మానవ సంబంధాలని, సాంస్కృతిక విశేషాలనీ, చమత్కారాలని ఈ కథల్లో చూస్తాం....అన్నీ చదివాక ఊరు ఒక మౌన వికలస్వప్నమై మన ముందుంటుంది..! " "శిథిల స్వర్గం మావూరు (చిల్వాకోడుర్) కి" అంకితమివ్వడంలోనే ,ఈ కథలకి ప్రేరణనిచ్చిన రచయిత బాధ, వేదన అర్థమౌతుంది.







తెలుగు చలన చిత్ర గీత రచయితల్లో శ్రీ మల్లాది రామకృష్ణశాస్త్రి గారిది ఒక ప్రత్యేక స్థానం.. అది అనితర సాధ్యం. కథలూ, నవలలూ, యక్షగానాలూ, నాటికలూ వ్రాసిన పండితులే తప్ప అంతవరకూ పాటలు వ్రాయని ఆయన చలన చిత్రరంగంలో సృష్టించిన గీతాల్లో సాహిత్యానికి పెద్దపీట వేశారు. ఇప్పటి సినీ సాహిత్యంతో వారి పాటల్ని పోల్చడం అనవసరమే ఐనా అదే రంగంకాబట్టి ఒక్క పాటనైనా పోలిస్తే ఆయన సాహిత్యం సరసన నిలబడే పాటలు ఈ కాలంలో చాలా చాలా అరుదనే చెప్పాలి. పౌరాణికాలైనా, సాంఘికాలైనా ఎక్కడా సాహిత్య సౌరభానికి రాజీ పడకుండా, కథా ఔచిత్యానికి భంగం కలగకుండా ఆయన వ్రాసిన పాటలు తెలుగు సాహిత్యరంగంలో చిరస్థాయిగా నిలిచిపోతాయి. ‘అందానికి అందం నేనే..జీవన మకరందం నేనే..‘ అన్నా, ‘కనుపాప కరవైన కనులెందుకో..‘అని కన్నీరు పెట్టించినా, ‘తెల్లవారవచ్చె - తెలియక నా సామి‘ అని లలిత శృంగారాన్ని రంగరించి అందించినా, ‘మది శారదా దేవి మందిరమే‘ అని స్తుతించినా, ‘సన్నజాజి తీవలోయ్..సంపెంగ పూవులోయ్..‘అని పసివారిని కీర్తించినా..అది వారికొక్కరికే చెల్లింది. 1952 నుంచీ 1969 వరకూ తెలుగు సినిమాల్లో వచ్చిన ఆయన పాటల సంకలనం ఇది. ఆయన శతజయంతి సందర్భంగా 2005 లో వెలువడిన పుస్తకం.. ఇంద్రగంటి శ్రీకాంత శర్మ గారి ముందు మాట, వి.ఎ.కె.రంగారావు గారి మలిమాట మల్లాది గారి గురించీ, వారి సాహిత్యం గురించి అనేక విశేషాల్ని తెలియచేస్తాయి.

*ఆర్కే బుక్స్*
*1-8-725/ ఎ / 1 , 103 సి, బాలాజీ భాగ్యనగర్ అపార్ట్‌మెంట్స్, నల్లకుంట, హైదరాబాదు - 500 044*
*ఫోన్: 555 36067*




**Published by**

*వేటూరి సాహితీ సమితి*

*ఫ్లాట్ నె. 020, సనాలీ హెవెన్స్*

*అమీర్ పేట, హైదరాబాదు - 500 073*

వేటూరి సుందరరామమూర్తి ..తెలుగు చలనచిత్ర గీత ప్రపంచంలో అడుసు అవసరం లేని మహా శక్తి...ఎందరికో సుందర సాహిత్య స్ఫూర్తి. అంతవరకూ తన పాండితీ ప్రకర్షని కేవలం పత్రికా రంగానికే పరిమితం చేసి ఒక ప్రభంజనంలా మూడు దశాబ్దాల క్రిందట ప్రవేశించిన వేటూరి గారి కలం విన్యాసాల గురించి ఎంత వ్రాసినా తరగదు. ఆలస్యంగా నైనా ఆయన చలనచిత్ర రంగ ప్రవేశం.. తెలుగు చలనచిత్ర గీత చరిత్రలో ఒక సువర్ణాధ్యాయాన్ని మిగిల్చింది. కొంతకాలం తరువాత 'ఆరేసుకోబోయి పారేసుకున్నాను' స్థాయికి దిగజారి తన కలాన్ని పరుగులెత్తించినా, ఆయన సృష్టించిన కవితా పుష్పాల్ని తెలుగు సాహితీ ప్రియులు మరచిపోలేరు. కేవలం గేయాల్నే కాకుండా వచనాన్ని కూడా కవితాత్మకంగా వ్రాయగల అతికొద్ది మంది పండితుల్లో వేటూరి గారు ప్రముఖులు. ఈ విషయంలో వీరికీ మల్లాది రామకృష్ణశాస్త్రి గారికీ చాలా పోలికలున్నాయని చాలా మంది సమీక్షకుల అభిప్రాయం. ఆయనకి చలన చిత్ర రంగంలో అనుబంధాలున్న వ్యక్తులగురించీ, ఆయన అభిమానించే వ్యక్తిత్వాల గురించి, ఆ అనుబంధాలని తన పాటల ద్వారా గుదిగుచ్చుతూ అందించిన వ్యాస సంపుటి ఈ పుస్తకం. వేటూరి గారు వ్రాసిన ప్రతి వాక్యమూ సౌందర్యాత్మకమే. మళ్ళీ ఒక సారి వారి అద్భుత సాహితీ ప్రకర్షని గుర్తు తెచ్చుకోడానికే కాక ఈయన వచన రచనలోని పరిమళాల్ని ఆస్వాదించడానికి కూడా ఈ పుస్తకం తప్పక చదివితీరాలి. మొదటి పేజీ నుంచీ చివరి పేజీదాకా అత్యంత ఆసక్తి కరంగా పరులెత్తుందీ పుస్తకం..



# పుస్తక పరిచయం




శాస్త్రీయ సంగీతకచేరీలలోనూ, భక్తి గానామృతాలలోనూ తరచూ గాయనీ గాయకులు ఆలపించే త్యాగరాజ కీర్తనలు గానీ, అన్నమాచార్య కీర్తనలు గానీ ఎక్కువగా సంగీత ప్రధానంగానే సాగుతాయి. అంటే వాటిని విని ఆస్వాదించేప్పుడు ఆయా రాగాలలోని మాధుర్యాన్నీ, విశిష్టతనీ ఎక్కువగా గుర్తుంచుకుంటారే తప్ప ఆ కీర్తనల సాహిత్యాన్ని విశ్లేషించే అవకాశం, అవసరం ఉండదు. ఐతే నిజానికి ఆ కీర్తనల సాహిత్యాన్ని లోతుగా అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తే ఎన్నో అద్భుతమైన ఆణిముత్యాలు దొరుకుతాయి. త్యాగరాజ స్వామి రచించిన కీర్తనలలో 333 కృతులకి అర్థాన్నీ, ప్రతి పదార్థాన్నే గాక కొన్నింటికి నేపథ్యాన్ని కూడా విశ్లేషాత్మకంగా అందించిన కల్లూరి సత్యరామ ప్రసాద్ గారు రచించిన విశిష్ట గ్రంథం ఇది. ఈ పుస్తకం యొక్క మరొక ప్రత్యేకత - పూర్తిగా వాడుక భాషలో సాగడం. అన్ని కీర్తనలకీ ఒకే మూస పద్ధతిలో వివరణలివ్వడం గాక, కీర్తనని బట్టీ దానిలోని భావాన్ని బట్టీ రామాయణ కథా విశేషాల్ని వివరించడంతో పుస్తకం చదువుతున్నంతసేపూ మరింత ముందుకి వెళ్ళాలనిపిస్తుంది. ఉద్యోగరీత్యా ఎక్కువకాలం కర్ణాటక రాష్ట్రంలో గడిపినా రచయిత అతి సరళమైన తెలుగు వ్రాసిన గ్రంథం సంగీత, సాహిత్య ప్రియులకి కరదీపికలాంటిది. ఒక సారి ఈ విధంగా త్యాగరాజ కృతులలోని పరమార్థాన్ని ఆకళింపచేసుకుంటే , తరువాత వాటిని వినేప్పుడు మరింత మధురంగా మనసుకి హత్తుకుంటాయి. 400 పేజీల ఈ గ్రంథానికి భీమారావుగారు చిత్రించిన వర్ణచిత్రాలు అదనపు ఆకర్షణగా నిలిచాయి.

నిశ్చింత ఛారిటబుల్ ట్రస్ట్
29-1382/76 సమతానగర్
నేరేడ్ మెట్, హైదరాబాద్ - 500 056
ఫోన్: 27224733




వీ-టెక్ పబ్లికేషన్స్
షాప్ నెం. 14, సొసైటీ షాపింగ్ కాంప్లెక్స్
ఫిలిమ్ నగర్, హైదరాబాదు - 500 033
ఫోన్ నెం. 2354 8999

మూడు వందలకి పైగా తెలుగు చలనచిత్రాలకి కథలూ, సంభాషణలూ అందించిన ప్రముఖ రచయితల ద్వయం పరుచూరి బ్రదర్స్‌లో చిన్నవాడైన పరుచూరి గోపాలకృష్ణ గారు పి.హెచ్.డి పట్టాకోసం ఉస్మానియా యూనివర్సిటీకి సమర్పించిన పరిశోధనా గ్రంథం ఇది. సినిమా పాటల పుస్తకాలు, పాటల విశ్లేషణలూ, సినిమా సమీక్షలూ, సినిమా రంగంలోని ఇతర రంగాల గురించిన వ్యాసాలూ పుస్తకాలూ వచ్చాయి కానీ సినిమా కథా, కథనాల గురించిన అత్యంత వివరంగా సమగ్రంగా వెలువడిన పుస్తకం ఇదొక్కటేనేమో. ప్రతి సినిమా నిర్మాణంలోనూ కథా, స్క్రీన్ ప్లే అత్యంత ముఖ్యమైన పాత్ర వహిస్తాయి. వాటిని సరిగ్గా అర్థం చేసుకుని అమలు చేసిన సినిమాలు తప్పక విజయవంతమౌతాయి. చెప్పేరీతిలో చెబితే ఏ కథనైనా ప్రేక్షకులు ఆదరిస్తారు అనడానికి విజయవంతమైన సినిమా కథా , కథనాలని శాస్త్రీయమైన దృష్టిలో విశ్లేషిస్తే కారణాలు బోధపడతాయి. శాస్త్రీయంగా ఈ రంగాన్ని అర్థం చేసుకోవడానికి గోపాలకృష్ణగారి ఈ గ్రంథం ఎంతగానో ఉపయోగపడుతుంది. కేవలం సిద్ధాంత ప్రతిపాదనలే గాకుండా ప్రతి అంశాన్నీ ప్రయోగాత్మకంగా వివరించడానికి ఎన్నో సినిమాల కథలనీ, కథలు నడిచిన విధానాన్నీ సమగ్రంగా చర్చించారు. ఉదాహరణకి మల్లీశ్వరి సినిమా మొత్తం దృశ్య విభజననీ, ప్రతి దృశ్యం ఏ ప్రయోజనాన్ని ఆశించి వ్రాయబడిందీ చాలా ఆసక్తి కరంగా చెప్పారు. సినిమా రచయితలు కాబోయేవారు, సినిమా కథ వెనుక ఎంత కథ ఉంటుందో తెలుసుకోగోరే వారు తప్పక చదవాల్సిన పుస్తకం. గోపాలకృష్ణ గారు చేసిన ఈ విలక్షణ ప్రయత్నం ఎందరికో ప్రయోజనకారిగా నిలుస్తుంది.



# పుస్తక పరిచయం




భరాగో అనే కలం పేరుతో తెలుగు సాహితీ ప్రియులకి సుపరిచితమైన ప్రఖ్యాత హాస్య కథా రచయిత శ్రీ భమిడిపాటి రామగోపాలంగారి స్వీయ చరిత్ర ఈ పుస్తకం.

దశాబ్దం పైగా అనారోగ్యకారణాల వల్ల సొంతంగా వ్రాయలేకున్నా డిక్టేట్ చేస్తూ ఎన్నో రచనలు చేయడమే కాక ఎన్నో ప్రాజెక్టులు కూడా విజయవంతంగా నిర్వహించిన భరాగో గారి ఆత్మకథ – ఆసాంతం ఆసక్తికరం, ప్రతి పేజీ ఎన్నో విశేషాల కదంబం. గత కొద్ది సంవత్సరాలుగా మంచమ్మీద నుంచీ లేవలేని స్థితిలో ఉండి కూడా ఎన్నో సావనీర్లు, ప్రత్యేక సంచికలూ తన నేతృత్వంలో వెలువరించిన , ఇంకా ఆ దిశలో కృషి చేస్తున్న భరాగోగారి ఆత్మ విశ్వాసం వెనుకనున్న జీవన చిత్రాలకు ప్రతిబింబం ఈ పుస్తకం. కొద్ది సంవత్సరాల క్రిందటే 116 పాటలూ, మరో 116 పాటలూ అనే అరుదైన గ్రంథాలని కూడా వెలువరించింది భరాగో గారే. దాదాపు 400 పేజీలున్న ఈ పుస్తకంలో వందలాది ఛాయా చిత్రాలున్నాయి. మామూలు మనుషుల ఆత్మకథలు ఎలా వున్నా, రచయితల ఆత్మకథలు అనే సరికి కేవలం సొంత చరిత్రమాత్రమే కాక వారి సాహితీ ప్రయాణంలో ఎదురైన అనుభవాలూ, పరిచయమైన వ్యక్తులూ, ఆసక్తికరమైన సంఘటనలూ..అల్లుకోవడం అతి సహజం. వాటన్నింటితో నిండిన ఈ పుస్తకం ఏక బిగిన చదివింపచేస్తుంది. ఆసక్తి కరమైన వ్యక్తుల గురించి మధ్యమధ్యలో బాక్స్ ఐటమ్స్‌గా అందించడం ఈ పుస్తకానికి మరింత అందాన్ని తెచ్చింది. గత ఏడు దశాబ్దాల సామాజిక స్థితి గతులకీ, సాహితీ రంగంలోని వివిధ పరిణామాలకీ సాక్షీభూతమైన సహృదయులు భమిడిపాటి రామగోపాలం గారి ఆత్మకథ అందరూ చదివి ఆస్వాదించ వలసిందే.




గత 35 సంవత్సరాలుగా తన వైవిధ్యమైన రచనలతో తెలుగు పాఠకుల గుండెల్లో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న శ్రీ మల్లాది వెంకట కృష్ణమూర్తిగారు వ్రాసిన చిన్న కథల పుస్తకమిది. తనదైన, సరళమైన శైలిలో మల్లాదిగారు రాసిన ఈ చిన్నకథల్లో ప్రతి ఒక్కటీ ఆసక్తి కరంగా ఉంది. ఒక్కోటీ ఒక పేజీ మించని కథే ఐనా మొదలుపెట్టిన వద్దనుంచీ చివరికేమి ఔతుందోనన్న ఉత్కంఠ రేకెత్తిస్తుంది. అతి సాధారణమైన సంఘటనలలోంచి కూడా అసాధారణమైన సత్యాలని వెలికి తీసి చూపిస్తారు. ఎంతమంది ఎన్ని ప్రశ్నలతో విసిగించినా చిరునవ్వుతో తన ధర్మాన్ని నిర్వర్తించే రైల్వే బుకింగ్ క్లర్క్, క్రమం తప్పకుండా ట్రాఫిక్ రూల్స్‌ని పాటించే పెద్దమనిషీ లాంటి అతి సామాన్యమైన పాత్రలనుంచీ కూడా నేర్చుకోదగ్గ విషయాలని ఆధ్యాత్మిక సత్యాలుగా విశదీకరించారు రచయిత. 128 పేజీలలో ఉన్న 81 కథలూ ఏక బిగిని చదివింప చేస్తాయి. ఎన్నో సందర్భాలలో అన్వయించుకోడానికీ, ఇతరులకి చెప్పి ఒప్పించడానికీ కూడా ఉపయోగపడతాయీ కథలు.

*మల్లాది వెంకట కృష్ణమూర్తి*
*1-1-728/ ఎ, గాంధీనగర్*
*హైదరాబాదు - 500 080*
*ఫోన్ నెం. 2761 2244*



# పుస్తక పరిచయం




దాదాపు 200 పేజీలున్న ఈ పుస్తకంలో 70 సినిమాల సంక్షిప్త సమాచారం ఉంది. ఇవన్నీ వివిధ భారతీయ భాషలో నిర్మింపబడిన సినిమాలు. ఐతే వీటిని ఎన్నుకున్న విధానం చాలా అభినందనీయం. స్త్రీ పాత్ర ప్రధానంగా ఉన్న చిత్రాలివన్నీ. స్త్రీ పాత్ర వ్యక్తిత్వ చిత్రణ అనేది ఈ 70 సినిమాలనీ కలిపే అంతస్సూత్రం. మహిళల సమస్యల్ని విశ్లేషణాత్మకంగా చూపించిన సినిమాల గురించిన విశేషాలతో పొందుపరచిన పుస్తకం ఇది. తెలుగు సినిమాలైన స్వర్గసీమ, సుమంగళి, నిమజ్జనం, మయూరి, దాసి మొదలైనవి ఇందులో చోటు చేసుకున్నాయి. ఇతర భాషలలోని  అంతర్జలియాత్ర, ఇన్సాఫ్ కా తరాజు, ఇషనో, లేఖాయుదె మరణం ఒరు ఫ్లాష్‌బాక్, ఫిజా, మిర్చ్‌మసాలా, ఫణియమ్మ, రుడాలి.. ఇలా అనేక చిత్రాల  సంక్షిప్త కథనమే కాక, విశ్లేషణత్మకమైన వివరాలు కూడా ఉన్నాయి. కేవలం టెక్నిక్ పరంగా కాకుండా నిబద్ధతతో కథా గమనం ఎలా సాగిందో వివరించారు రచయిత. రెండు గంటల సినిమా వైశిష్ట్యాన్ని రెండు పేజీల్లో కుదించి చూపించడం సాహసోపేతమైన చర్యే ఐనా రచయిత ఆ ప్రయత్నంలో కృతకృత్యులయ్యారు. ప్రతి సినిమాకీ అరుదైన స్టిల్‌ని కూడా జోడించారు. సినిమాని సీరియస్ గా చూసేవాళ్ళు తప్పక చదవాల్సిన పుస్తకం ఇది. ఒక్కో సినిమా గురించి చదవగానే  సినిమా చూసి తీరాలనిపించడం లోనే రచయిత విజయం స్పష్టమౌతుంది. సహజంగా కథా రచయిత కాబట్టి వారాల ఆనంద్‌గారి శైలి కూడా ఆపకుండ చదివింపచేస్తుంది.

*ఫిల్మ్ ఫౌండేషన్ పబ్లికేషన్స్*
*10-3-401/4 బ్యాంక్ కాలనీ*
*కరీంనగర్ - 505 001*
*ఫోన్: 08722-21678*




ఉద్యమపరంగా నడిచే మాసపత్రికనీ, అందునా నిబద్ధతతో ప్రమాణాలకు కట్టుబడిన సాహితీ పత్రికని 30 సంవత్సరాలు నడపడం మామూలు విషయమేమీ కాదు. గత 30 సంవత్సరాలలో, అప్పుడప్పుడూ కుంటుపడినా ఈ సంచిక సరిగ్గా ప్రజాసాహితికి 300 వ సంచిక. ఈ సందర్భంగా గత 30 సంవత్సరాలుగా వెలువడిన 300 సంచికలనీ చాలా సమర్థవంతంగా, అంశాల వారీగా సమీక్షించారు. 160 పేజీల అందమైన ముద్రణతో సాగిన ఈ పుస్తకం వామపక్ష భావాలున్న సాహితీ ప్రియులనే కాకుండా , ఈ 30 సంవత్సరాల్లో ఆంధ్రప్రదేశ్‌లో సంభవించిన సాహితీ సాంస్కృతిక పరిణామాల గురించి తెలుసుకోగోరిన వారందరినీ అలరిస్తుంది. జనసాహితీసాంస్కృతిక సంస్థ వార్షికోత్సవాల సందర్భంగా ప్రచురించిన కరపత్రాలన్నింటినీ వరుసగా ప్రచురించారు. సాహితీ సాంస్కృతిక రంగాల్లోని ఆసక్తికరమైన క్రమ పరిణామాలకి అవన్నీ నిలువుటద్దాలు. అలానే ప్రజాసాహితి ప్రచురించిన ప్రత్యేక సంచికల గురించిన సమగ్ర సమాచారం కూడా ఉంది. 30 సంవత్సరాల సాహితీ ప్రస్థానాన్ని ఇలా గ్రంధస్తం చేసిన పత్రికలు చాలా అరుదు. ఇందుకు ప్రజాసాహితి నిర్వాహకులని అభినందించి తీరాలి.

*76-8/2-4 బి, శివాలయం సెంటర్*

*మున్నలూరి వారి సందు, భవానీపురం*

*విజయవాడ- 520 012*

*ఫోన్: 2417890*



# పుస్తక పరిచయం




50 కి పైగా కవితలు పొదిగిన ఈ పుస్తకంలోని ప్రతి కవితలో భావుకత అనంతంగా ఆవరించి ఉంది. ప్రతి వాక్యంలో, ప్రతి పదంలో రచయిత్రి కవితాత్మ సున్నితంగా, గాఢంగా స్పృశిస్తుంది. ముందుమాటలో శిలాలోలిత గారు చెప్పినట్లు " ఖాళీ గ్లాసు లాంటి హృదయాన్ని తరచి తరచి చూసుకుంటూ, జ్ఞాపకాల గుసగుసలతో వెలితిని పూడ్చుకోవాలనే నిరంతర తపన ఎక్కువగా కవిత్వంలో కనిపిస్తున్నాయి".

కొన్ని ఉదాహరణలు

'అలసటెరుగని - నిట్టూర్పులు
నిద్రరాని ఎన్నో రాత్రులు
చీకటి రెక్కలు రెపరెపలాడిస్తూ
వినిపిస్తాయి నా ప్రేమకథను..",
"రెప్ప వాల్చని నా కళ్ళల్లో
ఎన్నెన్ని కథలూ- కావ్యాలూ
పోగొట్టుకున్న గతం
ఎందుకిలా వెన్నాడి ఏడిపిస్తుంది
జీవితాన్ని కుదిపేసి
ఏం సాధిస్తుంది కన్నీళ్ళు తప్ప." ,
"శిశిరాన్ని కాల్చేస్తూ
వసంతాన్ని ఊరడిస్తూ
హేమంతం తారట్లాడుతూ
కాలం అనంతంగా కదుల్తూనే ఉంటుంది
వీడ్కోలు వినిపిస్తూనే ఉంటుంది",

ఇలా ప్రతి కవితా మనసుమీద ముద్రవేస్తుంది.

ఆఖరి కవరు పేజీ మీద వ్రాసినట్లు

" అక్షరాలు - బీటలు వారిన విత్తనం గోడల్లోంచి తొంగిచూస్తున్న తొలి హరిత పత్రాలు.." హరితపత్రాలు పేజీల నిండా ఆరు ఋతువుల అందాల్నీ అద్దం పట్టి చూపుతాయి. చిక్కటి కవిత్వాన్ని ఆస్వాదించాలనుకున్న కవితాప్రియులందరూ తప్పక చదవాల్సిన కవితా సంపుటి ఇది. పుస్తకం చిన్నదే ఐనా అచ్చు తప్పులు మెండుగా వున్నాయి. కవిత్వపు జల్లుల్లో తడిసేప్పుడు అవి పెద్ద తప్పులుగా కనిపించవు.

*స్వాతి శ్రీపాద*

*16-2-701 / డి / 2. క్రాంతి ట్రాన్స్‌పోర్ట్ పక్కన*

*మలక్ పేట్, హైదరాబాదు - 36*

*ఫోన్: 9866801496*




తన 18 సంవత్సరాల వయసులో చిత్రరంగ ప్రవేశం చేసి కేవలం 7 సంవత్సరాలు మాత్రమే చిత్రసీమలో ఉండి , తరువాత దాదాపు 40 సంవత్సరాలు తెనాలిలో ఏకాంత , మౌన జీవితం గడిపిన ఆంధ్రుల అందాల తార కాంచనమాల గురించిన వివిధ వ్యాసాల సంకలనం ఈ అరుదైన పుస్తకం. చిత్రసీమలోని విచిత్రాలకి కాంచనమాల జీవితం నిలువెత్తు నిదర్శనం..! ఆమె నటించిన సినిమాలు అతి కొద్దే, నటనలోకూడా పెద్దగా విమర్శకులనుంచీ ప్రశంసలు అందుకోలేదు. కేవలం తన అందంతోనే ఆంధ్రదేశాన్ని ఓ కుదుపు కుదిపిన కాంచనమాల, శ్రీశ్రీ మహాప్రస్థాన కవితలో కూడా చోటు చేసుకోవడం అప్పట్లో ఆమె కున్న క్రేజ్‌కి గొప్ప ఉదాహరణ. 1942 లో ఆమె సినిమా జీవితానికి తెరపడింది. సొంత వూరైన తెనాలి వచ్చేసి అక్కడే మేడ కట్టుకుని స్థిరపడిపోయారు. నిరాసక్తంగా, నిస్తేజంగా, నిర్జీవంగా సినీసీమలో ఎవరికీ పట్టకుండా గడిపారు. 1981 లో మరణించిన కాంచనమాల గురించి 1938 నుంచీ 2005 వరకూ వివిధ పత్రికల్లో ప్రచురితమైన ఆసక్తికరమైన వ్యాసాల సంకలనం ఇది. కొడవటిగంటి కుటుంబరావు గారు 1948 లో రాసిన వ్యాసంతో మొదలై వి.ఎ.కె.రంగారావు, భానుమతీ రామకృష్ణ, మిక్కిలినేని రాధాకృష్ణ, ఇంటూరి వెంకటేశ్వరరావు లాంటి ఎంతోమంది ప్రముఖులు వివిధ సమయాల్లో కాంచనమాల గురించి గుర్తుచేసుకుంటూ వ్రాసిన వ్యాసాలివన్నీ. ఎంతో అరుదైన ఎన్నో చిత్రాలు కూడా ఇందులో చేర్చబడ్డాయి. ఆకాశంలో మిలమిలలాడిన ఓ తార నేలకు కూలిన విషాద జీవన చిత్రణ ఈ పుస్తకం.

*చిన్ని పబ్లికేషన్స్*

*నాగర్ కర్నూల్ - 509 209*

*మహబూబ్ నగర్ జిల్లా, ఆం.ప్ర.*

*ఫోన్: 08540 - 224006*



# పుస్తక పరిచయం




**దాదాపు** 40 సంవత్సరాల క్రిందటే మంచి కథలు ఎన్నో రాసిన బి.పి.కరుణాకర్ గారు 1985 తర్వాత కథలు వ్రాయడం తగ్గించి మళ్ళీ ఇటీవల విరివిగా రాస్తున్నారు. అప్పటి, ఇప్పటి కథలతో తెచ్చిన ఆయన మొట్టమొదటి కథా సంపుటి ఇది. కథలకి పేరు పెట్టడంలోనె రచయిత ప్రత్యేకత తెలుస్తుంది..'అంబాలీస్', 'వెండి నీరు', 'వలయం చివర్లో','నీడలేని పందిరి','మరణపు ముల్లు', 'స్మశానంలో వసంతం' ..ఇలా. రచయిత తన గురించి పరిచయం చేసుకుంటూ ''జీవితాన్ని తేలికగా, ఆనందంగా, నవ్వుతూ తీసుకునే మనస్తత్వం నాది. అలా గడిపేస్తుంటాను కూడా. అందరితో మంచిగా ఉండాలనే తాపత్రయంలో ఒంటరిగా మిగిలిపోయాను..' అని రాసారు. రచయిత వ్యక్తిత్వమే కథల్లోనూ ప్రతిబింబిస్తూ ఉంటుంది అని ముందుమాట రాసిన ఆచార్య కొలకలూరి ఇనాక్ గారు అన్నారు. శైలి సులభంగా, సరళంగా ఉంది. కథ మొదలు పెడితే ముందుకి వెళుతున్నట్లే తెలీదు. కథలో పాఠకుడు లీనమయ్యేలోగా ఊహించని మలుపునిస్తారు రచయిత. ఇందులో చాలా వరకూ చిన్నకథలే ఒకటి రెండు తప్ప. అన్నీ చదివాక మంచి కథలు చదివామన్న తృప్తే మిగలడమే కాక కథల్లోని పాత్రలు మనల్ని వెంటాడతాయి. రచయిత మిగిలిన కథలు కూడ పుస్తకరూపంలో వస్తే తెలుగు కథాప్రియులు ఆనందిస్తారు.

*బి. కరుణాకరప్రసాద్*

*ప్లాట్ నెం. డి - 304, అనూరాధా సదన్*

*అడిక్ మెట్, హైదరాబాదు - 500 044*

*ఫోన్: 040 - 2707 0244*




ఆకర్షణీయమైన ముద్రణతో, అనేక రకాల ఆరోగ్య విషయాల గురించీ, ఆయుర్వేద వైద్య విధానాల గురించీ హైదరాబాదునుంచీ సక్సెస్ రీసెర్చి ఫౌండేషన్ వారు ప్రచురిస్తున్న 'అమృతం' మాస పత్రిక కాపీలు మాకు అందాయి. కేవలం ఆయుర్వేద ఔషధాల గురించే కాకుండా శరీరంలోని అవయవాల గురించిన సమగ్ర అవగాహన కలిగించే వ్యాసాలు కూడా ఉన్నాయి. ఒక్కోనెల కొన్ని వ్యాధుల గురించిన సులభమైన వివరణా, ఆయుర్వేద వైద్య విధానంలో ఆయా వ్యాధులకు గల నివారణోపాయాలూ.. అందరికీ అర్థమయ్యే రీతిలో వివరిస్తున్నారు. ఆయుర్వేద పరంగా చిన్న చిన్న వైద్య చిట్కాలు కూడా ఉన్నాయి. ఒక ఫిక్షన్ సీరియల్, వాత్సాయన కామ సూత్రాల గురించి కథా రూపంలో వివరణలూ కూడా ఉన్నాయి. కేవలం పత్రికా నిర్వహణే కాకుండా వివిధ నగరాల్లో ఆరోగ్య ఉత్సవాలని కూడా నిర్వహిస్తున్నట్లు ఈ పత్రికలోని ప్రకటనల ద్వారా తెలుస్తోంది. అలానే ప్రతి ఆదివారం పత్రికా కార్యాలయంలో ఉచిత ఆయుర్వేద సంప్రదింపులు కూడా ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు ప్రకటించారు. పాఠకుల అరోగ్య సమస్యలకి నిపుణులతో సలహాలు కూడా ప్రచురిస్తున్నారు. మామూలు కథలూ, సీరియల్సూ ఇచ్చే పత్రికలు కనుమరుగౌతున్న కాలంలో ఆంధ్రప్రదేశ్ నుంచీ పాఠకులని ఆరోగ్య పరంగా విజ్ఞాన వంతుల్ని చేసే ఇలాంటి పత్రికా ప్రచురణ సర్వదా అభినందనీయం.

---

*19-3 వివేకానంద నగర్*

*దిల్‌సుఖ్ నగర్, హైదరాబాదు - 500 060*

*ఫోన్: 040 - 2414 1867 , 65539714*



# పుస్తక పరిచయం




తెలుగు కవితా ప్రపంచంలో చిక్కని, చక్కని కవిత్వాన్ని అందించే కొద్ది మందిలో విద్యార్థి గారు ఒకరు. ఈయన కవిత్వం నయాగరా జలపాతంలా ఉరకలు వేస్తుంటుంది. ఎంత వడిగా వ్రాస్తారో అంత లోతుగా కూడా వ్రాస్తారు. ఈయన కవితలనిండా అనేక అనుపమానమైన పదచిత్రాలు దొరుకుతాయి. "రాత్రి- ఎడారి- నువ్వూ నేనూ - మాటలు పెకలని- మౌన శిలలం; రాత్రి- అరణ్యం- నువ్వూ నేనూ- దారి తప్పిన - విహ్వలయాత్రికులం; రాత్రి - ఆకాశం - నువ్వూ నేనూ - కన్నీరు కార్చే - అనాది నక్షత్రాలం" ఈయన కవితా ఝురికి ఇదొక చిన్న ఉదాహరణ మాత్రమే. వీరు అమెరికాలోని వివిధ ప్రాంతాలు సందర్శించినప్పుడు కలిగిన భావావేశాలని 'ఖండాంతర కవిత్వం' గా వెలువరించారు. ప్రతి కవితకీ వ్రాసిన తేదీ, ప్రదేశం పేర్కొనడం బావుంది. కవితాహృదయ స్పందనలు ఎలా వుంటాయో ఈ వివరాలు ప్రస్ఫుటం చేస్తాయి. కవితా వస్తువులోనూ, భావ వ్యక్తీకరణలోనూ అచ్చెరువుకలిగించే వైవిధ్యం ఈ కవి ప్రత్యేకత. "ఏ అక్షరాల వీధిలోనో-పాటల తోటలోనో- ముషాయిరా 'జల్సా'లోనో- చర్చల వేదికమీదో - మనం తటస్థపడతాం" అంటూ స్నేహితుల్ని మనసారా ఆహ్వానించే విద్యార్థి గారి ప్రతి కవితలోనూ ఒక గొప్ప భావావేశం మనల్ని అలరిస్తుంది.

*రీతు పబ్లికేషన్స్*
*2-7-1083, కనకదుర్గ కాలనీ*
*వడ్డెపల్లి, వరంగల్ - 506 370*
*ఫోన్: 0870 - 2457 467*




*జయంతి పబ్లికేషన్స్*
*203, కంచి రెసిడెన్సీ*
*దిల్ సుఖ్ నగర్, హైదరాబాదు - 500060*
*ఫోన్: 92473 02882*
*Jayanthipublications@gmail.com*

"అనంత ఏకాంత వాసిని నేను - నిరంతర నిశ్శబ్ద నివాసిని నేను- భాష రాని దేశంలో - ప్రవాసిని నేను.."అని తనని తాను పరిచయం చేసుకున్న రాయగడ్(ఒరిస్సా) నివాసి ఆనందరావు పట్నాయక్ గారు వ్రాసిన కథల సంపుటి ఇది. పాతికకుపైగా ఉన్న కథలు అన్నీ ఏదో ఒక పత్రికలో గత దశాబ్ద కాలంలో ప్రచురితమైనవే. ముందు మాటలో వసుంధర గారు చెప్పారు " భేషజాలు లేకుండా తను చెప్పదల్చుకున్నది సూటిగా, నిర్దుష్టంగా, హృద్యంగా చెప్పగల సామర్థ్యం ఆనందరావు పట్నాయక్‌కి సహజంగా వచ్చింది. కథ చెప్పేటప్పుడు - తానై విశ్లేషించకుండా, తనదంటూ సందేశమివ్వకుండా పాఠకులను తన మార్గానికి తెచ్చుకునేలా ఆలోచింపచేయడం ఆనందరావు అనుసరించే పద్ధతి.." అని.

కథలన్నీ సులభమైన, అతి సరళమైన శైలిలో సాగుతాయి. హంగూ ఆర్భాటాలూ, పెద్ద పెద్ద పద ప్రయోగాలూ ఉండవు. కథ మొదలు పెట్టిన రెండు మూడు పేరాల్లోనే కథా వాతావరణంలోకి వెళ్ళిపోతాం. చాలా కథలు ఒరిస్సా, పశ్చిమ బెంగాల్ నేపథ్యంలో సాగుతాయి. ఆ ప్రదేశాలూ, అక్కడి పాత్రలూ ఆసక్తికరంగా అనిపిస్తాయి. ప్రతి కథలోనూ ముగింపు కి ఒక ప్రత్యేకత ఉంటుంది. చాలా కథల్లో మానవతా విలువలకి పెద్దపీట వెయ్యడం జరిగింది. కొన్ని కొన్ని పేలవమైన కథలు (కాలింగ్ బెల్, చిద్విలాస్) ఉన్నా మొత్తం మీద మంచి కథలు చదివామన్న తృప్తిని మిగిల్చే పుస్తకం ఇది. ఒరిస్సాలో ఉంటూ కూడా తెలుగు కథమీద ఇంతపట్టు సంపాదించుకున్న ఆనందరావు గారు అభినందనీయులు.



# పుస్తక పరిచయం



విశాఖపట్నానికి దగ్గరలోని పద్మనాభం అనే వూళ్ళో దాదాపు 100 సంవత్సరాల క్రిందట మొదలైన ఒక శ్రీవైష్ణవసాంప్రదాయ కుటుంబంలోని మూడు తరాల కథ ఇది. మూడో తరం వచ్చేసరికి ఎప్పుడూ పద్మనాభం దాటి వెళ్ళని సుభద్రాచార్యుల వారి అబ్బాయి, పై చదువులకోసం పట్నానికి వెళ్ళడం, ఆ పైన అమెరికా కూడా వెళ్ళడం, తల్లి దండ్రులు ఇండియాలో, ప్రాణానికన్నా ఎక్కువగా ప్రేమించిన అబ్బాయి అమెరికాలో..టూకీగా ఇదీ కథ అని చెప్పడం ఈ పుస్తకం యొక్క విశ్వరూపానికి అన్యాయం చెయ్యడమే ఔతుంది. ఐతే ఇది కాలమ్ పరిచయం కాబట్టి కథా వస్తువుని అక్కడితో సరిపెడితే, ఈనవల చదివాక ఇందులోని పాత్రలూ, సన్నివేశాలూ మనల్ని వెంటాడుతాయ్. సుభద్రాచార్యులు, వరదమ్మ, తిరుమల, ఆండాళ్ళు, కూర్మయ్య, కైకవశి, వెంకటాచలం, బుల్లిరాజు..పద్మనాభం, గోస్తనీ నదీతీరం..అన్నీ మనకి ఎప్పటినుంచీ పరిచయమున్నట్లనిపిస్తాయి. వెంటనే మన అభిప్రాయాల్ని ఎవరితోనైనా చర్చించాలనిపిస్తుంది. ప్రముఖ రచయిత శ్రీ గొల్లపూడి మారుతీరావు గారు 2001లో ఆంధ్రప్రభలో సీరియల్ గా వ్రాసిన కథ ఇది. తల్లిదండ్రులని వదిలి పిల్లలు అమెరికా లాంటి దూరప్రాంతాలకి వెళ్ళి పోవడం , కన్నవారు అవసాన దశలో ఉన్నా కడసారి చూపులకి కూడా నోచుకోలేని పరిస్థితులకి దాసోహమనడం..ఎవరిది తప్పు..ఏది ఒప్పు.. ఎవరికి వారినే ఆలోచించుకోమంటారు రచయిత, ఇలా- "అయినా ఆ తల్లికేం తక్కువ? మిగిలిన లోటల్లా కొడుక్కే. మరొకసారి జీవించే అవకాశం ఇచ్చి - నాలుగు సార్లు డిట్రాయిట్లో లక్షల ఉద్యోగం ఇస్తే -ఆ సమయానికి తల్లి సమక్షంలో ఉండగలిగే తృప్తినీ, క్షణాల్నీ నష్టపోతాడా? ఏమో! ఈ ప్రశ్నని తిరుమలనీ, తిరుమలలాంటి ఏ నేరమూ చేయని వేలాదిమందినీ అడగాలి". ఈయన అద్భుతమైన స్క్రీన్ ప్లే రచయిత కూడా కావడం వల్ల ఈ నవల చదువుతున్నంత సేపూ కథ మన కళ్ళముందు కదులుతుంటుంది. భరాగో గారు చివరలో రాసినట్లు "ఎన్నో ఎన్నో ఎన్నెనా 'ఈ సాయంకాలమైంది'" దీనికి ఇదే సాటి..తప్పక చదవండి..తెలిసిన వారందరితోనూ చదివించండి..!

గొల్లపూడి మారుతి రావు
6, శారదంబాళ్ వీధి
గోకులం కాలనీ
టి.నగర్, చెన్నై - 600 017
ఫోన్: 044 - 826 7559, 826 1215




ఆంధ్రదేశ పాఠకులకి చిరపరిచితులైన ప్రముఖ కథారచయిత విహారి గారు. రాసిలో తక్కువగానే వ్రాసినా వాసిలో మాత్రం ఆయన రాసిన కథలు అనర్ఘరత్నాలు. కవితలూ, సాహితీ విమర్శలూ కూడా ఒక స్థాయిలో విరివిగా అందించిన విహారి గారి మొట్టమొదటి పద్యకావ్యం ఈ పుస్తకం. వీరి అసలు పేరు జొన్నలగడ్డ సత్యనారాయణ మూర్తి. గత 35 సంవత్సరాలుగా రచనలు చేస్తున్నా వీరు పద్య రచనలు ఎక్కడా ప్రచురించలేదు. పదవీ విరమణ తరువాత వీరు ఈ ప్రక్రియ చేపట్టి అందరినీ అలరించేలా వ్రాసిన అద్భుత పద్య సంకలనం ఈ సుందరకాండ. రామాయణాన్ని, అందునా సుందరకాండనీ ఎంతో మంది ఎన్నో రూపాల్లో చెప్పారు. ఐనా విహారి గారి 1160 పద్యాల ఈ గ్రంథం అందరినీ అలరిస్తుంది. దీన్ని పదచిత్ర రామాయణం అనడంలోనే రచయిత నైపుణ్యం అవగతమౌతోంది. కథా సన్నివేశాలకి తగిన ఛందస్సునీ, పద్యాల గమనాన్ని ఎంచుకోవడంలో రచయిత నూటి నూరు శాతం విజయం సాధించారు.

ఉదాహరణకి సీత ముందు హనుమంతుడు వేసిన కుప్పి గంతులు గురించి:

వాలము చుంబించె, భుజా
స్ఫాలన మొనరించె, నాడె, పాడెను, తిరిగెన్
నేలంబడె, కంబముపై
వాలె, నెగిరి గంతు వేసె వానరచేష్టన్.

ఏ పద్యం చదివినా ఆ దృశ్యం కళ్ళకి కట్టినట్లు మనో నేత్రం ముందు సాక్షాత్కారమవడం ఈ కావ్యం ప్రత్యేకత. దాదాపు 50 పేజీలు సాగిన ముందు మాటలలో ఈ కావ్యాన్ని గురించిన విశిష్టమైన విశ్లేషణలున్నాయి. పద్య కావ్యాలని మొదటి సారి చదివే వారికి సైతం ఈ విశ్లేషణలు విపుల పరిచయ పత్రాలుగా ఉపయోగిస్తాయి. తెలుగు సాహిత్యాన్ని అభిమానించే వారందరూ చదివి ఆనందించాల్సిన మంచి కావ్యం ఈ సుందరకాండము. మంచి పుస్తక ప్రచురణే కరువౌతున్న రోజుల్లో ఇలాంటి ఉత్తమ కావ్య లక్షణాలున్న పుస్తకాలు రావడం ఎంతో అభినందనీయం. రచయిత జె.ఎస్.మూర్తి గారి ప్రయత్నాన్ని అందరం ప్రోత్సహించాలి.

*జె.ఎస్.మూర్తి*

*25, అన్నపూర్ణ అపార్ట్‌మెంట్స్*

*రామ్‌నగర్, హైదరాబాద్ - 500 020*

*ఫోన్: 040-6450 3701*



# పుస్తక పరిచయం







'చైనా జపాన్‌లాటి దేశాలకు వెళ్ళినప్పుడు మనం ఎలా ప్రవర్తించాలో ఎలా ప్రవర్తించకూడదో, ఏం చెప్పాలో ఏం చెప్పకూడదో నేర్పే సెమినార్లు చాల వున్నాయి అమెరికాలో. మరి ఇండియానించీ నెలనెలా కొన్ని వేలలో దిగుమతవుతున్న భారతీయులకి, ముఖ్యంగా తెలుగువారికి అమెరికా జీవితం సవ్యంగా గడపటానికి కావలసిన విషయాలపై సమాచారం ఇచ్చేవారు నాకంతగా కనపడలేదు. చుట్టం చూపుగా వచ్చేవాళ్ళకి ఫరవాలేదు ఎవరో ఇక్కడ సహాయం చేస్తారు. చదువుకోటానికి వచ్చేవాళ్ళూ ఉద్యోగాలకి వచ్చే వాళ్ళు మొదట్లో నానా బాధలూ పడటం చూస్తున్నదే. అలాటివి నాలుగైదు వ్యాసాల్లో వ్రాసి ఆంధ్రభూమి వారపత్రికకి పంపించాను. ఎయస్‌లక్ష్మిగారవి ప్రచురిస్తాను కానీ, నాలుగైదులా కాదు ఒక శీర్షికలా వారపత్రికలో నడుపుదామని ఉత్తరం వ్రాశారు. ఇక్కడ ఆఫీసు పనితోనూ, తత్సంబంధమైన ప్రయాణాలతోనూ, నేను నడుపుతున్న తెలుగు స్కూలు పనితోనూ, కథా వ్యాసాంగంతో అప్పటికే ఎన్నో గంటలు పనిచేస్తున్న నాకది జరిగే పనిలా కనిపించలేదు. అదే వ్రాశాను. కానీ పట్టు విడవని లక్ష్మిగారు, మీరు కనీసం పది వ్యాసాలు వ్రాసేదాకా ఆగి, అప్పుడు ప్రచురణ మొదలుపెడతాను, దానితో మీకు సమయమూ సరిపోతుంది, వెసులుబాటూ అవుతుంది అని మొహమాట పెట్టారు. అలా మొదలయినాయి ఈ ఎన్నారై కబుర్లు. అలా ఈ వ్యాసాలు నాలుగున్నర సంవత్సరాల పైగా వారం వారం వ్రాశాను' అని రచయిత సత్యం మందపాటి పరిచయంలో వ్రాశారు.

ఇలాటి శీర్షిక నాలుగున్నర సంవత్సరాలు వ్రాయటం, ఈ శీర్షిక ఆపేసిన తర్వాత పాఠకులు నిరుత్సాహపడి ఉత్తరాలు వ్రాయటం చూస్తే, ఈ వ్యాసాలు ఎంతగా పాఠకులని ఆకట్టుకున్నాయో అర్థమవుతుంది. అంతేకాక ప్రచురించిన 15 నెలలలోనే, ఈ రెండు పుస్తకాలూ రెండవ ముద్రణ అవటం, ఈ ఎన్నారై కబుర్లు పాఠకులకు ఎంతగా నచ్చాయో తెలుస్తున్నది.

'ఈ శీర్షిక కింద ఆయన చెప్పినవి కాలక్షేపం కబుర్లు కావు. ఒట్టి మాటలూ కావు. చాలా కాన్ఫిడెన్స్‌తో చెప్పిన గట్టి మాటలు. వాటిలో వింతలూ విశేషాలూ ఉంటాయి. రచయితగా సత్యంగారి అనుభవాలూ, అనుభూతులూ ఉంటాయి. కొత్త ఆలోచనలుంటాయి. ఒక అనుభవజ్ఞుడి స్వగతంలా ఉంటాయి. మారుతున్న సాంస్కృతిక, సామాజిక, రాజకీయ పరిస్థితుల

అవలోకనంతోపాటు, విదేశాల్లో ఉంటున్న భారతీయుల మనస్తత్వ చిత్రణనీ సత్యంగారు అలవోకగా చేయగలిగారు. పాఠకులకి ఇంకా ఎన్నో విషయాలమీద కుతూహలం రేకెత్తించగలిగారు. అందుకు కారణం ఆయన శైలి. ఆయన చెప్పే ఏ కబురూ మరో కబురులా వుండదు. ఓసారి ఆప్తమిత్రుడిలా మనసులో మాటలు పంచుకుంటున్నట్టు ఉంటే, మరోసారి మాస్టారి అవతారమెత్తి పాఠం చెబుతున్నట్టు ఉంటుంది. ఒకసారి ప్రపంచాన్ని చూసి పరిహాసం చేస్తున్నట్టు తోస్తే, ఇంకోసారి మనని చూసి మనమే నవ్వుకోగలిగేట్లు చేస్తుంది. ఏ రకంగా చూసిన ఈ ఎన్నారై కబుర్లలో రచయిత హాస్యప్రియత్వం, సహృదయం స్పష్టంగా కనిపిస్తుంటాయి. నిష్ఠూరంగా ఉండే నిజాలనైనా సత్యంగారు నొప్పించకుండా తమాషాగా చెబుతారు. 'ఎన్నారై కబుర్లు' చదివాక ఈ మాట మీరూ అంటారు' అని తన ముందుమాటలో వ్రాశారు ఆంధ్రభూమి వారపత్రిక న్యూస్ ఎడిటర్ ఎ.ఎస్.లక్ష్మి.

'అమెరికాలో ఐదేళ్ళుండి వెనక్కి వచ్చేస్తాం!'

'ఉన్న ఇద్దరు పిల్లలనీ పరదేశానికి అర్పించి, ఈ వయసులో ఒంటరిగా ఇక్కడే కాలం వెళ్ళబుచ్చుదామను కుంటున్నాం. మనవలూ మనవరాళ్ళూ పుడితే, ఓపిక వుంటే ఆరు నెలలుండి వస్తాం. లేదా వాళ్ళతో ఫోన్‌లోనే మాటామంతీ. మాకిక్కడ రోగమొచ్చినా రొష్టు వచ్చినా మేమిద్దరమే ఒకళ్ళకొకళ్ళం, ఎవరూ లేనివాళ్ళలా!'

'నాకు ఆరు నెలల వీసా ఇచ్చారు. ఇండియాలో నాకు రిటైర్మెంట్‌కి ఇంకా నాలుగేళ్ళుంది. ఇక్కడ ఏదన్నా మంచి ఉద్యోగం దొరికితే అమెరికాలోనే వుండి పోదామని వుంది. నా చదువూ క్వాలిఫికేషన్లూ మీకు తెలుసు. నాకెక్కడయినా మంచి ఉద్యోగం వస్తుందంటారా? మీరేమయినా సహాయం చేయగలరా?'

ఇలాటి ఎన్నో విషయాల గురించి మనకి రకరకాల కబుర్లు వున్నాయి ఈ రెండు పుస్తకాల్లోనూ.

'ముళ్ళపూడి ఊరికే అన్లేదు, నిజంగా మందపాటి సత్యానిది 'ఇన్ఫోటైన్ మెంటాలిటీ'. సమాచారాన్నీ, సరదానీ మేళవించి; అదే సమయంలో బాధ్యతలనూ కర్తవ్యాలనూ గుర్తు చేస్తూ, సలహాలనూ సంప్రదింపులనూ అందిస్తూ, ఈ ఎన్నారై కబుర్లను కేవలం 'డయాస్పొరా' సాహిత్యంగానే కాక, అమెరికా రాగోరేవారికీ, వచ్చి వుండగోరేవారికీ ఒక కరదీపికగా, హితవరిగా సంతరించారు'

'అమెరికా వెళ్లినా వెళ్లక పోయినా ఇండియాలోని ప్రతివారూ ఓసారి ఈ ఎనారై కబుర్లు చదివి తీరాలి. అమెరికా తెలుగువారూ విధిగా ఈ కబుర్లు తమ అనుభవాలతో కలిపి కలబోసుకోవచ్చు. వెరసి ఇది ఉపయుక్తమైన మాటామంతీ. ఒక మంచి పరామర్శ గ్రంథం. కథకుడిగా ప్రసిద్ధుడైన మందపాటి సత్యం ఈ కబుర్ల ద్వారా ఒక ఇష్టుడైన కాలమిస్టుగా, హ్యూమనిస్టుగా, తనదైన హ్యూమరిస్టు పంథాలో పాఠక జన హృదయాలను నిస్సందేహంగా అలరించగలడు' అంటారు ప్రముఖ సమీక్షకుడు సుధామ.

ఏది ఏమైనా ఇవి రెండూ తప్పక చదివి, దాచుకోవలసిన మంచి పుస్తకాలు.

**ప్రచురణ:**

**సాహితీ సౌరభం,**

**హైదరాబాద్, గుంటూరు.**

**కాపీలకు: telugu_books@yahoo.com**

**www.satyam-mandapati.com**

**పుస్తక పరిచయం చేసినది - ఆదిత్య**



# పుస్తక పరిచయం




స్త్రీ శక్తి ప్రచురణలు
నెం. 1, శివప్రకాశ ముదలి వీధి
టి.నగర్, చెన్నయ్ - 600 017

వివాహానికి ముందు ఉన్నవ విజయలక్ష్మి పేరుతోనూ, వివాహమయ్యాక విజయలక్ష్మి రామకృష్ణన్ పేరుతోనూ మంచి కథలు వ్రాసారీ రచయిత్రి. ఎక్కువగా వీరి కథలు 1960 దశకంలో వస్తుండేవి. 'తెలుగు స్వతంత్ర', 'యువ' దీపావళి సంచికల్లోనూ, ఇంకా ఆంధ్రప్రభ, భారతి, ప్రజామత వగైరా పత్రికల్లోనూ ప్రచురించబడేవి. నలభైఏళ్ళ క్రిందట అమెరికా వచ్చాక కొద్దిగానే వ్రాసినా విజయలక్ష్మిగారి కథలు మనసుకి హత్తుకుంటాయి. గంభీరమైన శైలీ విన్యాసం కానీ, పదాడంబరంకానీ వీరి కథల్లో కనిపించవు. ముందు మాట వ్రాసిన రామమోహన్ రాయ్ గారన్నట్లు 'విజయలక్ష్మి గారి కథలు ఏ సిద్ధాంత చట్రానికీ లోబడినవి కావు. ఏ నినాదాలూ చెయ్యవు'. వాదాలూ, ఇజాలూ లేని కాలంలోనే మానవ సంబంధాలలోని సున్నితత్వాన్ని అతి సరళంగా చిత్రించారు. ఏవో కొన్ని పాత్రలూ, సన్నివేశాలూ, సంభాషణలూ అన్నట్లు కాకుండా ప్రతి కథా ఆలోచింపచేస్తుంది, మనసుకి సున్నితంగా తాకుతుంది. కథ ముగిసిన వెంటనే తరువాతి కథకి పరిగెత్తడం కాకుండా కాస్సేపు - ఆలోచిస్తాం. ఎక్కడో మనసు మూలల్లో పాత్రలు తిష్టవేసుక్కూచుంటాయి. ఉదాహరణ.. 'వర్షంలో వచ్చిన మనిషి'.. విడిపోయిన తర్వాత చాలా కాలానికి కలుసుకున్న భార్యాభర్తల మధ్య జరిగే విచిత్ర సన్నివేశాల సంకలనం.. అలానే మిగతా కథలు కూడా. రెండు సార్లు అమెరికా అధ్యక్షుడి నుంచీ ఉత్తమ ఉపాధ్యాయురాలి బహుమతి నందుకున్న విజయలక్ష్మి రామకృష్ణన్ గారు, సౌత్ డకోటా లోని రాపిడ్‌సిటీలో ఉంటున్నారు. దాదాపు 50 సంవత్సరాల క్రిందటి కథలైనా అన్నీ మానవ సంబంధాల మీద అల్లినవే కాబట్టి ఇప్పటికీ కొత్తగానే అనిపిస్తాయి. ఆసక్తిగా చదివిస్తాయి.. ఆలోచింపచేస్తాయి. జీవితంలో, జీవనంలో, ఆలోచనల్లో, మానవ సంబంధాల్లో సునిశితత్వాన్ని తరచి చూడాలనుకునే ప్రతి ఒక్కరూ చదవాల్సిన కథలు. ఇంతచక్కటి కథలు ఎప్పుడో రాసిన విజయలక్ష్మి గారు - ఆధునిక జీవనపోకడలని కూడా విశ్లేషిస్తూ తనదైన శైలిలో కథలు వ్రాస్తే కొత్త తరం పాఠకులకి సాహితీ విందునందించిన వారౌతారు.



*Ganga Mahalakshmi Publications*
9026 Sierra Lane
Palos Hills, IL 60465
Email: siramdasu@hotmail.com
708-599-6410

నైరూప్య చిత్రకారునిగా ప్రపంచ వ్యాప్తంగా పేరు తెచ్చుకున్న పద్మశ్రీ డా. ఎస్.వి రామారావు గారు అంతర్జాతీయ కళారంగం మీద చెరిగిపోని సంతకంచేసిన కళాకారులు. భారత మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలామ్ గారి చేత 'ఒక మహా గొప్ప చిత్రకారునిగా ప్రపంచంలోనే గుర్తింపు సాధించిన ఒక అసాధారణ వ్యక్తి పక్కన నేను నడుస్తున్నాను అంటే నీవేమంటావు..' అన్న ప్రశంసని పొందారు. చిన్నతనంలో బాలగేయాలు వ్రాసినా 1998 నుంచీ రచనలు చేపట్టిన రామారావు గారు వ్రాసిన ఆధ్యాత్మిక కవితా సంకలనం 'కాలాంచలాలు'. ముఖచిత్రంగా తాను చిత్రించిన నైరూప్య చిత్రాన్నే చూపించిన ఈ పుస్తకం అట్ట మీద పుస్తకం పేరుగానీ, మిగతా వివరాలు కానీ ఉండవు. ఇదొక కొత్త ప్రయోగం. "'కాలాంచలాలు' చూచిన ఓ కళాకారుడు, దిగంతాలను వర్ణవర్ణాలుగా చిత్రించిన ఓ విశ్వవిఖ్యాత చిత్రకారుడు నేడు రంగుల్ని మాటల్లోకి మార్చుకుంటున్నాడు." అన్నారు ముందుమాటలో 'మో' గారు. పాతికపైగా కవితలూ, వీరు చిత్రించిన కొన్ని చిత్రాలు కల్పి చదివి దాచుకోవాల్సిన గ్రంథంగా విమర్శకుల ప్రశంసలనందుకుంది ఈ కవితా సంకలనం. సవివరమైన ముందుమాటలూ, రచయిత గారి స్వీయ కథనం, చివరలో పుస్తకం గురించిన పత్రికా సమీక్షలూ ..అన్నీ కలిసి ఒక పరిపూర్ణమైన అనుభూతిని అందిస్తాయి చదువరులకి. "నీటి పంపు/ నీరు నిచ్చినంత మాత్రాన/ నీటిని సృష్టించిందనలేము / నీరు పారేందుకు మార్గమే / నీటి పంపు చేసేది గదా!" , " బుద్ధుని బోధలు అందరూ విన్నవే / తిరిగి తిరిగి వారితో వారు చెప్పుకున్నవే / మననం చేసికొన్నవే/ వ్రాసిన వారు లేరు, చెక్కిన శిలాఫలకాలు లేవు / ప్రతిధ్వనించే పుణ్యభూమి / భారతావని మాత్రమే ఉంది-- సాక్ష్యంగా.." ఆధ్యాత్మిక భావాలని ఆధునిక లోచనలతో రంగరించిన ఇందులోని ప్రతి కవితా ఒక వర్ణచిత్రంలానే కనిపిస్తుంది..అనిపిస్తుంది..!



# పుస్తక పరిచయం




Vikasam Books
411 Prabhakar Apartments
Vijayanagar Colony
Hyderabad – 57
Phone# 334 5091

"ఇవి దేశ సరిహద్దులకు పరిమితమైన కథలు కావు. తాత్వికులూ, దార్శనికులూ, ప్రతిభావంతులైన మేధావులూ, సంస్కర్తలూ విప్లవ కార్యాచరణలో భాగంగా రాసిన విప్లవ రచయితలూ సృష్టించిన నిప్పురవ్వలు" అనీ ఈ పుస్తకం వెనుక అట్టమీద ప్రచురణకర్తలు పేర్కొన్నారు. పుస్తకం పేరులోనే ఉన్నట్లు తొమ్మిది దేశాల రచయితల అత్యుత్తమశ్రేణి కథలు. మొత్తం 18 అనువాదాలివి. బెర్ట్రండ్ రసెల్, సోమర్ సెట్ మామ్ లాంటి ప్రముఖరచయితలే కాక కాల్దెరాన్, షిగా నమోగా లాంటి అంతగా తెలియని రచయితల మంచి కథలు కూడా ఇందులో చోటుచేసుకున్నాయి. పేరుకి అనువాద కథలే కానీ చదవడం మొదలుపెడితే (కథలో ప్రదేశాలూ, పేర్లూ తప్ప) స్వచ్ఛమైన తెలుగులోనే ఆలోచించి, తెలుగులోనే రాసిన కథల్లా ఉంటాయి. కథాంశాలు ఎన్నుకోవడంలో చాలా వరకూ ఉదాత్తమైన, కరుణ రసాత్మకమైన కథలనే ఎన్నుకున్నారు రచయిత. కథా శైలి గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాలి. ప్రతి వాక్యం ఒక శిల్పంలా రూపుదిద్దుకుంది. ప్రతి కథా చదవగానే గుండెలు బరువెక్కుతాయి. ఒక అద్భుత సౌందర్య శిల్పాన్ని తనివితీరా దర్శించిన అనుభూతి కలుగుతుంది. మచ్చుకి ఒక పేరా చూడండి.." శాద్వలాలు అదృశ్యమై రెక్కల చప్పుడు వినిపించింది. బూడిద రంగు కిటికీ, ఎప్పటిలాగే ఫర్నిచర్, కొవ్వొత్తి పచ్చని మంట, గోడలపై ఊగాడే నీడలు, చీకటి..ఏదో కొత్తగా ఉంది - బహుశా తెలుపెక్కుతున్న - ఆకాశం. నా కళ్ళు ఎంత పదునైనాయంటే యిదివరకు కనిపించనివి కూడా ఇప్పుడు కనిపిస్తున్నాయి. నన్ను నేను చూడగలుగుతున్నాను. నా గుండెలో ఏ రకమైన బాధా లేకపోవడం కూడా చూడగలుగుతున్నాను...మరణమో..మరో జీవితమో..ఏమైనా సరే.." - రచయితతో వెళ్ళిపోతున్నారు కదూ..అక్కడే పార్థసారధి గారి శ్రమ సఫలమైంది.! ఈ కథలన్నీ 1977- 90 మధ్యలో వివిధ పత్రికల్లో ప్రచురితమైనవే. అంతర్జాతీయ సాహిత్యంలోని కొన్ని మణిపూసలకి అచ్చమైన తెలుగు రూపం.




***Nishapathi***
***48/101 Huda Complex***
***Saroor Nagar***
***Hyderabad – 500 035***
***Phone# : 2405 6382***

కథా, నవలా రచయితా, వచన, పద్య కవితా రచనలో నిష్ణాతులూ ఐన శ్రీ నిశాపతి గారు తమ తల్లిగారి జ్ఞాపకాల సంపుటిగా వెలువరించిన 'కథన కావ్యం' ఈ 'తల్లీ నిన్ను దలంచి..' పద్యకావ్యం. సరళ గ్రాంధిక శైలిలో సాగిన ఈ పద్యాలు అర్థం చేసుకునేందుకు ఏ మాత్రం కష్టపడాల్సిన అవసరంలేదు, ఏ పదకోశమూ అవసరం లేదు. ఎందుకంటే ఇందులోని ప్రతి పద్యమూ నిశాపతి గారి జ్ఞాపకమే ఐనా ప్రతిదీ ఒక అనుభూతి దర్పణంగా కనిపిస్తుంది. జీవితంలో జరిగిన సాధారణ సంఘటనలనే సులువుగా చదివించే పద్యాల రూపంలో అందించడం అంత సులభమైన ప్రక్రియమే కాదు. ఈ ప్రయోగంలో నిశాపతిగారు నూటికి నూరుశాతం విజయం సాధించారు. వ్రాసింది వారి అమ్మగారి గురించే ఐనా ఎక్కడో చోట ప్రతివారికీ వారి 'అమ్మ' గారు గుర్తు రావడం సహజమే. అదే ఐడెంటిఫికేషన్. అందుకే ఇందులో కథనానికీ , అనుభూతికే ప్రాధాన్యత నిచ్చానని రచయిత చెప్పారు. ఇది నిజంగా నిజం.

దైవ ప్రార్థనతో మొదలై మంగళాశాసనంతో ముగిసిన ఈ పద్య కావ్యంలో అమ్మ, పుట్టింట్లో అమ్మ, అమ్మ పెళ్ళి, అమ్మ అమ్మే, అమ్మ దగ్గర బాల్యం, అమ్మ నాన్నలతో తీర్థయాత్రలు, అమ్మ - అనారోగ్యం.. వగైరా అధ్యాయాలు ఉన్నాయి. పేరుని బట్టే ఈ పద్యాలలోని అంశాలని తేలికగా ఊహించుకోవచ్చు. చదివేప్పుడు మన జీవితాలలో కూడ వెనక్కి తిరిగి చూసుకోవచ్చు. . మచ్చుకి ఒక పద్యం - **చేతుల జాపుమంచు నరచేతుల బెట్టితి వెన్నముద్దలా**
**చేతులతోనె బెట్టితి నిసీ! కొరవిన్ దయమాలి నీ తలన్**
**తరువాయిగన్ మిగిలినట్టిది గుప్పెడు జ్ఞాపకమ్ము కృ**
**ష్ణాతటి లోగొనెన్ తుదకు శాశ్వతమాయె స్మృతుల్ తలంపులన్**

ఎంతో సున్నితమైన సంఘటనలని మరింత సున్నితంగా పద్యరూపంలో అందించిన నిశాపతి గారి ఈ ప్రయత్నం బహు అభినందనీయం.

# పుస్తక పరిచయం




**_Lipi Publications_**
**_Gandhi Nagar_**
**_Vijayanagar Colony_**
**_Hyderabad – 500 080_**
**_Phone# 2761 2244_**

అమెరికా ట్రవెలోగ్స్ చాలామంది రాసారిప్పటికే. మరైతే ఇందులో ఇంకే కొత్తగా ఏముంటుందీ అనిపించవచ్చు పేరు చూడగానే. కానీ అమెరికాలో ఎప్పటినుంచో నివసిస్తున్న వారికి సైతం ʻఅరే..అమెరికా జీవన విధానంలో ఇన్ని సున్నితమైన విశేషాలున్నాయా? మనమే ఎప్పుడూ గమనించలేదే.ʻ అనిపించేలా, తమ రెండో సారి అమెరికా పర్యటనానుభవాల్ని వివరించారు శ్రీ మల్లాది వెంకటకృష్ణమూర్తి గారు. చిన్ని, చిన్ని వాక్యాలు, సులభమైన సరళమైన శైలీ..పుస్తకం చదువుతుంటే ఎంతో ఆహ్లాదకరంగా ఉంటుంది. మూడు నెలల అమెరికా పర్యటనలో కుటుంబసభ్యులతో కలిసి ఆయన నివసించిన ప్రదేశాలూ, సందర్శించిన అనేక నగరాలూ. కలుసుకున్న వ్యక్తులూ..ఎంతో వివరంగా వ్రాసారు. ఆయన పరిశీలనాసక్తి, పరిశీలించిన వాటినన్నంటినీ జ్ఞాపకం వుంచుకుని ఆకర్షణీయంగా మనకి అందించిన విధానం సదా అభినందనీయం. కేవలం వాస్తవాలని వివరించడమే కాకుండా మధ్యమధ్యలో సందర్భానుసారంగా జోక్సూ, అవసరమైన చోట చారిత్రాత్మక వివరణలూ..ఈ పుస్తకాన్ని ట్రావెలోగ్ కంటే ఒక మెట్టు పైన ఉండేలా చేసాయి. ఇంకో విశేషమేమంటే – ఆయన కలుసుకున్న వ్యక్తులని కూడా ఈ కథనంలో పాత్రలుగా చేసి వారితో కల్సి మనమూ ప్రయాణిస్తున్న అనుభూతిని సృష్టించారు. పర్యటన ముగిసాక మల్లాది గారు రాసిన కొన్ని జనరల్ విషయాలు ఆలోచనాత్మకంగా వున్నాయి .ʻఅమెరికాలోనే ఉండిపోవడానికి కారణాలు, ʻకొంతమంది అమెరికా నుండీ ఇండియాకి తిరిగి వచ్చెయ్యడానికి కారణాలుʻ, ʻఅమెరికాలో పైకి కనిపించకుండా ఉండే కొన్ని పరిమితులూ..ʻ ఇలాంటి విషయాలు..

అలానే చివరలో అమెరికాలో నాన్- ఇండియన్ భోజనశాలలో దొరికే వెజిటేరియన్ పదార్థాల వివరాలు చక్కగా రాసారు. అమెరికా పర్యటించబోయే వారికి చక్కటి గైడ్ గా ఉంటుంది, చూసేసిన వారికి జ్ఞాపకాలు నెమరువేసుకునేందుకు ఉపయోగపడుతుంది. మల్లాది గారు ముందులో వ్రాసినట్లు ..The act of discovery is not finding new lands, but in seeing with new eyes – Marcel Proust

ఈ పుస్తకం చదివిన ప్రతివారూ, మల్లాది గారు ఈ వాక్యాన్ని నూటికి నూరు శాతం నిజం చేసారని ఒప్పుకుంటారు.




ఒరిస్సానుంచీ రచయితగా ఎదిగిన ప్రవాసాంధ్ర రచయిత శ్రీ ఆనందరావు పట్నాయక్ గారి ద్వితీయ కథా సంపుటి 'గురుదక్షిణ'. చక్కటి ముద్రణ, ఆకర్షణీయమైన ముఖ చిత్రంతో తయారైన ఈ పుస్తకంలో చిన్నవీ పెద్దవీ కలిసి దాదాపు 30 కథలున్నాయి. ఈ పుస్తకానికి ముందు మాట వ్రాసిన అవసరాల రామకృష్ణారావు గారు, "అల్లరి పెట్టడం కానీ, అఖ్ఖర్లేని నీతులు వల్లించడంకానీ, అనవసరమైన ఆడంబరాలు కానీ ఈ కథల్లో కనిపించవు. ఏదైనా ముక్కుసూటిగా ముక్తసరిగా సాగుతుంది. ఏ కథలో చూసినా సామాన్యుడికి పరిచితమైన బస్సుప్రయాణంలోదో, రైలు జర్నీదో...ఏదో ఒకే ఒక సంఘటన - మహా ఐతే అచ్చులో రెండు పేజీలు..అంతే..!" అని పేర్కొన్నారు. ఒకటి రెండు సీరియస్ కథలు తప్పితే మిగతా కథలన్నీ అలానే ఉన్నాయి. శైలీ, శిల్పం, సామాజిక ప్రయోజనం, మానసిక విశ్లేషణ, పాత్ర చిత్రణ..లాంటి విషయాల జోలికి పోకుండా కేవలం కాలక్షేపానికి చదవదగ్గ పుస్తకమే ఇది. అదొక కథకి ఇతివృత్తమౌతుందని ఎవరూ ఊహించని అతి చిన్న సంఘటనలని కూడా కథలుగా మార్చారు ఆనందరావు గారు. భవిష్యత్తులో ఇంకా మంచి మంచి కథలు ఈ రచయిత నుంచీ వస్తాయని ఆశిద్దాం..

*జయంతి పబ్లికేషన్స్*
*203, కంచి రెసిడెన్సీ*
*దిల్ సుఖ్ నగర్, హైదరాబాదు - 500060*
*ఫోన్: 92473 02882*
Jayanthipublications@gmail.com

# పుస్తక పరిచయం




శ్రీ వేంకటేశ్వర నిలయం
21 / 414 - 2, భాస్కరపురం
మచిలీపట్నం - 521 001

ఒంగోలులో గణాంకాధికారిగా పదవీ విరమణ చేసిన కోడూరి శ్రీపాండురంగారావు గారు వ్రాసిన పద్య సంకలనం ఈ గ్రంథం. ముందుమాటలో ఆయన ఇలా వ్రాసుకున్నారు "నాకు గల భాషాజ్ఞానము, వ్యాకరణ విజ్ఞానములు కించిన్మాత్రమైనవి. ప్రత్యేకముగా గురుముఖముగా నేర్చినది శూన్యము. మా తండ్రిగారు శ్రీ కోడూరు వేంకటేశ్వరరావు గారు వేసవి దినములలో భారత భాగవతములను చదివించెడి వారు. వారు నేర్పినదే నేను నేర్చినది". ఆయన వినయంకొద్దీ ఈ మాటలు చెప్పినా ఈ పుస్తకంలోని ప్రతి పద్యంలో వారి పాండితీ ప్రకర్ష కనిపిస్తుంది. పేరుకి 'సాత్రాజితీయము' అని సత్యభామకి చెందిన కథ అనే భావం వొచ్చేలా ఈ పుస్తకానికి శీర్షిక పెట్టినా, నిజానికి ఈ పుస్తకంలో నాలుగు విభాగాలున్నాయి. స్తుతి- ఇందులో రచయిత తాను గౌరవించే, ఆరాధించే వారందరికీ వందనాలు అర్పించే పద్యాలిందులో ఉన్నాయి. తాజి - ఇందులో తాజ్ మహల్‌ని రచయిత చూసినప్పుడు కలిగిన భావావేశం పద్య రూపంలో పరుగులు తీసింది. కేవలం తాజ్ మహల్ వర్ణన మాత్రమే కాక ఔరంగజేబు, షాజహాన్‌ల మధ్య నడిచిన చారిత్రక సంఘటనలని కూడా పద్య రూపంలో వ్యక్తపరిచారు. శ్రీ పురందరదాసు కథ: దాదాపు 80కి పైగా పద్యాలలో పురందరదాసు కథని చిత్రించారీ మూడో అధ్యాయంలో, చివరి విభాగం - సాత్రాజితీయం.- సత్యభామ యొక్క విరహవేదనా నివేదన. శ్రీ పాండురంగారావు గారి పద్యాలు సందర్భానికి తగినట్లుగా కొన్ని చోట్ల సున్నితంగా, మరికొన్ని చోట్ల గంభీరంగా, ఇంకొన్ని చోట్ల నెమ్మదిగా, మరోచోట జవనాశ్వవేగంతోనూ సాగుతాయి. గంభీర సంస్కృత సమాసాలే కాక తేట తెనుగు పదాల సొబగులు కూడా అద్దుకున్న ఈ పద్యాలు మనసుని అలరిస్తాయి. ప్రాచీనాంధ్ర కవుల కవితా పరిమళాలు ప్రతి పద్యంలోనూ గుబాళించే ఈపుస్తకం, పద్య ప్రియులందరికీ ఒక కమ్మటి విందు. మచ్చుకి కొన్ని పద్యపాదాలు - 'గుండెల పయిని పెంచిన కొడుకు తుదకు / తండ్రినన్న గౌరవమేమి తలంపకుండి / కఠిన రీతిని బాధించె కడకునిటుల / శ్వాసఁ బీల్చెడి శవమైతిఁ జావకుంటి (కుమారుని చేతిలో బందీ ఐన షాజహాను మనోవేదన)." కవి సార్వభౌముండు కదలాడిన ధరణి / కోటి విద్యల తావు కొండవీడు ".. ***




కథా రచయిత్రీ, చిత్రకారిణీ ఐన శ్రీమతి వారణాసి నాగలక్ష్మి గారు కవయిత్రి కూడా. ఈ సంపుటిలో ప్రకృతిగీతాలు, భావ గీతాలు, ప్రణయ గీతాలు, పిల్లలపాటలు అనే నాలుగు విభాగాల్లో దాదాపు 80 వరకూ లలిత గీతాలు ఉన్నాయి. ముందుమాటలో డా.సి.నా.రె చెప్పినట్లు ప్రతి గీతమూ పల్లవీ, చరణాలు అనే నిర్మాణంలో సాగి సంగీతంలో ఇట్టే ఒదిగిపోయేందుకు అనువుగా వున్నాయి. ప్రతి గీతంలోనూ ఒక కొత్త సౌందర్యం తొంగిచూస్తుంది. ఏ విభాగంలోని పాట ఐనా ప్రకృతి ప్రస్తావన ప్రముఖంగా వుంది. ప్రకృతిలోని ప్రతి అందాన్నీ సుందరమైన పదాలలో బంధించి పాటలుగా మనముందుంచారు రచయిత్రి. ఈ సంపుటికి 'వాన చినుకులు' అన్న పేరు పెట్టడంలోనే రచయిత్రి భావుకత ద్యోతకమౌతోంది. తన ముందుమాటలో 'ఎండకి ఆవిరైన నీరు మేఘాలుగా పోగుపడి, వానచినుకులుగా కురిసినట్టే, మనసులో కలిగే రకరకాల స్పందనలు పదాలుగా, పాటలుగా మారి పుస్తకరూపంలో వెలువడినప్పుడు దాన్ని 'వాన చినుకులు'గా అభివర్ణించడంలో ఔచిత్యం ఉందనిపించింది" అని వ్రాసారు. పాఠకులుకూడా ఈ అభిప్రాయంతో ఏకీభవిస్తారు. ఇందులోని ప్రతి పాటా అంత అందంగా రావడానికి కారణం రచయిత్రి చిన్ననాడు పెరిగిన పరిసరాలు అని చెప్పకనే చెప్పారు. "చుట్టూ అన్నీ పొలాలు, మధ్యలో మాయిల్లు.. చిన్నతనంలో మా నాన్నగారూ, అమ్మా మాకిచ్చిన కానుక అది. మా బాల్యం, కౌమారం అలా 'ప్లీడరు గారి తోటలో గడిచాయి.." ఈ వర్ణనకి తగినట్లే ప్రతి పాటలోనూ పచ్చటి ప్రకృతి పురివిప్పి నాట్యమాడుతుంది. కొన్ని ఉదాహరణలు "వర్షించిన ఈ ఉదయం / సుప్రభాత సుందరి పయనం / వర్షించిన ఈ ఉదయం / సురార్చనకు శుభ సమయం' - "వెన్నెలనై,వేకువనై / గువ్వమ్మల కువకువనై / ఉత్సాహం ఉప్పొంగు వేళ / పంచుకునే నేస్తమై, స్నేహపూరిత హస్తమై..నా సమస్తమై.."
సరళంగా చదివించే గీతాలవి.. అలవోకగా మనసుని దోచే గేయాలివి.

*Varanasi Publications*
*303, Edikode Towers*
*Srininagar Colony*
*Hyderabad – 500 073*



# పుస్తక పరిచయం




**తెలుగులో** స్మృతికావ్యాలు చాలా తక్కువ. ప్రాణంలో ప్రాణమై, జీవితంలో సగభాగమై బ్రతికిన ఇల్లాలు కళ్ళముందే పరలోకానికి వెళ్ళిపోయినప్పుడు కన్నీరు కవిత్వమై స్రవిస్తే రూపుదిద్దుకున్నవే స్మృతికావ్యాలు. వీటిలో ముఖ్యమైనవి విశ్వనాథ వారి 'వరలక్ష్మీ త్రిశతి', దువ్వూరి రామిరెడ్డి గారి 'భగ్నహృదయము', రావూరి భరద్వాజ గారు తన భార్య గురించి వ్రాసిన కావ్యం. ఈ కోవకు చెందినదే ఈ సుదీర్ఘ కవితా కావ్యం 'నువ్వు లేని నేను'. కె.బాలకృష్ణారెడ్డిగారు స్వత హాగా మధురకవి. సున్నితమైన భావాలతో అందమైన పద చిత్రాలతో 'పుప్పొడి రాలిన చప్పుడు', 'రా..ఇలా కోయిలా' అనే గేయ కవితా సంపుటాలని వెలువరించారు. ఐతే 2001 జూన్ నెల 26 వతేదీ రాత్రి వారి గ్రామంలో జరిగిన దోపిడి దొంగల భీభత్సంలో అనురాగమయి ఐన అర్ధాంగిని కోల్పోయిన కె.బాలకృష్ణారెడ్డి గారి హృదయవేదన, ఆత్మ నివేదన ఈ దీర్ఘ కవితగా రూపుదిద్దుకుంది. 'చీకటి ముసిరిన కానలో ఒక వేకువ వికసించునా / గుండెను కోసే జ్ఞాపకాలతో ఓ కావ్యం రాయనా..' అంటూ స్వర్గీయ రాజేశ్వరిగారిని అడిగినట్లుగా కవిత్వాన్ని సాగిస్తారు రచయిత. ఈ సుదీర్ఘకవిత కేవలం రచయిత మనోవేదనకి దర్పణం మాత్రమే కాక, చదువరుల మనసుని తాకే విషాద వీచికా సంచయంగా అనిపిస్తుంది. పుస్తకం చదవడం పూర్తయే సరికి మనసు బాధతో బరువెక్కుతుంది. "కొన్ని పాటలు నన్ను నిలదీస్తున్నాయి / నా గుండెను నిలువునా కోస్తున్నాయి / నీ కిష్టమైన పాట / నీ కోసం నా కలం కురంగమై / గంతులేసిన పాట.." - "ఎలాగైనా నిన్ను చేరుకోవాలని / అనుకుంటే ఎంత నిరాశ / నిన్ను చేరుకోవడం కోసం / ఎప్పుడు ఆగిపోతుందో ఈ శ్వాస.." ఇలా సాగే ఈ పుస్తకం గురించి రచయిత మాటల్లోనే - "నిన్నటి దాకా ఆమె నా జీవితం ..ఇప్పుడు తానొక జ్ఞాపకం..- ఈ అక్షరాలలో ఆమె ఆత్మ వున్నది ..ఈ పదాలలో ఆమె ఆర్తి ఉన్నది..ఈ కావ్యంలో ఆమె కీర్తి ఉన్నది. మనసుకి మరణం లేదు ఆమె నన్ను వీడిపోనే లేదు. ఆమె ఒక అక్షరం, ఆమె ఒక అద్భుతం, ఆమె ఒక ఔన్నత్యం, ఆమె నా జీవన జీవం..నా జీవనరాజీవం..అందుకే ఈ కావ్యం ఆమే ఈ కావ్యం.." ***

*K.Balakrishna Reddy*
*F6, Satya Parvathi Apts,*
*Lawerpet,*
*ONGOLE*
*Phone: 08592-239632*




**వారణాసి నాగలక్ష్మి** గారు కవయిత్రి, కథా రచయిత్రి, చిత్రకారిణి. గేయాలు వ్రాయడంలో ఎంత లాలిత్యం చూపిస్తారో కథా రచనలో అంత సున్నితత్వం ప్రదర్శిస్తారు. మనచుట్టూ తిరిగే మనుషులూ, మనందరం ఎప్పుడో ఎదుర్కొన్న సంఘటనలూ..ఇవే ఈ కథలన్నీ. ఐతే వాటి అన్వయం, వాటిల్లోంచి మనం గ్రహించదగిన జీవిత పాఠం..వీటిని కన్విన్సింగ్‌గా చెప్పడమే రచయిత్రి గొప్పదనం. వీరి కథలు ఎందుకిలా మనిషితనంతో మట్టివాసనతో నిండి ఉంటాయో ఆమె మాటల్లోనే తెలుసుకుందాం.. "అంతులేని ఆకాశం.. నీలంగా, ఎగిరే కొంగలూ, ఎండలో మబ్బులూ తెల్లగా, మిరపచేలూ, కారబ్బంతి తోటలూ....... ఆస్వాదిస్తూ, రైతు జీవితంలోని వ్యథలూ, వేదనలూ, ఉమ్మడి కుటుంబాల్లోని అనురాగాలూ, ఆప్యాయతలూ, స్వార్థాలూ, అపార్థాలూ అర్థం చేసుకునేందుకు ప్రయత్నిస్తుంటే కలిగింది ఏదైనా రాయాలనే తపన". ఈ కథల్లోని మొదటి కథ 'ఆలంబన' లోనే సహచరి దూరం కాగా, సంతానం విదేశాల్లో ఉంటే మిగిలిన ఒంటరి జీవితాన్ని అర్థ వంతంగా తీర్చి దిద్దుకున్న ఒక రామశాస్త్రి గారి కథని హృదయంగమంగా చిత్రించారు. మిగతా కథల్లో కూడా అనుకూల దాంపత్యాల గురించీ, ఆదర్శవివాహాల గురించీ, అత్తింటి కాపురాల గురించీ, పిల్లల పెంపకం గురించీ..ఇలా అన్నీ కుటుంబ సంబంధాల గురించిన వస్తువులనే స్పృశించారు. ఈ కథలన్నీ చదవడం ముగించగానే ఒక్కసారి పుట్టిన పల్లెటూరు వెళ్ళివచ్చినట్లుంటుంది. ***

*Varanasi Publications*
*303, Edaikode Towers*
*Srinagar Colony*
*Hyderabad – 500 073*
*Phone: 040-2373 2745*



# పుస్తక పరిచయం




Navodaya Book House
Kachiguda X Roads
Hyderabad

ఆధునిక కవితా ప్రపంచంలో శ్రీశ్రీకి గల స్థానమూ, ఆయన 'మహాప్రస్థానం' గ్రంథం సృష్టించిన, కొనసాగిస్తున్న చరిత్రా అనితరసాధ్యం, అనుపమానం. ఎంతోమంది కవుల్ని తయారు చేసిన కవితా సంపుటి మహాప్రస్థానం. గత కొన్ని దశాబ్దాలుగా ఈ 'మహాప్రస్థానం' గురించి ఎన్నో వివరణలూ, విశ్లేషణలూ, విమర్శలూ, పరిశోధనా వ్యాసాలూ వచ్చాయి. ఎన్నో సిద్ధాంతగ్రంథాలకు ఈ 'మహాప్రస్థానం' ప్రాతిపదిక ఐంది. వెలువడి ఎన్ని దశాబ్దాలైనా, ఇంకా ఈ పుస్తకంపై విశ్లేషణలు రావడమూ, వాటిని కవితా ప్రియులూ ఆదరించడమూ, మహాప్రస్థానానికి గల బలాన్నీ, కవితాశక్తినీ ఋజువు చేస్తుంది. ఆ కోవకి చెందినదే ఈ పుస్తకం. ప్రముఖ సాహితీ కర్త, తెలుగు సాహితీ ప్రపంచంలో తనకంటూ ఒక స్థానాన్ని ఏర్పరచుకున్న కవి, రచయిత, విమర్శకులూ ఐన ప్రొ.మాదిరాజు రంగారావు గారు వ్రాసిన సాహితీ విశ్లేషణా గ్రంథం ఈ పుస్తకం. వీరు ఈ పుస్తకానికి చివరి వాక్యాలుగా వ్రాసిన "మహా ప్రస్థానం సంపుటిలో కవిత్వాన్ని సంపూర్ణంగా అర్థం చేసుకోడానికీ, అనుభవ విస్తృతిని పొందడానికి ప్రాచ్య పాశ్చాత్య సాహిత్య శాస్త్ర మర్యాదలతో పాటు కవిత్వంలో సంప్రదాయ మార్గమూ ఆధునిక సామాజిక రాజకీయ మనస్తత్వ శాస్త్ర ధోరణుల పరిచయమూ ఉంటే మంచిది' అన్న వాక్యాలకి నిజమైన ఋజువుగా ఈ పుస్తకంలో శ్రీశ్రీ కవితలని ఆమూలాగ్రం వివిధ కోణాల్లో విశ్లేషించారు. కవితా రీతీ, శైలీ, వివరణలే కాక విశ్లేషించిన ప్రతి కవిత వెనుకా వున్న సామాజిక, సాంఘిక పరిస్థితుల ప్రభావాన్నీ, కవిత రూపుదిద్దుకున్న నేపథ్యాన్నీ, కవి ఆ కవిత వ్రాయడం వెనుకనున్న అంతరార్థాన్నీ విశదంగా వ్రాసారు. మొత్తం 13 అధ్యాయాలుగా విభజించబడిన ఈ పుస్తకంలో ఒక్కో అధ్యాయంలో 'మహాప్రస్థానం'లోని ఒక కవితని తీసుకుని కూలంకషంగా చర్చించడం, విశ్లేషించడం, విమర్శించడం జరిగింది. శబ్ద ప్రధానమైన 'తలుపు గొళ్ళెం, హారతి పళ్ళెం, గుర్రపు కళ్ళెం..' లాంటి కవితా పంక్తుల్ని మామూలు పాఠకుడు ఏదో రిథమిక్ గా ఉందని చదువుతాడు. కానీ రంగారావుగారు అందులోని ప్రతి పదాన్నీ కవి ఎందుకు వ్రాసాడో, అది ఏ సత్యాన్ని నిరూపిస్తుందో, ఏ సందేశాన్ని వినిపిస్తుందో సవివరంగా వ్రాస్తారు.. శ్రీశ్రీ కవిత్వంలోని లోతుల్ని తెలుసుకోవాలనుకునే వారందరూ తప్పక చదవాల్సిన సాహితీ విమర్శనా గ్రంథం ఇది.




ఆధునిక కవితారంగంలో 'వచన కవిత' అన్న ప్రక్రియ మొదలయ్యాక కవిత్వం వ్రాసేవారు పెరిగిపోయారు - అనేది అందరూ ఒప్పుకునే సత్యమే. వచన కవిత్వం అసలు కవిత్వమేనా? ఒక పక్క 'వచనం' అంటూ మళ్ళీ అందులో కవిత్వమేమిటీ అన్న కొన్ని వాదనలని కాస్సేపు పక్కన పెడితే, వచన కవిత్వంలో కూడ చరిత్రసృష్టించిన కవితలెన్నో వచ్చాయన్నది నిర్వివాదాంశం. కవితల సంఖ్యతో పాటే కవితా రూపాల సంఖ్యకూడా పెరిగింది, తెలుగు భాషలో. మినీ కవితలూ, మైక్రో కవితలూ, హైకూలు, నానీలు..ఇవన్నీ విభిన్న వచనకవితా ప్రక్రియలు. దేని మీద ఎన్ని వివాదాలున్నా అన్ని ప్రక్రియల్లోనూ వ్రాసేవారు వ్రాస్తున్నారు, చదివే వారు చదువుతున్నారు. ప్రముఖ కవి ఆచార్య ఎన్. గోపి గారు ప్రారంభించిన సరికొత్త కవితా రూపమే 'నానీలు' కేవలం 20-25 అక్షరాలలోపు నాలుగు పదాలుగా వ్రాసిన కవితని 'నానీ'గా ప్రతిపాదించారు. మచిలీపట్నంలోని సాహితీ కురువృద్ధులు శ్రీ జి.సత్యనారాయణ గారు వ్రాసిన నానీల సంపుటే ఈ 'అక్షర క్షణాలు'. చిన్ని, చిన్ని పదాలతో కేవలం 20-25 అక్షరాల్లో సత్యనారాయణ గారు ఈ నానీల్లో పొదిగిన అర్థాలు అనంతం..

మచ్చుకి కొన్ని

'పసి నిఘంటులో / ఏడ్పుకు అర్థం? / తల్లికి తెలుసు / నువ్వూరుకో.." - "అందని కొమ్మకై / ఎగరడం / బాల్యమే బాగుండేది / ఆగని ప్రయత్నం..". చాలా నానీలు పదేపదే - ఆలోచింపచేస్తాయి ఈ పుస్తకంలో. చదివి ఆనందించడానికీ, ఆలోచించడానికే కాక పదే పదే ఉదహరించడానికి కూడా ఉపయుక్తమయ్యే ఈ నానీలు వ్రాసిన జి.సనరా గారు అభినందనీయులు.

*G.Satyanarayana*

*No.6 Maneesha Apartments*

*New Meerjalaguda, Malkajgiri*

*Secunderabad – 500 047*

*Phone: 2706 2477*



# పుస్తక పరిచయం




**విశ్వకవి రవీంద్రుని స్ట్రేబర్డ్స్ కు తెలుగు అనువాదం - బొల్లోజు బాబా**

Click here to read the book.

విశ్వకవి రవీంద్రుని పేరు వినగానే 'గీతాంజలి' కవితాత్మ మనసంతా కమ్ముకుంటుంది. విశ్వకవి కలంనుంచీ వెలువడిన మినీ కవితల సంపుటి Stray Birds- ('మినీ కవిత' అనే పదాన్నిసమకాలీన సాహిత్య ధోరణుల దృష్ట్యానే అన్వయించుకోవాలి). ఇందులో అన్నీ ఒటి రెండు వాక్యాల కవితలే. ప్రకృతీ,స్నేహం, ఆశావాదం, మనిషి తనం, మనసులో మెదిలే వివిధ భావాలూ.. ఎన్నింటినో స్పృశిస్తాయి ఈ కవితలు. కవితా పంక్తులు చిన్నవే ఐనా ఒక్కో వాక్యంలోని అర్థం, గుండె లోతుల్ని సూటిగా తాకే భావం మనల్ని పదే పదే వెంటాడుతాయి. బెంగాలీలో వ్రాసిన తన కవితలని రవీంద్రనాథ్ ఠాగోర్ గారే స్వయంగా ఆంగ్లంలోకి అనువాదం చేసారు. ఆంగ్ల వాక్యాల పరిమళాలని ఆస్వాదిస్తుంటే మాతృకలోని మాధుర్యం ఏమాత్రం తీసిపోలేదు అనిపిస్తుంది. ఈ అద్భుతమైన కవితల్ని అంత సుందరంగానూ తెలుగులోకి అనువదించారు బొల్లోజు బాబా గారు. కవిత్వాన్ని అనువదించడం అంటే చాలా పెద్ద సాహసమే. వచనాన్ని అనువదించడంలో చాలా సౌలభ్యం ఉంటుంది. వివరణకోసం ఒకటి రెండు వాక్యాలు ఎక్కువ వ్రాసినా ఫరవాలేదు. కానీ కవిత్వంలో అలా కాదు. మూలంలోని అర్థం ఏమాత్రం మారకుండా పదాల పొందిక సాగడమే కాక కవిత నడక కూడా చెదరకూడదు. ఈ విషయంలో బొల్లోజు బాబా గారు నూటికి నూరు శాతం విజయం సాధించారని చెప్పవచ్చు. ఇటీవల కాలంలో సొంత గొంతుకతో చక్కటి చిక్కటి కవిత్వం వ్రాస్తున్న బాబా గారు, అంత గాఢమైన కవిత్వాన్నీ ఈ అనువాద కవితా చరణాల్లో పొదిగారు. మచ్చుకి కొన్ని - నా హృదయ శిశిర దినాలపై / నీ సూర్యోదయం నవ్వులు చిందిస్తోంది./ నా వసంతాగమనం పట్ల రవంత / అనుమానం లేకుండా! - సూర్యుని కోల్పోయినందుకు కన్నీరు రాల్చుకుంటే / నక్షత్రాలను కూడా చేజార్చుకోవలసి వస్తుంది. 300 పైగా సాగిన ఈ కవితలు కేవలం చదువుకుని మరిచిపోలేము. వెంటనే ఎవరికైనా చదివి వినిపించాలనిపిస్తుంది. 31 పేజీల ఈ పుస్తకాన్ని అందరికీ అందుబాటులో ఉండే ఇ-పుస్తకంలా scribd.com లో ఉచితంగా ఉంచారు. కేవలం కవిత్వాన్ని ప్రేమించేవారు మాత్రమే కాక మంచి భావాలని అందమైన తెలుగులో చూడాలనుకున్న వారందరూ చదివాల్సిన పుస్తకం.




తెలుగులో యాత్రా రచనలు చాలా తక్కువ. ఉన్న కొద్ది యాత్రా రచనలు కూడా రచయితలు వివిధ ప్రదేశాలకి , దేశాలకి వెళ్ళినప్పుడు వ్రాసినవే. ఈ పుస్తకం వాటన్నింటికంటే భిన్నమైంది. తెలుగులో మొట్టమొదటి పాదాయాత్రా రచన. దీన్ని రాసింది ఆంధ్ర విశ్వవిద్యాలయం, లలితకళల విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్ గా పనిచేస్తున్న 'ప్రయాణాల పక్షి' డా.ఎం. ఆదినారాయణ గారు. ఆయన 1993-94 సంవత్సరాలలో జరిపిన మూడు సుదీర్ఘ పాదయాత్రల సమగ్ర చిత్రణే ఈ పుస్తకం. ఈ పుస్తకం చదువుతుంటే రచయితతో పాటే మనమూ ఆ ప్రదేశాలన్నీ చూస్తున్నట్లనిపిస్తుంది. ప్రతి చోటా సవివరంగా మార్గ సూచికల్ని కూడా మ్యాపు రేఖా చిత్రాలుగా ఇవ్వడం వల్లన రచయిత వివరించే ప్రదేశాలు కళ్ళకు కట్టినట్లుంటాయి. ఈయన విశాఖపట్నంనుంచీ డార్జిలింగ్ వరకూ చేసిన మొదటి యాత్ర, గుండ్లకమ్మ నదీ పరివాహక ప్రాంతంలో చేసిన రెండో యాత్ర, న్యూఢిల్లీ వరకూ చేసిన మూడో పాదయాత్ర ఇందులో వివరించారు. ఈ పుస్తకం 1999 లో మొదటి ప్రచురణ జరిగింది. ఆరేళ్ళలో మూడు సార్లు పునర్ముద్రించబడింది. 2000 సంవత్సరంలో ఇందులో కొంత భాగాన్ని 10 వతరగతి తెలుగు వాచకంలో పాఠ్యాంశంగా పెట్టారు. ఆకాశవాణి నుంచీ ఇందులోని భాగాల్ని శ్రవణ రూపంలో ప్రసారం చేసారు. ఈ పుస్తకానికి 'యుగళ్ళ సాహితీ పురస్కారం' కూడా వచ్చింది. వెనుక అట్టమీద వ్రాసిన కింది వాక్యాలు ఈ పుస్తక పరిచయానికి సమగ్రరూపం "రాహుల్జీని మనస్సు గురువుగా ఆరాధించి చేసిన తపస్సే ఆదినారాయణ కొనసాగించిన పాదయాత్రల ప్రభంజనం. ఒక సంవత్సరంలో చేసిన మూడు యాత్రల్లోని 4000 కిలోమీటర్ల కాలి నడక అనుభవాల పూల మొగ్గలు ఈ 'భ్రమణకాంక్ష'లో పుష్పించాయి. ఒక పేజీ తిప్పగానే మనమూ ఆ ప్రదేశాన్ని స్వయంగా చూసిన అనుభూతిని పొందుతాం.

***Dr,M. Adinarayana***
***Associate Professor***
***Dept. of Fine Arts, Andhra University***
***Visakhapatnam***
***scholorgypsy@rediffmail.com***



# పుస్తక పరిచయం




మాస పత్రికగా మొదలై, వార పత్రికని జతచేసుకుని తెలుగు పత్రికా ప్రపంచంలో ఒక ప్రభంజనాన్ని సృష్టించడమే కాక, ఆ ప్రభంజనాన్ని పాతికేళ్ళ పైగా కొనసాగిస్తున్న 'స్వాతి' పత్రిక గురించి తెలుగు వారికి వేరుగా పరిచయం చెయ్యాల్సిన అవసరం లేదు. దీని ఎడిటర్ వేమూరి బలరాం గారు కూడా స్వాతి బలరాంగా అందరికీ పరిచయమే. ప్రతి పత్రికకీ సంపాదకీయం అనేది మకుటాయమానమైంది. అలనాటి నార్ల వెంకటేశ్వరరావు గారివద్ద నుంచి ఈ నాటి వార్తా పత్రిక సంపాదకుల వరకూ ఈ సంపాదకీయాల్లో రకరకాల ఒరవడులు సృష్టించారు. స్వాతి వారపత్రిక సంపాదకీయాలు తమవైన శైలిలో సాగి, 'స్వాతి చినుకులు' గా అనేక మంది హృదయాల్లో మంచి మాటల నేస్తాలుగా నిలిచిపోయాయి. పత్రిక నిర్వహణా శైలిని బట్టి, అందులోని అంశాలను బట్టి చాలా పత్రికల సంపాదకీయాలు ఎక్కువగా రాజకీయాల మీదా, లేదా వర్తమాన సామాజిక పరిస్థితుల మీద ఉంటాయి. ఈ స్వాతి చినుకులు మాత్రం అందరికీ , అన్ని కాలాల్లోనూ అన్వయించే మంచి మాటల ముత్యాలుగా రూపుదిద్దుకున్నాయి. మూడు నాలుగు పేరాల్లో, సులభమైన శైలిలో నప్పి, ఒప్పించే రీతిలో సాగే ఈ మాటల ముత్యాల చినుకులు ఎప్పుడు చదివినా తాజాగా అనిపిస్తాయి. మన ఆలోచనలని విశ్లేషించుకుని, మెరుగులు దిద్దుకోడానికీ, వ్యకిత్వ వికాసానికీ ఉపయోగపడతాయి. పది మందితో పంచుకోడానికి అనువుగా ఉంటాయి. మనసూ, ఆలోచనలూ, వ్యక్తిత్వమూ, కుటుంబ జీవన విధానాలూ, జీవితపు విలువలూ.. బలరాం గారు స్పృశించని సున్నితమైన అంశం ఏమీ లేదు. ఒక్కో స్వాతి చినుకుకీ చక్కటి మకుటం కూడ ఇచ్చారు..'దోషం మనలో లేదా', 'వినే వారికే సలహాలు', 'నీళ్ళిస్తే పాలివ్వాలి','సువాసన అబ్బిన సొమ్ము'..ఇలా. దీనిలో 300 పైగా పేజీల్లో 300 పైగా స్వాతి చినుకులున్నాయి. అతి కొద్ది కాలంలోనే మూడవ ముద్రణ కొచ్చిన ఈ పుస్తకాన్ని అందరూ చదివాలి, చదివించాలి, మళ్ళీ మళ్ళీ చదువుకోడానికి దాచుకోవాలి. మచ్చుకి ఒక చిన్న పేరా: "మనిషి నమ్మకానికి ప్రతిరూపం కావాలి. మనకి ఏ పని చెప్పినా సవ్యంగా చెయ్యాలి. ఏ మాట ఎవరు చెప్పుకున్నా భద్రంగా దాచాలి. నమ్మి చెడినవాడు లేడు అన్న చరిత్రని మనం మిగుల్చుకోవాలి".

**Rushi Book House**
**14-11-14/1 Atchutaramaiah Street**
**Hanumanpet**
**VIJAYAWADA 520 003**
**Phone: 0866-257 9190**




చాలాకాలం రెవెన్యూ శాఖలో పనిచేసి డిప్యూటీ కలెక్టరుగా పదవీ విరమణ చేసిన అత్తలూరి నాగభూషణం గారు తమ 75 వయేట వ్రాసిన పద్యగ్రంథం ఇది. సంస్కృత స్తోత్ర రచన ఐన 'స్రీ లలితా సహస్ర నామావళి' కి తెలుగు అనువాదం. కేవలం అనువాదం అనేకంటే తెలుగు పద్య గ్రంథం అని చెప్పుకోవాలి. లలితాదేవికి గల సహస్రనామాలూ, వాటి వివరణలతో కూడిన సంస్కృత శ్లోకాలకి అందరికీ సులభంగా అర్థమయ్యే రీతిలో తెలుగు పద్యాల రూపంలో అందించారు రచయిత. స్తోత్ర రచనలు పదే పదే చదువుతారు కాబట్టి గుర్తుపెట్టుకోడానికి అనువైన భాషలో ఉంటూ, అర్థం కూడా తేలికగా తెలిసేలా ఉంటే పద్యాలకి సరైన పరమార్థం ఉంటుంది. ఈ విషయంలో నాగభూషణం గారి కృషి నూటికి నూరు శాతం సఫలీకృతమైందని చెప్పవచ్చు. ఒక్కో శ్లోకానికి కేవలం ఒక్క పద్యమే కాకుండ సందర్భాన్ని బట్టి కొన్ని చోట్ల పలు పద్యాలను కూడ పొందుపరిచారు. లలితా సహస్రనామావళికి తెలుగులో ఎన్నో వ్యాఖ్యాన గ్రంథాలు వచనరూపంలో వెలువడ్డాయి కానీ ఇంత చక్కటి వివరణతో వచ్చిన పద్యకావ్యం ఇదేకావొచ్చు. స్తోత్రానికి, పద్యానికీ వచనంలో కూడ అవసరమైనంతమేర చక్కటి వివరణ ఇచ్చారు. అదువల్ల పారాయణంచేయడానికి, గానం చేసుకోడానికీ, అర్థం తెలుసుకోడానికి కూడా అనువుగ ఉంది ఈ గ్రంథం.

చివరలో లలితా సహస్ర నామ పారాయణ ఫలాన్ని ఇలా పద్యరూపంలో తెలియ చేస్తారు రచయిత

మంత్ర రాజ జపప్రాప్తి, మహిత చక్ర
రాజ పూజా సుకృతి, సహస్రపద పాఠ
పఠన భాగ్యంబులు మహాతపః ఫలాలు
లభ్యమగునే సామాన్య సర్వ స్థితులకు?

సహస్రనామాలకి వివరణనిచ్చే వెయ్యికిపైగా పద్యాలు రెండు సంపుటాలుగా అందమైన ముద్రణతో ప్రచురించారు. బహుళ ప్రయోజనాత్మకమైన ఈ గ్రంథం భక్తి శ్రద్ధలతో దేవిని పూజించే వారందరికీ ప్రీతి పాత్రమౌతుంది.

***Dr.M. Adinarayana***
***Associate Professor***
***Dept. of Fine Arts, Andhra University***
***Visakhapatnam***
***scholorgypsy@rediffmail.com***

# పుస్తక పరిచయం




అమెరికాలో స్థిరపడిన ప్రవాసాంధ్ర రచయిత్రులలో ఉమ గారి కవిత్వానిది విభిన్నమైన శైలి.. సొంత గొంతుక. ఆర్ద్రపూరితమైన భావాలు, సున్నితమైన ఊహలు, చివురుటాకుల స్పర్శలా మనసుని తాకే పద సౌందర్యం.. ఉమగారి కవిత్వం ప్రత్యేకత. ఇవి కేవలం వచన కవితలు కాదు. లయాత్మకంగా సాగే గేయ కవితలు. అన్ని గేయాల్లోనూ ఆర్ద్రత స్పష్టంగా కనిపిస్తుంది. చదువుతున్నంతసేపూ ఒక భావ ప్రపంచంలో విహరిస్తాం. ఒక్కో పదం ఒక్కో అందాన్ని కళ్ళముందు ఆవిష్కరిస్తుంది. మృదు సమీరాలు, రాగరంజిత గగనాలు, సంధ్య వెలుగులు, మందారమొగ్గలు, శతదళ కుసుమాలు.. ఒక కొత్త ప్రపంచానికి ద్వారాలు తెరుస్తాయి.

మచ్చుకి కొన్ని చరణాలు..

"మిన్నులన్నీ వెన్నెలాయెను
వన్నెలన్నీ కన్నెలాయెను
పున్నమేమొ పున్నెమాయెను
వెన్నుడేమో కానడాయెను.."

"..

"నెలతల కనులవి తామర రేకులు
ఉవిదల వదనము పద్మము బోలును
కవితకు నెలవగు మనికియె నాదని
జగతికి తెలియగ విరిసిన కమలను.."

ప్రత్యేక సందర్భాలలో వ్రాసిన కొన్ని గేయకవితలు, పూర్తి పాటల రూపంలో సాగిన సంకీర్తనలు కూడా ఈ సంపుటిలో చోటు చేసుకున్నాయి. అందమైన ముఖచిత్రం, చక్కటి ముద్రణ ఈ పుస్తకంలోని భావ సౌందర్యానికి పరిమళం అద్దినట్లున్నాయి.

***

**Dr.Uma Eyyunni**
**P.O.BOX 860007**
**St.Augustine**
**FLORIDA 320 86**
**USA**
**eyyunni@yahoo.com**



డాక్టర్ ఉమగారు వెలువరించిన మరో గేయ కవితా సంపుటి 'గాలి పల్లకి'. సంపుటి పేరే ఎంతో భావస్ఫోరకంగా ఉంది. ఇందులోని గేయ కవితలు కూడ అంతే మధురంగా సాగాయి. అన్నింటిలోనూ అంతర్గతంగా తొంగిచూసే ఆధ్యాత్మికత ఈ గేయాల ప్రత్యేకత. నిత్యజీవిత సత్యాలని అందమైన పదాల పొందికగా మన ముందు ఉంచుతున్నారు రచయిత్రి.

"నిన్ననేమో మోడులమ్మ
నేడు పూవుల బోడులమ్మ
కు తొడిగిన రెమ్మరెమ్మ
వేకువిచ్చిన వరములమ్మ.."

చరమాంకం అనే గేయంలో ఇలా అంటారు..

"సాగిపోయెడు జీవన యానము
తోడువచ్చిన చెలుని స్నేహము
ఒడిదుడుకుల రహదారిలో
బడలిన మానస యానము.."

మొత్తం సంపుటిలోని గేయాలన్నింటికీ ప్రతినిధిలా బాపు గారు చిత్రీకరించిన ముఖ చిత్రం ఈ పుస్తకానికి ప్రత్యేక ఆకర్షణ

***

***Dr.Uma Eyyunni***
***P.O.BOX 860007***
***St.Augustine***
***FLORIDA 320 86***
***USA***
***eyyunni@yahoo.com***

# పుస్తక పరిచయం




**తెలుగు** చలనచిత్ర రంగంలో చిరస్థాయిగా నిలిచిపోయే పేరు 'సావిత్రి'..మామూలు 'సావిత్రి' కాదు 'మహానటి' సావిత్రి. ఆమె జీవితం కాల్పనిక నవలకన్నా ఎక్కువమలుపులతో సాగింది. ఎక్కడో గుంటూరు జిల్లాలోని మారుమూల పల్లెటూళ్ళో పుట్టి , చిన్నతనంలోనే తండ్రిని కోల్పోయి బెజవాడ పెదనాన్న ఇంట చేరి..అలా మద్రాసు చేరి నింగికెగిసిన తార నేల కొరుగుతుందని ఎవరూ కలలోనైనా ఊహించలేదు. కార్లు, బంగళాలు మందీ మార్బలంతో ఊహించని వైభవాల వెలుగులో సాగిన జీవితం గవర్నమెంటు హాస్పిటల్లో కటికనేలమీద పడుకునే దుస్థితి రావడం..పగవారికి సైతం వద్దనుకునే అధోగతి! 596 రోజులు కోమాలో ఉండి 1981లో కన్నుమూసిన మహానటి సావిత్రిని అత్యంత గాఢంగా అభిమానించిన 'పల్లవి' గారు రాసిన ఈ పుస్తకం ఒన నవలా రూపంలో సాగింది. ఎవరో మూడో వ్యక్తి కథ చెప్పినట్లు కాకుండా వీలైనన్ని చోట్ల పాత్రలు, సంభాషణల ప్రక్రియలో సాగిన ఈ పుస్తకం ఏకబిగిన చదివిస్తుంది. సావిత్రి జీవితంలోని ఎన్నో మలుపుల్ని చాలా బాలెన్స్‌డ్‌గా వ్రాసారు రచయిత్రి. మంచి వ్రాయడానికి పెద్ద నేర్పు అవసరంలేదు కానీ జీవితంలో హాని చేసిన వాళ్ళ గురించీ, మోసం చేసిన వాళ్ళ  గురించీ వ్రాయాలంటే ఎంతో సంయమనం ఉండాలి. సావిత్రి జీవితంలో అలాంటి పాత్రలే ఎక్కువ. ఇలాంటి సన్నివేశాలని ఎంతో నేర్పు ఉన్న రచయిత్రిలా వ్రాసిన 'పల్లవి' గారిని అభినందించి తీరాలి. ఇది వీరి తొలి రచన అంటే నమ్మ బుద్ధి  కాదు. ఎంతమందిని సంప్రదించి ఎన్ని వ్యయప్రయాసలకోర్చారో కానీ సావిత్రి అధిరోహించిన నటశిఖరమంత సమగ్రంగా ఈ పుస్తకాన్ని తీర్చిదిద్దారు రచయిత్రి. అరుదైన చిత్రాలూ, ఇంకా అరుదైనా పత్రికాంశాలూ సమకూర్చి పుస్తకానికి పరిపూర్ణత చేకూర్చారు. కొన్ని చోట్ల కాల్పనిక సంఘటనలు (ఉదా. సూసన్ హేవర్డ్ రాసిన్ ఉత్తరం) ఉన్నట్లు గుమ్మడిగారి ముందుమాట ద్వారా తెలిసింది. అలాంటివి ఎక్కువ ఉండిఉంటే వాటి గురించి ఎక్కడైనా పేర్కొని ఉంటే బావుండేది. ఇది పెద్దలోపమేం కాదు కానీ దీని లేమిలో పుస్తకంలోని సంఘటనలన్నీ 100 శాతం యదార్థాలే అనుకోవాలి.

తప్పక చదవ దగిన విలువైన రచన ఈ పుస్తకం.

***

*Pallavi*
*H-96, Madhuranagar*
*Hydearbad – 500 038*
*pallavirg@rediffmail.com*




చక్కటి, చిక్కటి కథల సంపుటి ఈ 'గోరంతదీపం'. ప్రతి నాలుగు పేజీలు కథలుగా చెలమణి అవుతున్న ఈ రోజుల్లో దాదాపు మూడు, నాలుగు దశాబ్దాల క్రిందట ప్రచురితమైన ఈ కథలు 'అసలైన' కథలకి నిర్వచనంగా నిలుస్తాయి. ఈ సంపుటిలో అధికశాతం మధ్యతరగతి జీవితాలనీ, వ్యక్తులనీ, వ్యక్తిత్వాలనీ ప్రతిబింబించేవే. కథ ఎత్తుగడ ఎంత ఆసక్తిదాయకంగా వుంటుందో ముగింపు అంత ఆశ్చర్యకరంగానూ ఉంటుంది. ఇది చూడండి 'వెంకట రత్నం పట్ల నాకు సానుభూతి లేదు. వెంకటరత్నం పట్ల సానుభూతి చూపించే వారిపట్ల నాకు అసహ్యం మాత్రమే ఉంది' ఈ వాక్యం చదివిన పాఠకుడు ముందుకి సాగకుండా ఉండడం అసాధ్యం..! గుండెల్ని పిండేసే కరుణరసం (తండ్రి చుట్టలకోసం తన ప్రచురణకాని రచనలని చిత్తుకాగితాలుగా అమ్మెయ్యడం..), భుజం పట్టి నిలదీసి ప్రశ్నించే పాత్రలూ ఈ సంపుటి నిండా ఉన్నాయి. శైలీ, శిల్పం, కథా, కథనం..ఏ తూనిక రాయైనా తీసుకోండి..ఈ కథలు ప్రథమ స్థాయిలో నిలుస్తాయి. ఏ కథలోనైనా ఒక్క వాక్యం దాటేసినా కథలో ఎంతో కోల్పోతారు. ఇంతటి నేర్పు చాలా తక్కువమంది రచయితలకి ఉంటుంది. రచయిత శ్రీ రామారావు 'విశాఖ సాహితి' వ్యవస్థాపక కార్యదర్శి, వృత్తి రీత్యా కూడా అనేక పురస్కారాలు పొందారు. కథలన్నీ చదివాక మిగిలేది ఒకటే ప్రశ్న ' ఇంత మంచి కథలు వ్రాసిన రచయిత ఇంతకాలం మనకెందుకు కనిపించలేదు!?" అని. కథలని ప్రేమించే వాళ్ళు..'మంచి కథలు' మాత్రమే చదవాలనుకునే వాళ్ళు తప్పక చదవాల్సిన పుస్తకం ఇది. 'చదవండి..చదివించండి..' అన్న నినాదం ఈ పుస్తకానికి అతికినట్లు సరిపోతుంది.

***

***Mallapragada Rama Rao***
***A-9,Sayi Vihar Residency***
***Sus Road, Pashan***
***Pune – 411 021***
***020-2587 0083***



# పుస్తక పరిచయం




ఒక స్థాయిగల మంచి కవితలు వ్రాసే అమెరికాలోని ప్రవాసాంధ్ర కవుల్లో మొదటి వరుసలో నిలుస్తారు డాక్టర్.వైదేహీ శశిధర్ గారు. వీరు ఇటీవల ప్రచురించిన స్వీయ కవితాసంపుటి 'నిద్రిత నగరం' లో చిక్కని కవితాత్మ పొదిగిన 32 కవితలు ఉన్నాయి. వరుసగా కవితలు చదువుతున్నప్పుడు ఎదురయ్యే పద సౌందర్యం, భావప్రకటన, దృశ్యాలని కళ్ళముందు నిలబెట్టే చిత్రీకరణ.. గమనిస్తే తిలక్ కనిపిస్తారు చాలా చోట్ల. ఈ కవితల పూదోటలో వాహ్యాళికి వెళితే అమృతం కురిసిన రాత్రులు పలకరిస్తాయి. చెదిరిన పుప్పొడి రేణువులు, స్వప్నాల రెక్కలు విప్పే సీతాకోకచిలుకలు, ఉన్మత్త పువ్వులా నవ్వే ఉదయాలు, కోనేటి మీదికి వంగిన నిద్రగన్నేరు, రాలుతున్న మంచులోని రాధామాధవాలు.. అన్నీ, ఇంకెన్నో ఆత్మీయంగా మనసు మూలల్ని స్పృశిస్తాయి. కొంతమంది తాము పలవరించే భావాలని కవిత్వీకరించడంకోసం దృశ్యాలని ఉపమానాలుగా వాడుకుంటారు. కానీ ఈ కవయిత్రి ఎక్కువగా తాను చూసిన దృశ్యాలని మృదు మధుర భావాల రూపంలోకి తర్జుమా చేసుకుని కవితా పంక్తులలో అలంకరిస్తారు.

'ఓ సాయంత్రం', ''ఏటి వొడ్డున',' ప్రవాసంలో వాన',' నేరేడు చెట్టు',' 'అమెరికాలో వసంతం',' 'వేసవిలో ఓ రోజు..' ఇలాంటి సుందరదృశ్యాలెన్నో ఈ కవయిత్రి కలాన్ని కదిలించి మన మనసులకి హత్తుకుపోయే కవితలుగా రూపుదిద్దుకున్నాయి.

*'నిద్రించిన నా స్వప్నాలన్నింటినీ*
*పున్నాగ పూల గుత్తులుగా మేల్కొలిపి*
*ఓ గాఢమైన పరిమళ ప్రవాహంలో*
*నన్ను ముంచి వేస్తావు..'*

*'ఆదమరచి నిద్రించిన హిమ సుందరి ధవళ చేలాంచలం*
*విశమించిన వేయి పడగల శ్వేతనాగై తోటను కప్పేసింది..'*

కవిత్వాన్ని చదివి, అనుభూతుల్లోకి అనువాదం చేసుకుని, మళ్ళీ మళ్ళీ నెమరు వేసుకోవాలనుకునే వారందరూ తప్పక చదవాల్సిన కవితా సంపుటి. . ***

**For copies write to KOUMUDI**




**కవిగా** ఈ పుస్తకంలో దర్శనమిచ్చే రామిరెడ్డి గారు..నిజానికి విరామమెరుగక పరిశ్రమించే సామాజిక సేవా యోధుడు. సమాజసేవని విశ్వసించి, ఆచరించి ఎందరికో ఉదాహరణగా నిలిచే 'మనిషి'. కవి బాధ్యత కేవలం కవిత్వాన్ని వ్రాయడంతో ఆగిపోక తాము చెప్పేవాటిని ఆచరించే ధైర్యం, అంకితభావం ఉండాలని 'అనరు..చెప్పరు..' కానీ చేతల్లో నిరూపిస్తారు. ఈ సంపుటిలోని ప్రతి కవితలోనూ మానవత్వం, మనిషితనం విశ్వరూపంలో దర్శనమిస్తాయి. తన ముందు మాటలో చెప్పినట్లే రామిరెడ్డి గారి ఊహల్లోంచి కవిత్వం రాదు..వాస్తవాలు మనసుని కదిలించినప్పుడు, ఆ స్పందనలు నిజాయితీ గల కవితలుగా రూపుదిద్దుకుంటాయి. 'పత్తి తియ్యటం గురించి', 'వరద తర్వాత మిగిలిన శిధిల జీవితాల' గురించి వ్రాయాలంటే ఎంతో పరిశీలానసక్తే కాక నిబద్ధత, అంకిత భావం ఉండాలి. 'పుట్టెడు ప్రేమ, గుప్పెడు దుఃఖం అదే మనిషి జాడ'

*''గాయం కూడా ప్రాణ ధాతువే..'*

*'సహజ ప్రవాహాలను లోనికి పిండుకుని*
*రక్తాన్ని శుద్ధి చేసుకోవాల్సి ఉంది..'*

*'ఒకే విశ్వం మనిషి సొంతం*
*ఒకే స్వప్నం మనిషికిష్టం..'*

చాలా కవితల్లో తాను చెప్పదలుచుకున్న సందేశాన్ని సంక్షిప్తీకరించి చివరలో రెండు మూడు పంక్తుల్లో చెబుతారు. అవి చదివాక మళ్ళీ ఒకసారి కవిత చదివి ముగింపుని కవి ఎలా అన్వయించాడో పునశ్చరణ చేసుకోవలనిపిస్తుంది. కవిగా రామిరెడ్డి గారి నిజాయితీ గల కవిత్వం ఒక ఎత్తు ఐతే, పేద విద్యార్థులకి ఆయన అందిస్తున్న సహాయం ఇంకొక ఎత్తు. తాను చదువుకోడానికి చిన్నప్పుడు పడ్డ కష్టాలని మరిచిపోకుండా అలాంటి కష్టపడే విద్యార్థినీ విద్యార్థులకి తన జీతాన్నీ, జీవితాన్నీ వెచ్చిస్తున్న రామిరెడ్డి గారు 'మానవత్వం' ఆచరించి నిరూపించే మనసున్న కవి.

ఈ పుస్తకం అమ్మకాల ద్వారా వచ్చే మొత్తాన్ని పేద విద్యార్థుల సహాయం కోసం ఖర్చుపెడుతున్నారు. అందుకే ఈ పుస్తకాన్ని కొని చదవండి..'నిజాయితీ' గల కవిత్వాన్ని ఆస్వాదించండి..నిస్వార్థమైన విద్యార్థి సేవా కార్యక్రమాలకి మీ వంతు చేయూతనివ్వండి.

***

***For Copies***
***M.Rajualakshmi***
***102, Sri Kota Residency***
***Near Polce Station***
***Miyapur, HYDERABAD 500 049***

# పుస్తక పరిచయం




**Published by:**

**Navodaya Publishers**
**Karl Marx Road**
**VIJAYAWADA – 520 002**

**అమెరికాలోని** ప్రవాసాంధ్ర రచయితల్లో సొంతగొంతు, సొంత ముద్ర గల రచయితల్లో ఒకరు డొక్కా శ్రీనివాస ఫణికుమార్. రచన చదివి, రచయిత పేరు చెప్పించుకోగల స్థాయి ఉన్న రచయిత. ఆయన రచనల సంకలనం ఈ `పల్లకి`. ఈ `పల్లకి`లో ఎక్కితే కోన సీమల వీధుల వెంట విహరిస్తాం. కొన్ని సార్లు `డొక్కా` వారి కుటుంబ సభ్యులు మనల్ని పలకరిస్తారు. ఉన్నట్టుండి అదే `పల్లకి`లో అమెరికా కూడా వచ్చేస్తాం. కడుపుబ్బా నవ్విస్తారు ప్రతి చోట, మనసు మెలితిప్పే సున్నితమైన సంఘటనలతో గుండె తడి చేస్తారు కొన్ని చోట్ల.

తమ రచనల్ని మూడు విభాగాలుగా పేర్చి అందించారు. మొదటి విభాగంలో చిన్ననాటి జ్ఞాపకాలని నవ్వుల పువ్వుల మధ్య పొదిగి మన ముందు ఉంచుతారు. నవ్విస్తూనే స్క్రీన్ ప్లే విధానంలో ఈ గల్పికలు వ్రాయడం..ఒక్క ఫణి గారికే సాధ్యమా అనిపిస్తుంది. ఇవి తన బాల్యానికి సంబంధించిన జ్ఞాపకాలే ఐనా, గతస్మృతుల్ని అనుభూతించగల ప్రతి వారికీ తమ బాల్యాన్ని గుర్తు తెస్తాయి. చిన్నప్పుడు బలపాన్ని ఆత్మీయంగా చూసుకుంటూ దాచుకున్న రోజులు, పరీక్షల్లో మార్కులకోసం పట్టిన కుస్తీలు, మార్కులు తక్కువైనప్పుడు ఇంట్లో `రేవు`లో ఉతికించుకున్న సంఘటనలూ, మొదటిసారి కదిలే రైల్లో మనమూ పరిగెత్తే విచిత్రం... గుర్తు చేసుకోకుండా మీరు బతికెయ్యగలుగుతున్నారంటే ఒక్కసారి ఈ పుస్తకంలోని `బుడుగుడు కుంచం` గల్పికలు చదవండి. చీకటి దుప్పట్లో దాక్కున్న మీ జ్ఞాపకాలని మనసు ముంగిట్లో గంతు లేయిస్తారు రచయిత.

కడుపుబ్బ నవ్వించే హాస్యం ఈయన రచనా జన్మహక్కు. ఐతే, మానవీయ సంబంధాలలోని సున్నితమైన కోణాలని స్పృశించి, కళ్ళు చెమ్మగిల్లచేసే నేర్పు ఈయన చిరునామా. `అమ్మ ఎంత పిచ్చిది! ఈ లోకమంతా అలాంటి పిచ్చి వాళ్ళతో నిండిపోతే ఎంత బాగుండును!?' "తాతగారిని చూస్తుంటే పూజలేని దేవుళ్ళని చూస్తున్నట్టనిపించేది.." , "జీవితం కథ ఐతే ఎంత బావుంటుందో కదూ కన్నా" అడిగాడు అతను, ఆమె తలనిమురుతూ..!! -ఇంతకంటే చెప్పాలా?

ఈ పుస్తకాన్ని తప్పక చదవండి మొదటినించీ చివరిదాకా. చదివి దాచుకోండి. దాచుకుని చదవండి. మీ జీవితంలో నవ్వులు జారిపోతున్నట్లనిపించినప్పుడు, సున్నితత్వం బండబారి పోతోందనిపించినప్పుడు ఈ `పల్లకి` లో ఎక్కండి. మళ్ళీ మనకి మనం దొరుకుతాం.

***




**17వ** **తానా** మహాసభల జ్ఞాపికగా ప్రచురించబడిన 'తెలుగు పలుకు' దాదాపు 300 పేజీల 'కలెక్టర్స్ ఎడిషన్'లా విడుదలైంది. గత నెలలో జరిగిన తానా మహాసభలకి హాజరైన వారందరికీ ఈ పుస్తకం ఉచితంగా ఇచ్చారు. ఐదు సంవత్సరాల పాటు ప్రతిష్ఠాత్మకంగా అమెరికా ఆంధ్రుల కోసం ప్రత్యేకంగా వెలువడిన 'తెలుగునాడి'కి సంపాదకత్వ బాధ్యతలు నిర్వహించిన చౌదరి జంపాల గారు, ఈ తానా ప్రత్యేక సంచికకి సంపాదకుడిగా వ్యవహరించారు. ఈ తానా సభల ప్రధాన నినాదం 'సాంకేతిక వికాసం- సాంస్కృతిక విన్యాసం'ని ప్రతిబింబించేలా ఈ సంచికని రూపొందించినట్లు చివరి మాటలో సంపాదకులు పేర్కొన్నారు. సంస్థాగత విశేషాలతో ఒక విభాగం, ప్రతిభా శతజయంతి, మారుతున్న ఆంధ్రావని, కళా సౌరభం, మన మాటల్లో అనే నాలుగు విభాగాలుగానూ ప్రచురణాంశాలని వర్గీకరించారు. ఇందులోని చాలా వ్యాసాలు రిఫరెన్స్ వ్యాసాల్లా అమూల్యంగా వున్నాయి. ముఖ్యంగా ప్రతిభా శతజయంతి విభాగంలో శ్రీశ్రీ కొ.కు, గోపీచంద్, సుంకర వగైరా సాహితీ దిగ్గజాల గురించిన వ్యాసాలు ఎంతో అపురూపమైనవి. శ్రీశ్రీగారి గురించి వారి అబ్బాయి, గోపీచంద్‌గారి గురించి వారి అబ్బాయి వ్రాసిన వ్యాసాలు అరుదైనవి. వివిధ రంగాల్లో ఆంధ్రప్రదేశ్‌లో వస్తున్న మార్పుల గురించిన వ్యాసాలు చాలా ఆసక్తికరంగా, విలువైన సమాచారంతో నిండి ఉన్నాయి. అలానే చిత్రకళ గురించి ఒక పాతిక పేజీల విశేషాలు అందించడం అభినందనీయం. ఈ సంచికలోని మరో ప్రత్యేకత - సృజనాత్మక రచనల విభాగంలో అందరూ అమెరికా ప్రవాసాంధ్ర రచయితల రచనలే ప్రచురించడం. సాధారణంగా ఇలాంటి అతి పెద్ద సావనీర్లు తయారు చేసేప్పుడు పేజీలు నింపడానికి ఆంధ్రదేశంలోని రచయితల మీద ఆధార పడడం సర్వ సాధారణం (ఇందులో తప్పేమీ లేదు కూడా) అలా కాకుండా కేవలం అమెరికా తెలుగు రచయితల రచనలతోనే 75 పేజీలని అలంకరించడం సాహసం. ఎంతో శ్రమకోర్చి దీన్ని విజయవంతంగా మనముందుకి తెచ్చిన సంపాదకులు, సంపాదక వర్గ సభ్యులూ, 'తానా' సంస్థ అందరూ అభినందనీయులే.

***

***TANA CONFERENCE SPECIAL ISSUE 2009***



# పుస్తక పరిచయం




మనిషి వ్యక్తిత్వ వికాసం పలువిధాలుగా ఉంటుంది. తన వృత్తిలో, ప్రవృత్తిలో ఉన్నత శిఖరాలను చేరుకోడానికిగాను వ్యక్తిత్వ వికాసాన్ని వినియోగించుకుని సంఘంలో ఉన్నత స్థాయికి చేరేవారు ఒక రకం. తాము అలవరచుకున్న ఉత్తమ గుణాలవల్ల, తమ వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దికోవడంతోబాటు తమ పరిసరాలని అభివృద్ధిచేసే వారు, తమ చుట్టూ వున్న వారి జీవితాలని వెలిగించే వారు ఇంకోరకం. మొదటి రకం వ్యక్తులు శిఖరాల్లా కనిపిస్తారు. రెండో రకం వ్యక్తులు మైలురాళ్ళలా నిలిచిపోయి దారి చూపిస్తారు. ఔన్నత్యానికి జరిగే ప్రయాణంలో ఎంతదూరం వచ్చామో వారి నుంచీ నేర్చుకోవచ్చు. ఇలాంటి వ్యక్తులూ, వారు చేసిన మంచిపనులూ చదివినప్పుడూ, విన్నప్పుడూ మన మనసుల్లో ఒక విధమైన ఆహ్లాద భావన కలగడమే కాక ఆదర్శభావాల తొలకరి చినుకులు వర్షిస్తాయి. వీరు చేసే పనులు క్లిష్టతరమైనవే కకపోవచ్చు, అతి స్వల్ప సంఘటన వల్లకూడా మనచుట్టూ ఒక ఔన్నత్య వాతావరణాన్ని సృష్టించవచ్చు. అలాంటి అనాకానేక సంఘటనల సమాహారమే ఈ పుస్తకం. ఎక్కడెక్కడినుంచో సేకరించి 'అనేకమంది మనుషుల దయతో కూడిన నిస్వార్థ చర్యలని' ఈ పుస్తకంలో చదవొచ్చు. ముందు మాటలో రచయిత ఈ పుస్తకం వెనుకనున్న ఆశయాన్ని సుస్పష్టంగా చెప్పారు "మంచి చూస్తే అలా చేయాలి అనిపిస్తుంది. అది గురువు. చెడుని చూస్తే అలా చేయకూడదనిపిస్తుంది. అదీ గురువే. ఈ పుస్తకంలోని మనుషుల్లోని వివిధ రకాల మంచితనాలు గురువుగా మనకి మంచి బోధనలు చేస్తాయి. చెడుకి దూరంగా, మంచికి దగ్గరగ ఉంటే మనిషి లౌకికంగా ఉన్నతుడు, ఆధ్యాత్మికంగా ప్రగతిని సాధించేవాడు ఔతాడు. అలాంటి ప్రేరణని ఈ పుస్తకం నుంచి మనం పొందగలమని ఆశిస్తాను' అంటారు మల్లాది గారు. ఇదొక గొప్ప ఉదాత్తమైన ప్రయోగం. కేవలం సేకరించిన సంఘటనలేకాక, పుస్తకం చివరలో పెద్ద సాహసాలు, పెట్టుబడులు లేకుండానే 'మనలోని మనవత్వాన్ని పరిమళింపచేసే అనేక మార్గాలు' అంటూ ఎంతో ఆసక్తికరమైన ఆచరణయోగ్యమైన పనుల పట్టికనిచ్చారు. అలానే మనం సహాయం చెయ్యాలనుకుంటే సంప్రదించదగిన ధార్మిక సంస్థల చిరునామాలని కూడా పొందుపరిచారు. ఈ పుస్తకం అందరూ చదవాలి. దాచుకోవాలి. ఎవరికైనా బహుమతిగా కూడా కొని ఇవ్వండి. ఒక మంచి పని మరో మంచిపనికి దారితీసేలా మీవంతు ప్రయత్నం చెయ్యండి. ***

***Published by:***

***Lipi Publications***
***Gandhi Nagar***
***HYDERABAD – 500 080***
***telugubooks@yahoo.com***
***Phone: 2761 2244***

# పుస్తక పరిచయం




**ఈ రోజుల్లో ఐతే** సినిమా నేపథ్య గీతాల గాయనీ గాయకుల పేర్లు గుర్తుపెట్టుకోలేనన్ని ఉన్నాయి. కానీ పది, పదిహేనేళ్ళ క్రిందటి వరకూ నేపథ్య గాయనీ గాయకులు వేళ్ళమీద లెక్కించదగినంతమందే ఉండేవారు. పైగా తెలుగు సినీ రంగంలో అప్పటివరకూ ప్రసిద్ధులు చాలామంది తెలుగువారే కావడం గమనించదగ్గ విశేషం. పరభాషా గాయనీ గాయకులు ఎక్కువైపోయిన ఈ రోజుల్లో ఎవరు ఎవరో, ఎవరు ఎంతకాలం ఉంటారో ఎవరికీ తెలియడంలేదు. అలనాటి తెలుగు చలన చిత్రస్వర్ణ యుగంలోని గాయనీమణుల గురించిన వివరాలతో రూపొందించిన పుస్తకం ఇది. కేవలం నేపథ్యగాయనులకే పరిమితం కాకుండా అలనాటి సినిమాల్లో నటిస్తూ కూడా పాటలు పాడిన ఎస్.వరలక్ష్మి, జి.వరలక్ష్మి, కన్నాంబ లాంటి నటీమణుల గురించిన వివరాలు కూడా ఉన్నాయి. సురభి కమలాబాయి గారి మొదలుకొన్ని ఎస్పీ శైలజ గారి వరకూ దాదాపు 25 మంది తెలుగు సినీ నేపథ్యగాయనీమణుల గురించిన వ్యక్తిగత, సినీ జీవిత వివరాలు ఉన్నా యి ఇందులో. వీలైన చోటల్లా ఆయా గాయనీ మణులు పాడిన పాటల్లో కొన్ని మధురమైన గీతాల్ని వారి గురించిన అధ్యాయాల చివరలో చేర్చారు. ఇదే అంశం మీద వెలువడిన కంపెల్ల రవిచంద్రన్ గారి పుస్తకంతో పోలిస్తే ఈ పుస్తకం చాలా క్లుప్తంగ అనిపిస్తుంది. రచయిత్రి గారు ముందుమాటలో ఆయా గాయనీమణులతో కలిసి చర్చించడానికి పడిన శ్రమ గురించి ప్రస్తావించారు. అలానే వివిధ గాయనీమణుల వ్యక్తిగత జీవితాలలోని చేదు అనుభవాలు వారి కెరీర్‌ని ఎలా ప్రభావితం చేసిందీ పరోక్షంగా ముందుమాటలో చెప్పారు. అలాంటి వాటిని వ్యాసాల్లో చేర్చలేకపోవడానికి గల పరిమితుల్ని కూడా వివరించారు. కొంతమంది గాయనీమణుల గురించి ఐతే కేవలం 1-2 పేజీల కవరేజ్ మాత్రమే ఉంది(జి.వరలక్ష్మి, టంగుటూరి సూర్యకుమారి వగైరా..). బహుశా గ్రంధ విస్తరణ వగైరా పరిమితులింకేమైనా ఉన్నాయేమో కానీ, కొన్ని వ్యాసాలు అసంపూర్తిగా అనిపిస్తాయి. కథనంలోకూడా కట్టె, కొట్టె, తెచ్చె ధోరణి కనిపిస్తుంది. ఏదేమైనా ఆస్మిత సంస్థ చేసిన ఈ ప్రయోగం మాత్రం అభినందనీయం.

***

**_Asmita_**
**_West Maredpally_**
**_Secunderabad_**

# పుస్తక పరిచయం




ఫక్తు వ్యాపారాత్మకంగా మారిపోయిన తెలుగు సినిమా రంగంలో , పదికాలాలు నిలిచిపోయే సినిమాలు కొన్ని దశాబ్దాల క్రిందట మాత్రమే వచ్చాయి..! అందుకే 1950-65 ప్రాంతాలని తెలుగు సినిమాలకి స్వర్ణయుగం అంటారు. ఈ యుగంలో వచ్చిన 8 సినిమాల గురించిన సమగ్రమైన విశ్లేషణ ఈ పుస్తకంలో ఉంది. అవి 'మల్లీశ్వరి','జయభేరి','దొంగరాముడు',' దేవదాసు',' బంగారు పాప', పాతాళభైరవి','మాయా బజార్','విప్రనారాయణ'. ఇంకా విశ్లేషించి , వివరణ ఇవ్వాల్సిన అలనాటి సినిమాలు చాలానే ఉన్నా, గ్రంధ విస్తరణ భీతితో అన్నింటినీ ఇందులో చేర్చే ప్రయత్నం చెయ్యలేదని రచయిత ఒక చోట పేర్కొన్నారు. ఈ వ్యాసాలన్ని ఆంధ్రభూమి దినపత్రికలో సీరియల్‌గా వచ్చాయి. మూడేళ్ళలో (2004-2007) రెండు ముద్రణలకి నోచుకోవడం ఈ పుస్తకంలోని ప్రామాణికతకి ఒక నిదర్శనం. రచయిత డా.రమణా రెడ్డి గారు ఒక్కో వ్యాసాన్ని సంక్షిప్త చిత్ర దర్శినిలా రూపొందించారు. ప్రతి చిత్రాన్నీ అన్ని కోణాల్లోనూ సోదాహరణంగా విశ్లేషించారు. కథని మొదటినుంచీ చివరి వరకూ వివరిస్తూ అవసరమైన చోట్ల సవివరంగా సంభాషణల్నీ, పాటల్నీ కూడా ఉదహరించారు. అలానే ఏ సన్నివేశంలో సినిమా నిర్మాణంలోని ఏ అంశం ( దర్శకత్వం, సంగీతం, రచన వగైరా) పరిశీలించదగ్గదిగా ఉందో అదేచోట ఆయా అంశాలని సవివరంగా క్రోడీకరించడం చాలా నప్పింది. అవసరమైన చోట్ల చిత్ర ఔచిత్యాన్ని దెబ్బ తీసిన అంశాలని ఎండగట్టడానికి కూడా రచయిత వెనకాడ లేదు (ఉదా. దేవదాసు చిత్రంలోని కొన్ని సన్నివేశాలు, సంభాషణలు పాత్రల స్వభావాన్ని ఎలా దిగజార్చాయో తెలియచేసే వివరణ). ఈ కోవలో చాలా పుస్తకాలు వచ్చినా ఇందులో ప్రత్యేకంగా చెప్పుకోదగ్గ అంశం యదాతథంగా ఉదహరించిన కొన్ని సన్నివేశాల సంభాషణలు. వ్యాసాలు చదువుతుంటే ఆ చిత్రాన్ని మరోసారి చూసిన అనుభూతి కలగడమే కాక వివిధ కోణాల్లో రచయిత విశ్లేషణ కూడా తెలుస్తుంది. అలనాటి తెలుగు సినిమా అభిమానులంతా తప్పక చదివి ఆనందించవలసిన పుస్తకం. ***

**Published by:**

**Dr.M.V.Ramana Reddy**
**Rayavaram**
**Proddututu – 516 362**
**telugubooks@yahoo.com**
**Phone: 08564-251133**




గత కొద్ది సంవత్సరాలుగా విరివిగా కథలు వ్రాస్తున్న రచయిత్రి గంటి భానుమతి గారి మూడో కథా సంపుటి ‘జీవనపోరాటం‘. భానుమతి గారు ఇంతకు ముందు ‘ఎంత సుదీర్ఘమీ జీవితం?‘,‘ఇదే ధర్మమా?‘ అనే రెండు కథా సంపుటుల్ని ప్రచురించారు. ఈ ‘జీవనపోరాటం‘ సంపుటంలో 22 కథలున్నాయి. ఇవన్నీ గత రెండు, మూడు సంవత్సరాల్లో వివిధ పత్రికల్లోనూ, ఆకాశవాణిలోనూ వచ్చినవి. కొన్ని బహుమతి పొందిన కథలు కూడా ఉన్నాయి. రచయిత్రి గారు ముందు మాటలో చెప్పారు ‘నా కథలకి థీమ్, స్ఫూర్తి నా చుట్టూ ఉన్న సమాజంలోంచి వచ్చినవే. వార్తా పత్రికలు, వార్తా ఛానెళ్ళలోంచి పుట్టినవే‘ అని. అందుకే ఈ కథల్లోని పాత్రలూ, సంఘటనలూ ఎక్కడో చోట చూసినవో, చదివినవో ఐ ఉంటాయి. రచయిత్రి గారి భాషా, శైలీ సరళంగా సులభంగా ఉండి చదవడం నల్లేరు మీద నడకలా అనిపిస్తుంది. కథాంశాలేవీ గాఢంగా ఆలోంచివాల్సినవేమీ కావు. కథ ముగింపు కూడా ముందుగానే ఊహించవచ్చు. అంటే టెక్నిక్, శిల్పం లాంటి విషయాలగురించి పెద్దగా పట్టించుకోలేదనిపిస్తుంది. కథా గమనం ఫ్లాట్ గా సాగిపోతుంటుంది. అభినందనీయమైన విషయమేమిటంటే ప్రతి కథలోనూ సామాజిక స్పృహ, మానవ సంబంధాలకున్న విలువలు సుస్పష్టంగా కనిపిస్తాయి. ఈ కోణంలో రచయిత్రి నిబద్ధతని మెచ్చుకుని తీరాలి. కోడళ్ళ నోటి దురుసుతనానికి నొచ్చుకున్న అత్తగార్లు, పిల్లల నిర్లక్ష్యానికి గురవుతున్న తల్లిదండ్రులు, జీవితాన్ని సవాల్‌గా తీసుకుని జయించిన వికలాంగులైన బాలలు, పిల్లల పెంపకంలో చిన్నప్పటినుంచే జాగ్రత్త తీసుకోవాలని తెలియచెప్పే సంఘటనలూ ..ఇలాంటివి ఈ కథ సంపుటంలో తారసపడతాయి. ముందు మాటలో పోరంకి దక్షిణా మూర్తి గారి చెప్పినట్లు ‘ముందు, ముందు భానుమతి గారి కథలు కళ్ళను మెరిపించడంతో బాటు గుండెను కదిలించేట్లు, అనుభూతి గాఢతను పెంచేట్లు చేయగలవని ‘ ఆశిద్దాం.

***

**Ganti Bhanumathi**
**I.205 May Glower Park Apartments**
**Mallapur**
**HYDERABAD – 500 076**
**Phone: 2715 1439**



# పుస్తక పరిచయం




**Published by:**

**Dr.Sudha Nittala**
**26-1-27/1 Kambal Pet**
**Rajahmundry – 533 103**
**sudhanittala@yahoo.com**
**Phone(US): 630-894-9350**

**భక్తికోణం** నుంచీ చూస్తే ఏమతమైనా భగవంతునికి అభిమానపాత్రమవడానికి వ్యక్తం చేసే భావాలు, పద్ధతులు ఒకే రకంగా ఉంటాయి. అసలు కీర్తనలు, సంకీర్తనలు, పదాలు, కృతులు..ఇవన్నీ వేర్వేరా, ఒకటేనా..? ఇవి రూపుదిద్దుకున్న పరిణామ క్రమమేమిటి..? అన్న అంశం నుంచీ మొదలుపెట్టి పరిశోధకురాలు సుధా రత్నాంజలి గారు ఈ గ్రంథంలో ఎన్నో ఆసక్తికరమైన విశేషాలని అందించారు. చాలా తేలిగ్గా సులువైన భాషలో సరళమైన పదాలతో ఎంతో అరుదైన సమాచారాన్ని ఒకచోట కూర్చారు. దైవ స్తుతిలో ఉపయోగించే కీర్తనలని సాహిత్య పరంగానూ, సంగీత పరంగానూ సమీక్షించాల్సిన అవసరం ఉంది. శాస్త్రీయ సంగీతంలో కూడా ప్రావీణ్యం సంపాదించిన రచయిత్రి ఈ క్లిష్టమైన విశ్లేషణని అతి సమర్ధవంతంగా పాఠకుల ముందుకి తీసుకొచ్చారు. ఈ సిద్ధాంత వ్యాసానికి మూలకేంద్రం దాదాపు నూటయభై ఏళ్ళ లూథరన్ కీర్తన సాహిత్యమే ఐనా కేవలం అదే అంశానికి పరిమితమై పోకుండా అసలు తెలుగులో ప్రాచీన సంకీర్తనా లక్షణాలెలాంటివి అన్న చారిత్రక వివరణతో మొదలుపెట్టారు. తెలుగు క్రైస్తవ కీర్తనల పుట్టుపూర్వోత్తరాలని కూలంకషంగా చర్చించాక హైందవ సంకీర్తనలతో వాటికి గల సారూప్యాలని వివరించారు. రాగాలు- స్వర కల్పనల విషయంలోకూడా హైందవ కీర్తనలు, క్రైస్తవ కీర్తనలు ఎలాంటి పోలికలని కలిగి ఉన్నాయో సంగీత పరంగా విశ్లేషించి చూపించారు. తెలుగు భక్తకవుల సంకీర్తనల నమూనాగా వచ్చాయి కాబట్టి క్రైస్తవ సంకీర్తనల మీద వాటి ప్రభావం సహజంగా ఉందన్న విషయాన్ని రచయిత్రి గుర్తుచేశారు. ప్రతి అధ్యాయం ఎంతో ఆసక్తికరంగా సాగింది. 1990 లోనే తన డాక్టరేట్ పట్టాకోసం వ్రాసిన ఈ పుస్తకాన్ని చాలా ఆలశ్యంగా ఇటీవలే ప్రచురించారు. సర్వమత సమానత్వమనేది ఎన్నో శతాబ్దాలుగా వస్తున్నదే అన్న విషయాన్ని ఋజువు చేస్తూ క్రైస్తవ కీర్తనలో చాలా భాగం పుట్టుకతో హిందువులైన భక్తులు వ్రాశారన్న విషయం చాలా మందిని ఆశ్చర్యపరుస్తుంది. క్రైస్తవ కీర్తన రచయితల వివరాలుకూడా చాలా మందికి తెలియకపోవచ్చు. ఈ వివరాలన్నింటినీ ఎంతో శ్రమకోర్చి ఒక చోట కూర్చారు రచయిత్రిగారు. మతాలకి అతీతంగా సంగీత, సాహిత్య ప్రియులందరికీ నచ్చే పుస్తకం ఇది. ***




**ఆధునిక రచయిత్రులలో** విభిన్నమైన సొంత గొంతుక గల రచయిత్రి కుప్పిలి పద్మ. వీరు పన్నెండేళ్ళ క్రిందట 'వార్త' పత్రికలో వ్రాసిన వీక్లీ శీర్షికల సంపుటి ఈ 'శీతవేళ రానీయకు'. ఇవన్నీ గుండెనిండా కవిత్వాన్ని నింపుకున్న నిత్యజీవిత సత్యాలు. ఒంటరి తనం, మౌనం, స్నేహం, వీడ్కోలు.. ఒక్కటేమిటి, జీవనగమనంలోని అనేక సున్నితమైన అంశాలని తనదైన కోణంలో చూస్తూ హృదయానికి హత్తుకునే రీతిలో ప్రతి వ్యాసాన్ని తీర్చిదిద్దారు. మానవసంబంధాలని విశ్లేషించిన తీరు అనితరసాధ్యం. చాలా భావాల్లో, శైలిలో చలం తొంగిచూస్తుంటే ఆశ్చర్యపోకండి..అనుభవించి, పలవరించండి. ఎక్కడ ఏ వాక్యాన్ని తీసుకున్నా గుండెలోతుల్లో సూటిగా గుచ్చుకుంటుంది, నిలదీసి ప్రశ్నిస్తుంది, మనం ఊహించని నిలువుటద్దాన్ని మన మనసు ముందుంచి ..'ఇది నువ్వు..ఇది లోకం..' అని చూపిస్తుంది. మచ్చుకు కొన్ని చూడండి.. *'మన బతుకులు పరమ వ్యూహాత్మకంగా మారిపోయాయి. మనకో అర్థవంతమైన జీవితం కావాలంటే అశాంతితో అల్లాడిపోవాలి'. 'మనందరం యీ లోకంలో సగం సగం పలికి వొదిలేసిన మాటల్లాంటి వాళ్ళం. మరెవరో పద్యాలుగా పూరించవలసిన సమస్యల్లాంటి వాళ్ళం', 'వెళ్ళిపోవాల్సి వచ్చినప్పుడు భలే బాధగా ఉంటుంది. అవమానంగా వుంటుంది. అకాలపు వర్షం యిచ్చిన వో అపురూపమైన ఇంద్రధనుస్సును కొంచెం కొంచెం మనసులోకి వొంపుకుంటుంటే, ఎవరో వచ్చి టైమైపోయిందని పదండని అదిలించినట్లుంటుంది'..*

సజీవమైన భావాలకి అక్షరరూపమొస్తే ఈ వ్యాసాల్లా ఉంటాయి. కేవలం కాలక్షేపం కోసం కాక హృదయాత్మకం చేసుకునే సాహిత్యాన్ని చూడాలని ఉందా..? ఈ పుస్తకాన్ని వెంటనే చదవండి. చదివాక మళ్ళీ, మళ్ళీ చదవాలనిపిస్తే అది మీ పొరబాటు కాదు.. అది రచయిత్రి గొప్పదనం. ఇలాంటి వ్యాసాలు చాలా అరుదుగా వస్తాయి. వచ్చి మన మనసుల్ని వెంటాడుతుంటాయి. !

***

***Matha Publications***
***S-201, Vijayalakshmi Apartments***
***Methodist Colony, Begumpet***
***HYDERABAD – 500 016***



# పుస్తక పరిచయం




**Published by:**

**Vanguri Foundation of America Inc.**
**PO Box 1948,**
**Stafford, TX 77497, USA**
**rvanguri@wt.net**
**Phone(US): 281-277-0445**

**అమెరికా తెలుగు సాహిత్య చరిత్రలోనే** కాక ప్రపంచ తెలుగు సాహిత్య చరిత్రలోనే చిరస్థాయిగా నిలిచిపోయే చారిత్రాత్మక విలువకలిగినదీ పుస్తకం. తెలుగు కథ పుట్టి నూరేళ్ళు దాటిన సందర్భంలో వంగూరి ఫౌండేషన్ వారు ప్రచురించిన ఈ ఉద్గ్రంథం 'బావుంది' అనడం ఉత్తి ప్రశంస..'అమోఘం' అనడం ఏమాత్రం అతిశయోక్తి లేని విషయం. 1960లలో అమెరికాకి తెలుగు వారు రావడం మొదలైనా 70 దశకాల నుంచీ ఎక్కువగా అమెరికాలో స్థిరపడే తెలుగు వారి సంఖ్య పెరిగింది. సహజంగానే మాతృదేశానికి దూరంగా ఉన్నప్పుడు ఆ దిగులు, బెంగ అక్కడి - ఇక్కడి పరిస్థితుల, ఆచార వ్యవహారాల్లోని తేడాలూ, జీవన విధానాల్లోని సామ్యలూ, వైరుధ్యాలూ..ఇలాంటి వన్నీ వారిలోని సృజనాత్మకతకి ముడి పదార్థాలై ఎన్నో రచనలకి ప్రేరణ నిచ్చాయి. సహజంగానే రెండో తరం తెలుగు యువతీ యువకులు తెలుగులో వ్రాయడం అనేది జరగడం లేదు. మళ్ళీ ఇటీవల వచ్చిన సాంకేతిక విప్లవం వల్ల ఇటీవల అమెరిక వస్తున్న తెలుగు యువతీ యువకులు కూడా బాగానే రచనలు చేస్తున్నారు.. ఈ నేపథ్యంలో గత శతాబ్దంలో అమెరికా రచయితలు వ్రాసిన కథల్లో 116 కథల్ని ఎంపికచేసి ఈ సంకలనాన్ని ప్రచురించారు. ఈ బృహత్ప్రయత్నానికి శ్రీకారం చుట్టి విజయవంతంగా పూర్తిచేసిన ఘనత వంగూరి చిట్టెన్ రాజు గారిదే. 20వశతాబ్దపు అమెరికా కథలే కాక అమెరికాలో ఉన్న తెలుగు రచయితల సమగ్ర సూచికని కూడ అనుబంధంగా చేర్చారు. దాదాపు 500 పేజీలు కథలుంటే మిగతా 100 పేజీల్లో అమెరికాలోని తెలుగు రచయితల వివరాలు ఉన్నాయి. కలెక్టర్స్ ఎడిషన్‌లా వెలువడిన ఈ పుస్తకం రాబోయే తరాలకి రిఫరెన్స్ గ్రంథంలా ఉండి పోతుంది. ఆయా రచనల ప్రచురణ కాలం కూడా తెలియచేయడం అమెరికా తెలుగు రచనల క్రమపరిణామాన్ని తెలియచేస్తుంది. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో మంత్రిగా ఉన్న గల్లా అరుణ కుమారి గారు కూడా పాతికేళ్ళ క్రిందట అమెరికాలో తెలుగు కథలు వ్రాశారంటే ఆశ్చర్యం వేస్తుంది.!

ఇంతవరకూ రాకపోవడమే కాదు భవిష్యత్తులో కూడా ఇలాంటి పుస్తకం వస్తుందనడం సందేహాస్పదమే. చారిత్రాత్మక నేపథ్యంలో ఈ పుస్తకాన్ని పదిలపరుచుకోవాలి. తెలుగు భాషమీద ఏమాత్రం అభిమానమున్న వారైనా ఈ గ్రంథాన్ని తమ ఇంట్లో ఉంచుకోవడం గర్వంగా భావిస్తారు. ***




గ్లోబలీకరణ అన్ని దేశాల్లోనూ మార్పులు తెచ్చినట్లే అమెరికాలో నివసించే తెలుగు వారి జీవన విధానంలో కూడా అనూహ్యమైన మార్పులు తెచ్చింది. యాభై యేళ్ళ క్రిందట అమెరికా రావడం అంటే అదొక బృహత్తర కార్యక్రమం. అందరికీ తెలిసేదీ కాదు, అందరికీ చాతనయ్యేది కాదు. గత పదిహేనేళ్ళనుంచీ అమెరికా వస్తున్న తెలుగువారి జీవన విధానాలకీ, 40, 50 సంవత్సరాల క్రిందట అమెరికా వచ్చిన తెలుగువారి జీవన విధానాలకీ ఎంతో వ్యత్యాసం ఉంది. 'ఎంతో' అంటే 'ఎంత', 'ఎలా?'..వీటికి సమాధానమే ఈ పుస్తకం. అలా 50 సంవత్సరాల క్రిందట అమెరికా వచ్చి చదువుకుని ఇప్పటికీ యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియాలో కంప్యూటర్ శాస్త్ర ఆచార్యుడిగా పనిచేస్తున్న శ్రీ వేమూరి వెంకటేశ్వరరావు గారి అలనాటి అమెరికా జ్ఞాపకాలు ఈ పుస్తకంలో అత్యంత ఆసక్తికరంగా, రూపుదిద్దుకున్నాయి. ఇప్పటి తరానికి ఆ జ్ఞాపకాలు అబ్బురాన్ని కలిగిస్తే, ఆ తరం వాళ్ళకీ వాళ్ళ సొంత అనుభవాలని గుర్తుకు తెస్తాయి. తెలుగు వారు అత్యంత అరుదుగు కనిపించే ఆ రోజుల్లో యూనివర్సిటీ జీవితమూ, ఉద్యోగం కోసం పాట్లూ, ఊళ్ళు మారడాలూ, స్నేహాలూ, పరిచయాలు, దశాబ్దాల పాటు అవి కొనసాగిన వైనాలు..ఇందులో ప్రతి అధ్యాయం అరుదైన, విలువైన అనుభవాల సంకలనం. సహజంగానే రచయిత కూడా ఐన ప్రొఫెసర్ వెంకటేశ్వరరావు గారి కలం నుంచీ అందరినీ చదివించే సరళమైన తెలుగు వాక్యాల్లో అందంగా రూపుదిద్దుకుంది ఈ పుస్తకం. ఎప్పుడు ఏ ఛాప్టర్ తెరిచినా చివరంటా చదవాలనిపిస్తుంది. ఎమెస్కో వారు ప్రచురించిన ఈ పుస్తకానికి రాసిన ముందుమాటలో కిరణ్‌ప్రభ ఇలా అన్నారు "కొంతమంది జీవితాల్ని తాము అధిరోహించిన పదవులతో కొలుస్తారు. మరికొందరు ఆస్తులూ, అంతస్తులతో కొలుస్తారు. ఇంకా కొంతమంది జీవితాల్ని తమ అనుభవాలతో, జ్ఞాపకాలతో కొలుస్తారు.." వెంకటేశ్వరరావు గారి అనుభవాలూ, జ్ఞాపకాలూ అందరికీ ఆసక్తి కరమైనవే..!

***

**Emesco Books**
**Surya Rao Peta**
**VIJAYAWADA – 520 002**
**emescobooks@yahoo.com**
**0866-243 6643**